మరవరాని మన చరిత్ర
రూ॥40/-
పేజీలు:40

నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్,
కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 07, సంచిక: 214 | శుక్రవారం | 05-07-2024 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 8+8 | వెల రూ. 5.00

### తొక్కిసలాటలో ఎలా రక్షణ పొందాలంటే?

ప్రజాపక్షం/హైదరాబాద్

భోలే బాబా సత్సంగ్ కార్య క్రమంలో జరిగిన తొక్కిసలాటపై దేశవ్యాప్త చర్చ నేపథ్యంలో ఐపిఎస్ అధికారి స్వాతి లక్రా ఓ వీడియోను షేర్ చేశారు. అనుకోకుండా తొక్కిసలాట జరిగినప్పుడు కిందపడిపోకుండా ఎలా నిలువరించుకోవాలో అందులో ఓ ట్రైనర్ చూపించారు. రద్దీ ఎక్కువగా ఉండి కిందపడిపోయినప్పటికీ ఎలాంటి భంగిమలో తమను తాము రక్షించుకోవచ్చో ప్రాక్టికల్‌గా చేసి చూపించారు.

# బొగ్గు బ్లాకులు సింగరేణికే



## కేటాయించాలని ప్రధాని మోదీకి సిఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి

● శ్రావణపల్లి బొగ్గు బ్లాకును వేలం జాబితా నుండి తొలగించండి ● సింగరేణి కాలరీస్ కంపెనీలో తెలంగాణ ప్రభుత్వానికి 51, కేంద్ర ప్రభుత్వానికి 41 శాతం వాటాలున్నాయి ● రక్షణ శాఖ భూముల 2,450 ఎకరాలు కేటాయించండి ● విభజన చట్టంలో పేర్కొన్న అంశాలను నెరవేర్చాలి ● ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్

సింగరేణి పరిధిలోని బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలని, ప్రస్తుతం వేలంలో పెట్టిన శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌ను వేలం జాబితా నుంచి తొలగించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ రంగంలో ఉన్న సింగరేణి కాలరీస్ కంపెనీ (ఎస్‌సిసిఎల్) లో తెలంగాణ ప్రభుత్వానికి 51 శాతం, కేంద్ర ప్రభుత్వానికి 41 శాతం వాటాలున్నట్లు ప్రధానమంత్రి దృష్టికి ముఖ్యమంత్రి తీసుకెళ్లారు. గనులు, ఖనిజాభివృద్ధి నియంత్రణ చట్టంలోని (ఎంఎండిఆర్) సెక్షన్ 11ఎ, 17 (ఎ) (2) ప్రకారం వేలం జాబితా నుంచి శ్రావణపల్లి గనిని తొలగించాలని, అదే సెక్షన్ ప్రకారం గోదావరి లోయ బొగ్గు నిల్వల క్షేత్రం పరిధిలోని కోయగూడెం, సత్తుపల్లి బ్లాక్ 3 గనులనూ సింగరేణికే కేటాయించాలని ప్రధానమంత్రి మోదీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. రాష్ట్రంలోని విద్యుదుత్పత్తి కేంద్రాల అవసరాలు తీర్చేందుకు ఈ గనుల కేటాయింపు కీలకమైనందున, సింగరేణికే వాటిని కేటాయించాలని ప్రధానమంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీని, హోంశాఖ మంత్రి అమిత్ షాను కలిశారు. బొగ్గు గనుల కేటాయింపు, ఐటిఐఆర్ పునరుద్ధరణ, రక్షణ భూముల కేటాయింపు, రాష్ట్ర పునర్విభజన చట్టంలోని అంశాలు, రాష్ట్ర స్థాయి అత్యున్నత నిఘా విభాగాలైన తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టిజి న్యాబ్), తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజి సిఎస్‌బి) ఆధునీకరణకు అవసరమైన నిధులు కేటాయింపు తదితర అంశాలపై వారు ప్రధాని, హోంమంత్రితో వారు చర్చించారు. అనంతరం ప్రధాని, హోంమంత్రి భేటీలో చర్చించిన అంశాలను సిఎం, డిప్యూటీ సిఎం మీడియాకు వివరించారు.

**హైదరాబాద్‌కు ఐటిఐఆర్‌ను పునరుద్ధరించండి**

2010 సంవత్సరంలో నాటి యుపిఎ ప్రభుత్వం హైదరాబాద్, బెంగళూరు నగరాలకు సమాచార సాంకేతిక పెట్టుబడుల ప్రాంతం (ఐటిఐఆర్) మంజూరు చేసిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఐటి రంగంలో నూతన కంపెనీలు, డెవలపర్లను ప్రోత్సహించేందుకు వీలుగా తెలంగాణ ప్రభుత్వం 3 క్లస్టర్లలో అందుకు అవసరమైన భూమిని గుర్తించిందన్నారు. 2014 తర్వాత ఐటిఐఆర్ ముందుకు సాగలేదని, హైదరాబాద్‌కు ఐటిఐఆర్ పునరుద్ధరించాలని పిఎంను సిఎం కోరారు.

**కోచ్ ఫ్యాక్టరీ, ఐఐఎం మంజూరివ్వండి**

ప్రతి రాష్ట్రంలో ఒక ఐఐఎం స్థాపించాలని కేంద్ర ప్రభుత్వం విధాన నిర్ణయంగా తీసుకున్నప్పటికీ ఇప్పటివరకు తెలంగాణకు ఐఐఎం మంజూరు కాలేదని ప్రధాని మోదీ దృష్టికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకెళ్లారు. వెంటనే హైదరాబాద్‌లో ఐఐఎం మంజూరు చేయాలని, ఇందుకోసం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్‌లో సరిపడా భూమి అందుబాటులో ఉందని తెలిపారు. సెంట్రల్ యూనివర్సిటీలో కాకుండా మరెక్కడైనా ఐఐఎం ఏర్పాటు చేస్తామన్నా ప్రత్యామ్నాయంగా భూమి కేటాయింపునకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర పునర్విభజన సమయంలో కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీకి కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన విషయాన్ని ప్రధానమంత్రి మోదీకి ముఖ్యమంత్రి గుర్తు చేశారు. కోచ్ తయారీ కేంద్రానికి బదులు కాజీపేటలో పీరియాడికల్ ఓవర్‌హాలింగ్ వర్క్‌షాప్ ఏర్పాటు చేస్తున్నట్లు 2023 జులైలో రైల్వే తరువాయి 2లో

“ ప్రస్తుత ఆర్థిక ఏడాది 2024–25 నుంచి ప్రారంభమవుతున్న ప్రధానమంత్రి ఆవాస్ యోజన్ (పిఎంఎవై) పథకంలో 3 కోట్ల గృహాలను లక్ష్యంగా ఎంచుకున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని, అందులో తెలంగాణకు 25 లక్షల ఇళ్లు మంజూరు చేయండి. పిఎంఎవై మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాల విధివిధానాలను రూపొందించేందుకు సిద్ధంగా ఉంది.

“ రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం తెలంగాణలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి బయ్యారంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఇప్పటికే సాధ్యాసాధ్యాల నివేదికలు సమర్పించాయి. వెంటనే ఉక్కు కర్మాగారాన్ని నెలకొల్పే ప్రక్రియను వేగవంతం చేయండి.

# బంద్ సక్సెస్

స్వచ్ఛందంగా పాఠశాలల మూసివేత

నీట్, యూజిసి-నెట్ లీకేజీలపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్రమైన దర్యాప్తు జరిపించాలని విద్యార్థి, యువజన ఐక్య కార్యాచరణ కమిటీ డిమాండ్




ప్రజాపక్షం/హైదరాబాద్

యువజన సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ చేపట్టిన విద్యా సంస్థల బంద్ విజయవంతమైంది. నీట్, యూజిసినెట్ లీకేజీలపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్రమైన దర్యాప్తు చేపట్టడంతో పాటు కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను బర్తరఫ్ చేయడంతో పాటు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)ను రద్దు చేసి, లీకేజీల వల్ల విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం విద్యార్థి, యువజన సంఘాల ఐక్యకార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌యుసి, ఎఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, పిడిఎస్, విజెఎస్, ఎఐవైఎఫ్, డివైఎఫ్‌ఐ, పివైఎల్ తదితర సంఘాలు విద్యాసంస్థల బంద్‌ను నిర్వహించాయి. దీంతో పలు విద్యాసంస్థలు స్వచ్ఛంధగా బంద్‌కు మద్దతు ప్రకటించగా, మరికొన్ని చోట్ల విద్యార్థి , యువజన సంఘాలు ఎక్కడికక్కడ విద్యాసంస్థలు మూసివేయించి బంద్ పాటించారు. . ఈ సందర్భంగా విద్యార్థి , యువజన సంఘాల నాయకులు మాట్లాడుతూ నీట్, యూజీసీనెట్ పరీక్ష పేపర్ లీకేజీల వల్ల దేశంలో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ పేపర్ లీకేజీ కేసులో ఇప్పటి వరకు బీహార్ పోలీసులు 14మందిని అరెస్టు చేశారని, మరికొంత మందికి నోటీసులు జారీచేసి సీబీఐ విచారణ అంటూ కేంద్ర ప్రభుత్వం చేతులు దులుపుకుందే తప్ప ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ దర్యాప్తు ఇంత వరకు చేపట్టలేదని మండి పడ్డారు. గత ఏడేళ్లలో బిజెపి పాలిత రాష్ట్రాలలో సుమారు 70 ప్రవేశ, పోటీ పరీక్షల పేపర్స్ లీకేజీ అయ్యాయని, దీనివల్ల 1.7 కోట్ల మంది అభ్యర్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా తరువాయి 2లో



# ప్రజా సమస్యలే ప్రధాన ఎజెండా

వాటి పరిష్కారానికి కొమురయ్య వంటి అమరులే స్ఫూర్తి

మరింత సమరశీల పోరాటాలు నిర్వహిస్తాం

సమస్యలు పరిష్కరించకుంటే ప్రభుత్వంతో రాజీపడే ప్రసక్తే లేదు

దొడ్డి వర్ధంతి సభలో కూనంనేని

ప్రజాపక్షం/హైదరాబాద్

నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం స్ఫూర్తే నేటి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి నాంది పలికిందని, తద్వారా తెలంగాణ ప్రజల స్వరాష్ట్ర స్వప్నం సహాకారమైందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తొలి అమరుడు దొడ్డి కొమురయ్య పేరు తెలంగాణ చరిత్రలో తరువాయి 2లో

# కొమురయ్య కీర్తి సజీవం

ఆయన ఆశయాలు కొనసాగిస్తాం

హైదరాబాద్‌లో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్



తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పది సంవత్సరాలు గడిచినా.. తెలంగాణ సాయుధ పోరాటంలో అసువులుబాసిన తొలి అమరుడు దొడ్డి కొమురయ్య విగ్రహం రాష్ట్ర రాజధానిలో లేకపోవడం బాధాకరం అని రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. తెలంగాణ చరిత్ర ఉన్నంత వరకు దొడ్డి కొమురయ్య గారి కీర్తి సజీవంగా ఉంటుందని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయిస్తానని, తమ పాలనలో దొడ్డి కొమురయ్య ఆశయాలు కొనసాగిస్తామని ఆయన ప్రకటించారు. గురువారం రవీంద్ర భారతిలో జరిగిన దొడ్డి కొమురయ్య వర్ధంతి వేడుకల్లో పాల్గొని ఆ మహానుభావుడికి నివాళులు అర్పించిన మంత్రి గత ప్రభుత్వం ఉద్యమాలను, ఉద్యమకారులను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆనాటి దొడ్డి కొమురయ్య పోరాటమే స్ఫూర్తిగా నిలిచి ఇంధనంగా పనిచేసిందని మంత్రి అన్నారు. నిజాం నిరంకుశత్వానికి, దేశ్ ముఖ్‌ల వెట్టికి, ఆగడాలకు వ్యతిరేకంగా పోరాడి వీరమరణం పొందిన వీరుడు దొడ్డి కొమురయ్యని ఆయన కీర్తించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరుడు తరువాయి 2లో



# జార్ఖండ్ సిఎంగా హేమంత్ సోరెన్ ప్రమాణం

**రాంచీ :** జెఎంఎం కార్యనిర్వాహక అధ్యక్షుడు హేమంత్ సోరెన్ గురువారం నాడు జార్ఖండ్ 13వ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. గురువారం సాయంత్రం 5 గంటలకు రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ సిపి రాధాకృష్ణన్ హేమంత్ సోరెన్‌తో ప్రమాణం చేయించారు. కార్యక్రమానికి సోరెన్ తండ్రి, జెఎంఎం సుప్రీం శిభు సోరెన్, తన తల్లి రూపి సోరెన్, భార్య కల్పన, పార్టీ సీనియర్ నేతలు, జెఎంఎం నేతృత్వంలోని కూటమి నాయకులు కూడా హాజరయ్యారు. అదే విధంగా బుధవారం నాడు సిఎం పదవికి రాజీనామా చేసిన చంపాయి సోరెన్ తరువాయి 8లో



రాజ్యసభ సభ్యత్వానికి

# కెకె రాజీనామా

ప్రజాపక్షం/హైదరాబాద్

రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.కేశవరావు తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు గురువారం రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌ను కలిసి తన రాజీనామా లేఖను అందజేశారు. అనంతరం డాక్టర్ కేశవరావు మీడియాలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో చేరినందున తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. రాజ్యసభ సభ్యునిగా తనకు ఇంకా రెండేళ్ల కాలపరిమితి ఉందని తెలిపారు.

# రైతన్నల్లో నైరాశ్యం



## ఖమ్మంజిల్లాలో మరో రైతు ఆత్మహత్యాయత్నం

ప్రజాపక్షం/ ఖమ్మం

భూ వివాదాలలో జరుగుతున్న తీవ్ర జాప్యం రైతన్నలకు శాపంగా మారింది. సంవత్సరాల తరబడి గ్రామ పెద్దల నుంచి రెవెన్యూ కార్యాలయాలు, న్యాయస్థానాల చుట్టూ తిరిగినా ఫలితం దక్కకపోవడంతో నైరాశ్యానికి గురై ఆత్మహత్యల వైపు మొగ్గు చూపుతున్నారు. ఖమ్మంజిల్లాలో రెండు రోజుల క్రితం జరిగిన బోజడ్ల ప్రభాకర్ ఆత్మహత్య ఘటన మరువక ముందే కారేపల్లి మండలంలో మరో రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మాజీ ఐపిఎస్ అధికారి తన భూమిని ఆక్రమించాడని ఏం చేసినా ఫలితం దక్కకపోవడంతో పురుగు మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లి పంచాయితీకి చెందిన పచ్చిపాల భద్రయ్య తనకున్న 1.20 ఎకరాల భూమిని మాజీ ఆర్టిఐ కమిషనర్ గుగులోత్ శంకర్ నాయక్ ఆక్రమించాడని ఆరోపిస్తూ చేలోనే పురుగు మందు సేవించాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఇల్లందు ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. భూ వివాదాలకు సత్వర పరిష్కారం లభించడం లేదు. సంవత్సరాల తరబడి తిరిగినా ఎటువంటి ఫలితం దక్కడం లేదు. సర్వే నెంబర్లలో పొరపాట్లు, భూ విస్తీర్ణంలో తేడాలు, ఒకరి భూమి మరోకరి పేరున రికార్డుల్లో నమోదు కావడం, కొన్ని పట్టా భూములను ఇతరులు తమ పేరున పట్టా చేయించుకోవడం లేదా తరువాయి 8లో



# ఎమ్మెల్యే లాకర్‌లో 1.2కిలోల గోల్డ్

అక్రమ బంగారమని తేల్చిన ఇడి అధికారులు

ప్రజాపక్షం/హైదరాబాద్

బిఆర్‌ఎస్ పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి బ్యాంక్ లాకర్‌లో ఇడి అధికారులకు రూ.కోటి విలువ చేసే 1.2 కిలోల బంగారు బిస్కెట్లు లభ్యమయ్యాయి. ఈ బంగారు బిస్కెట్లను ఇటి అధికారులు సీజ్ చేశారు. ఇందుకు సంబంధించిన రసీదులు ఎమ్మెల్యే వద్ద లేకపోవడం దొంగబంగారంగా ఇడి అధికారులు తేల్చారు.రూ.300 కోట్ల విలువైన లోహాలు, ఖనిజాలను అక్రమంగా దోపిడీ చేశారంటూ పటాన్‌చెరు పోలీసులు దాకలు చేసిన ఎఫ్‌ఐఆర్ ఆధారంగా ఇడి తరువాయి 8లో

# ప్రేమ పూరవ్ మృతికి సిపిఐ సంతాపం



**న్యూఢిల్లీ :** స్వాతంత్ర్య సమరయోధురాలు ప్రేమ పూరవ్ కన్నుమూశారు. ఈనెల 2వ తేదీన పుణెలో మృతి చెందినట్లు ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రేమ మృతికి సిపిఐ జాతీయ కార్యదర్శి వర్గం ఒక ప్రకటనలో సంతాపం తెలిపింది. ఆమె చిత్రపటం వద్ద నివాళి అర్పించింది. స్వాతంత్ర్య సమరయోధురాలు మృతి పార్టీకి, ప్రజా ఉద్యమానికి, దేశానికి తీరని లోటని పేర్కొంది. భారత స్వాతంత్రోద్యమంలో, మహారాష్ట్ర తరువాయి 2లో



# జగజ్జేతలకు జేజేలు

క్రికెట్ ఫ్యాన్స్‌తో జనసంద్రంగా మారిన ముంబయి సముద్ర తీరం

పదేహేడేళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ టీ20 ప్రపంచకప్ సాధించి విశ్వవేదికపై భారత కీర్తి పతాకాన్ని ఎగురవేసిన టీమిండియా స్వదేశానికి చేరుకుంది. ఉదయం ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీని కలిసిన రోహిత్ సేన.. ముంబయికి చేరుకుంది. మెరైన్ రోడ్డులో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ కప్ గెలిచిన భారత ఆటగాళ్లు ఓపెన్ టాప్ బస్‌లో నిల్చుని రోడ్ షోలో పాల్గొన్నారు.



కరేబియా ఆగ్నేయ ప్రాంతంలో బీభత్సం సృష్టించిన బెరిల్ తుపాను మరింత బలపడి, జమైకా మీదుగా మెక్సికో వైపు దూసుకెళుతున్నది. ఇది శుక్రవారం నాటికి కేమన్ ఐలాండ్స్ వద్ద కేంద్రీకృతం కావచ్చని గ్రెనెడా జాతీయ తుపాను నియంత్ర కేంద్రం ప్రకటించింది. అక్కడి నుంచి మెక్సికోలోని యుకాటాన్ ద్వీపకల్పాం వద్ద తీరం తేరే అవకాశం ఉందని తెలిపింది. అత్యంత శక్తివంతమైన తుపానుల జాబితాలో నాలుగో విభాగంలో చేరిన ఈ తుపాను పలు ప్రాంతాలపై తీవ్ర ప్రభావం చూపింది. ఉవ్వెత్తున ఎగసిపడిన అలలు తీర ప్రాంతాన్ని కోతకు గురి చేశాయి. ఈ తుపాను కారణంగా ఇప్పటి వరకూ ఏడుగురు మృతి చెందారు. నష్టంపై వివరాలు అందాల్సి ఉంది.



గాజాలో పాలస్తీనియన్లపై జరుగుతున్న మారణ కాండను నిరసిస్తూ, వేలాది మంది గురువారం ఆస్ట్రేలియా పార్లమెంటు భవనాన్ని ముట్టడించే ప్రయత్నం చేశారు. అక్కడ పాలస్తీనా జెండాను ఎగురువేయడం ద్వారా, పాలస్తీనాకు ప్రపంచ దేశాల మద్ద తు కూడగట్టేందుకు కదం తొక్కారు. ఇజ్రాయిల్ జరుపుతున్న దాడుల్లో 38,000 మంది మృతి చెందినట్టు పాలస్తీనా ప్రభుత్వం ప్రకటించింది. అంతర్జాతీయ యుద్ధ నియమాలకు విరుద్ధంగా, పౌరులపై ఇజ్రాయెల్ దాడులు చేస్తున్నదని ఆరోపించింది. ఆసుపత్రులు, పాఠశాలలు, సహాయక శిబిరాలపైనా దాడులతో మృతుల సంఖ్య పెరుగుతున్నది.




భారత సంతతికి చెందిన బోధనా శివానందన్ చెస్‌లో సరికొత్త రికార్డు నెలకొల్పింది. తొమ్మిదేళ్ల ఈ అసాధారణ క్రీడాకారిణి, ఈ ఏడాది సెప్టెంబర్ 10 నుంచి 24వ తేదీ వరకూ హంగరీ రాజధాని బుడాపెస్ట్‌లో జరగనున్న చెస్ ఒలింపియాడ్‌లో ఇంగ్లాండ్ మహిళల జట్టుకు ప్రాతినిధ్యం వహించనుంది. కేవలం చెస్ మాత్రమేగాక, మరే ఇతర క్రీడల్లోనూ, ఇంత చిన్న వయసులో ఇంగ్లాండ్ తరఫున ఇప్పటి వరకూ ఎవరూ అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనలేదు. ఈ రికార్డును సొంతం చేసుకున్న బోధన కరోనా సమయంలో చెస్ ఆటను నేర్చుకుంది. ఆటలో అద్భుతమైన ప్రావీణ్యాన్ని ప్రదర్శించింది. ఫిడే అంతర్జాతీయ మాస్టర్ హోదాను సంపాదించింది.

ప్రపంచం

# సిఎస్ఒకు పుతిన్, జిన్‌పింగ్



**అస్తానా (కజకిస్థాన్):** పాశ్చాత్య కూటమిలను సమర్థం గా ఎదుర్కోవడానికి అనుసరించాల్సిన వ్యూహాలను రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు క్సి జిన్‌పింగ్ చర్చించనున్నారు. ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో యుద్ధాలు, ప్రచ్ఛన్న యుద్ధాలు కొనసాగుతున్న తరుణంలో వీరి భేటీ ప్రాధాన్యతను సంతరించుకుంది. కజకిస్థాన్ రాజధాని అస్తానాలో జరిగే షాంఘై కోపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సిఒ) శిఖరాగ్ర సమావేశాలకు వీరిద్దరు హాజర్యారు. ఇందులో సభ్యులుగా ఉన్న ఇతర దేశాల నాయకులు కూడా అస్తానా చేరుకున్నారు. ప్రాంతీయ భద్రత, ఆర్థిక సహకారాన్ని ప్రోత్సహించడానికి చైనా, రష్యాతోపాటు నాలుగు మాజీ సోవియట్ మధ్య ఆసియా దేశాలైన కజకిస్థాన్, కిర్గిజిస్తాన్, తజికిస్తాన్, ఉజ్బెకిస్తాన్ సభ్య దేశాలుగా 2001లో ఈ సంస్థ ప్రారంభమైంది. ఆ తర్వాత భారత్, పాకిస్తాన్, ఇరాన్ దేశాలు ఇందులో చేరాయి. రష్యాకు పశ్చిమాన ఉన్న మిత్రదేశం బెలారస్ గురువారం ఎస్‌సిఒలో చేరింది. ఈ కూటమిలో చేరేందుకు టర్కీ, సౌదీ అరేబియా, ఈజిప్టు దేశాలు సిద్ధంగా ఉన్నాయి. ఈ సమిట్‌ను ఉద్దేశించి పుతిన్ మాట్లాడుతూ, సభ్య దేశాల భద్రతపై దృష్టి కేంద్రీకరిస్తున్నట్టు చెప్పారు. వేర్పాటువాదం, తీవ్రవాదంపై పోరాడేందుకు ఎస్‌సిఒ సభ్య దేశాలు ప్రత్యేక కార్యక్రమాన్ని ఆమోదిస్తాయని ఆయన తెలిపారు. చైనా అధికార వార్తా సంస్థ జిన్‌హువా కథనం ప్రకారం, వివిధ రకాలుగా ఎదురవుతున్న సవాళ్లను తిప్పికొట్టడానికి ఎస్‌సిఒ సభ్య దేశాలన్నీ ఏకం కావాలని జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. ప్రచ్ఛన్న యుద్ధ మనస్తత్వంతో పొంచి ఉన్న ముప్పు నుంచి కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. సమావేశానికి కజకిస్తాన్ అధ్యక్షుడు కస్సిమ్‌జోమార్ట్ టోకయేవ్, పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షావ్కత్ మిర్జియోయెవ్, తజికిస్థాన్ అధ్యక్షుడు ఎమోమాలి రఖ్మోన్, కిర్గిజిస్తాన్ అధ్యక్షుడు సదిర్ ఝపరోవ్ తదితరులు హాజరయ్యారు. ఈ సమావేశానికి భారత ప్రధాని నరేంద్ర మోదీ హాజరు కాలేదు. ఆయన తరఫున భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ పాల్గొన్నారు.

# డెమోక్రాటిక్ అభ్యర్థిని నేనే..



**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మరోసారి తానే పోటీ లో ఉంటానని స్పష్టం చేశారు. ఇటీవల రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనా ల్డ్ ట్రంప్‌తో జరిగిన డిబేట్‌లో డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థిగా ఉన్న బైడెన్ పేలవంగా మాట్లాడి, అందరినీ నిరాశకు గురిచేసిన విషయం తెలిసిందే. ఈ ఏడాది నవంబర్‌లో జరిగే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో బైటెన్ కంటే వైస్ ప్రెసిడెంట్ కమలా హారిస్ అభ్యర్థిత్వాన్ని ఎక్కువ మంది సమర్థిస్తున్నారని సిఎన్ఎన్ ఒక సర్వే నివేదికను విడుదల చేయడంతో చర్చ మొదలైంది. ఆ సమావేశంలో బైడెన్ పలుమార్పు తడబడ్డాడు. అతని స్వరం చాలా నీరసంగానూ, నిరాసక్తంగానూ వినిపించింది. వేదికపైనే స్పృహతప్పి పడిపోతాడేమోనన్న రీతిలో బైడెన్ పరిస్థితి కనిపించింది. అయితే, విశ్రాంతి లేకుండా పర్యటించడంతో శారీరకంగా అలసిపోయానని, డిబేట్ సమయంలో నిద్ర తనను ఆవహించిందని బైడెన్ వివరణ ఇచ్చుకున్నాడు. కాగా, బైడెన్‌పై ట్రంప్ అన్ని విధాలా పైచేయి సాధించడంతో, అధ్యక్ష పదవికి అభ్యర్థిని మార్చాలన్న ఆలోచనలో డెమోక్రాట్లు ఉన్నట్టు వార్తలు వచ్చాయి. అయితే, ఈ వాదనను బైడెన్ ఖండించాడు. తానే రేసులో ఉన్నానని స్పష్టం చేశాడు. తన అభ్యర్థిత్వాన్ని ఎవరూ వ్యతిరేకించలేదని అన్నాడు. ట్రంప్‌పై తాను విజయం సాధించడానికి కమలా హారిస్ సహకారాన్ని అందిస్తుందని బైడెన్ వ్యాఖ్యానించాడు.





# లేబర్ పార్టీకే విజయావకాశాలు!

**లండన్:** యునైటెడ్ కింగ్‌డమ్ (యుకె) సార్వత్రిక ఎన్నికల్లో అధికార కన్జర్వేటివ్ పార్టీపై లేబర్ పార్టీ ఆధిక్యాన్ని ప్రదర్శించి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్న వాదన బలంగా వినిపిస్తున్నది. వివిధ సర్వేలు కూడా ఇదే విషయాన్ని పేర్కొంటున్నాయి. స్థానిక కాలమానం ప్రకారం గురువారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ రాత్రి 10 గంటలు (భారత కాలమానం ప్రకారం శుక్రవారం తెల్లవారు జామున 2.40 గంటలు)కు ముగుస్తుంది. ప్రధాని రిషి సునాక్ తీసుకున్న పలు నిర్ణయాలు వివాదాస్పదంగా మారడంతో, ఆయన నాయకత్వం వహిస్తున్న కన్జర్వేటివ్ పార్టీలోనే నిరసనలు ప్రారంభమయ్యాయి. పలువురు ఎంపిలు రాజీనామా చేయడంతో సునాక్ బృందం ఇరకాటంలో పడింది. మరోవైపు లేబర్ పార్టీ బలాన్ని పుంజుకుంది. వీసా జారీ నుంచి గ్రీన్‌కార్డ్ ఆమోదం వరకూ వివిధ అంశాలపై ఆ పార్టీ చీఫ్ కెయిర్ రాడ్నీ స్టార్మర్ ఇచ్చిన వాగ్దానాలు ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. పోలింగ్‌కు ముందే ప్రజాభిప్రాయం లేబర్ పార్టీకి అనుకూలంగా ఉందనే వార్తలు వచ్చాయి. ఫలితాలు ఎలావున్నా, బ్రిటన్ ప్రధానిగా భారత సంతతికి చెందిన ఒక వ్యక్తి ఎన్నిక కావడం చరిత్ర పుటల్లోకి ఎక్కుతుంది. సునాక్ ఈ రికార్డును సొంతం చేసుకున్నారు.



# ఇజ్రాయెల్‌పై హిజ్బుల్లా దాడులు

**బీరూట్:** ఇజ్రాయెల్ సైనిక స్థావరాలపై దాడులు నిర్వహించినట్టు హిజ్బుల్లా ప్రకటించిది. సుమారు 200 ర్యాకెట్లను ప్రయోగించామని, ఇజ్రాయెల్ సైనిక కమాండర్ ఒకరు మృతి చెందారని తెలిపింది. అయితే, ఈ దాడిని ఇజ్రాయెల్ అధికారికంగా ధ్రువీకరించలేదు. గాజాలో పాలస్తీనియన్లపై జరుపుతున్న దాడులను తక్షణమే నిలిపివేయాలని హిజ్బుల్ డిమాండ్ చేస్తున్నది. కాల్పుల విరమణకు ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు ససేమిరా అనడంతో, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. దీనికి తోడు హిజ్బుల్ స్థావరాలపై ఇజ్రాయెల్ దాడులు చేసింది. దీనితో ప్రతికార దాడులు మొదలయ్యాయి. ఇలావుంటే, కాల్పుల విరమణకు మంత్రివర్గంలోని కొందరు పట్టుబడుతున్నారన్న వార్తలను నెతన్యాహు ఖండించారు. గాజా స్ట్రిప్ నుంచి హమాస్ ఉగ్రవాదులను ఏరివేసే వరకూ దాడులు ఆగవని ప్రకటనలో తెలిపారు.

## కొమురయ్య కీర్తి సజీవం

**(మొదటి పేజీ తరువాయి)**

దొడ్డి కొమురయ్య పోరాటం అసామాన్యమైందని మంత్రి గుర్తు చేశారు. ఆనాడు దేశమంతా స్వాతంత్ర్య సంబరాల్లో మునిగిపోతే.. మన ప్రాంతం నిజాం పాలనలో మగ్గిపోవడం ఇష్టం లేక వీరోచిత పోరాటం చేసిన ఉద్యమ నాయకుడు దొడ్డి కొమురయ్య అని ఆయన అన్నారు. ఆంధ్ర మహా సభ సందేశంతో యువకులంతా ఒక్కటై ఉద్యమిస్తుంటే నిజాం సేనలు తట్టుకోలేక ఉద్యమకారులపై కాల్పులు జరపడంతో దొడ్డి కొమురయ్య చనిపోయాడని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీ యెగ్గే మల్లేషం, బీసీ కమీషన్ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, కమీషనర్ బాలమాయాదేవి, చంద్రశేఖర్, అలోక్ కుమార్, మల్లయ్యభట్టుతో పాటు వివిధ బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ప్రేమ పూరవ్‌కు సిపిఐ సంతాపం

**(మొదటి పేజీ తరువాయి)**

రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని కొనియాడింది. గొప్ప ఆర్గనైజర్ అని, ముంబయి, నవీ ముంబయి, పుణెలో అసంఘటిత మహిళలు, స్వయం ఉపాధి మహిళలు నిర్వహించే 'అన్నపూర్ణ' అనే సంస్థను నెలకొల్పారని ప్రశంసించింది.

**హత్రాస్ మృతులకు సంతాపం**

ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో జరిగిన తొక్కిసలాటలో మృతి చెందిన 130 మందికి సిపిఐ సంతాపం తెలిపింది. బాధితులకు తిగిన పరిహారం అందించాలని, ఘటనపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. ఆధ్మాత్మిక కార్యక్రమం నిర్వహించిన బాబాను, బాధ్యులైన నిర్వాహకులను కఠినంగా శిక్షించాలని కూడా డిమాండ్ చేసింది. గత అనేక సంవత్సరాల నుండి అహేతుక ఆలోచనలు, గుడ్డి విశ్వాసాలు అదుపు లేకుండా వ్యాప్తి చెందడానికి అనుమతులివ్వడాన్ని చాలా తీవ్రంగా పరిగణించాలని, వాటి ఫలితంగానే ఇటువంటి విషాద ఘటనలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేసింది.

## బంద్ సక్సెస్

**(మొదటి పేజీ తరువాయి)**

మారాయని, మరోవైపు వెలుగులోకి రాని లీకేజీలు ఇంకెన్నో ఉన్నాయని విమర్శించారు. పేపర్ లీకేజీల వల్ల విద్యార్థులకు, నిరుద్యోగ అభ్యర్థులకు పోటీ, ప్రవేశ పరీక్షల పై ఉన్న విశ్వసనీయత, నమ్మకం దెబ్బతింటుందని, నీట్ మరియు నెట్ పేపర్స్ లీకేజి వల్ల నష్టపోయిన అభ్యర్థులకు న్యాయం చేయమంటే కేంద్ర ప్రభుత్వం తమ తప్పును కప్పి పుచ్చుకోవడం కోసం 'ది నోటిఫికేషన్ ఆఫ పబ్లిక్ ఎగ్జామినేషన్స్' చట్టాన్ని తీసుకొస్తున్నట్టు ప్రకటించడం సిగ్గుచేటని అన్నారు.

తక్షణమే కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, యూజీసీ చైర్మన్ మామిడాల జగదీష్ కుమార్, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) చైర్మన్ ప్రదీప్ కుమార్ జోషిలను భర్తరఫ్ చేసి, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్.టి.ఏ) రద్దు చేయడంతో పాటు నీట్ ప్రవేశ పరీక్షను తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేశారు.

అదేవిధంగా నీట్, యూజీసీనెట్ పేపర్ లీకేజి కేసు పై సుప్రీం కోర్టు జడ్జితో సమగ్రమైన దర్యాప్తు జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని, ఎన్‌టిఏ నిర్వాకం వల్ల నష్టపోయిన అభ్యర్థులకు న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులుఆర్ బాలకృష్ణ, కార్యనిర్వహక అధ్యక్షులు షేక్ మైమూద్, నరేందర్ శేఖర్ యాదవ్ అనిల్ శ్రీనివాస్ గౌడ్ దిలీప్ కుమార్ ఎఐఎస్‌ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మెట్టెల చైతన్య యాదవ్, వైజెఎస్ రాష్ట్ర కార్యదర్శి పి, ప్రశాంత్, నాయకులు కొత్తరవి,ఎన్ఎస్‌యుఐ నాయకులు దిక్షిత్‌లు పాల్గొన్నారు.

# టార్చిలైట్ వేసి వెతికినా బిఆర్ఎస్ కనిపించడంలేదు

## ఎంఎల్‌ఎల చేరికల విషయంలో గతంతో పోలిస్తే తాము చాలా ప్రజాస్వామికంగానే ఉన్నాం

## ఢిల్లీలో మీడియాతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**ప్రజాపక్షం / హైదరాబాద్:** ''బిఆర్ఎస్ పార్టీ కోసం ప్రజలు రావడం కాదు. అసలు ఆ పార్టీ ఎక్కడ ఉందని ప్రజలు టార్చ్‌లైట్ వేసి వెతుక్కోవాల్సిన పరిస్థితి వచ్చింది. బిఆర్ఎస్ పార్టీని పార్లమెంట్‌లో జీరో చేశాం. టార్చ్‌లైట్ పెట్టి వెతికినా ఒక్క ఎంపి కనిపించరు. 23 ఏళ్ల చరిత్రలో మొదటిసారి లోక్‌సభలో బిఆర్ఎస్ పార్టీకి ప్రాతినిధ్యం లేకుండా పోయింది'' అని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. 'మళ్లీ అధికారం బిఆర్ఎస్ పార్టీదేనని, కాంగ్రెస్‌పై జనాల్లో విరక్తి మొదలైంది. ప్రజలు టార్చిలైట్ వేసుకుని బిఆర్ఎస్‌కు వస్తారు' అని కెసిఆర్ చేసిన వ్యాఖ్యలపై సిఎం రేవంత్‌రెడ్డి గురువారం ఢిల్లీలో స్పందించారు. బిఆర్ఎస్, బిజెపి గురించి తెలంగాణ ప్రజలు అసలు పట్టించుకోవడలేదన్నారు. గతంలో ఇతర పార్టీల నుండి చేరిన నేతలకు కండువాలు కప్పేటప్పుడు బిజెపికి ఫిరాయింపులు గుర్తు రాలేదా అని ఆయన ప్రశ్నించారు. కెసిఆర్ పట్ల బిజెపి సానుభూతి దేనికోసం? బిజెపి, కెసిఆర్ ప్రేమించుకుంటే తమకు అభ్యంతరం లేదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌లో ఎంఎల్ఎల చేరికల విషయంలో గతంతో పోలిస్తే తాము చాలా ప్రజాస్వామికంగానే ఉన్నామని సిఎం స్పష్టం చేశారు.

రాష్ట్ర మంత్రివర్గాన్ని విస్తరించింది మీడియానే.. ఆయా నాయకులకు శాఖలు కేటాయించింది మీడియానే.. వాయిదా వేసింది కూడా మీడియానే.. అని సిఎం అన్నారు. మంత్రివర్గ విస్తరణ విషయాన్ని హైకమాండ్ దృష్టికి తీసుకువెళ్లామని వారి పరిశీలనలో ఉందని చెప్పారు. టిపిసిసి అధ్యక్షునిగా తన పదవి కాలం ముగుస్తున్న విషయం కూడా అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లినట్లు రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బిజెపి ఎంపి ఈటల రాజేందర్ పార్టీ ఫిరాయింపులపై మాట్లాడుతున్నా రు. గతంలో కెసిఆర్ ఫిరాయింపులు ప్రోత్సహించి కాంగ్రెస్ ఎంఎల్‌ఎలను చేర్చుకున్నప్పుడు ఈటల ఎక్కడున్నారు. 20 ఏళ్లు బిఆర్ఎస్‌లో ఉన్న ఆయన ఇప్పుడు ఏ పార్టీలో ఉన్నారో చెప్పాలి. ఈటలకు ఇంకా కెసిఆర్‌పై ప్రేమ తగ్గలేదు' అని సిఎం అన్నారు.

# ఈవి ఛార్జ్ పాయింట్ ఆపరేటర్‌లకు సింగిల్ విండో క్లియరెన్స్

**కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ**

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** రాష్ట్రంలో ఈవి ఛార్జ్ పాయింట్ ఆపరేటర్‌లకు సింగిల్ విండో క్లియరెన్స్ త్వరలోనే రానుంది. ఈ మేరకు బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బిఈఈ) ద్వారా కనీస డాక్యుమెంటేషన్‌తో ఈవి ఛార్జ్ పాయింట్ ఆపరేటర్లకు విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కామ్‌లు) విద్యుత్ కనెక్షన్‌లను మంజూరు చేయడానికి అనుమతించనున్నారు. మరీముఖ్యంగా సింగిల్ విండో సిస్టమ్ కోసం డ్రాఫ్ట్ స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌ఓపి) జారీ చేస్తారు. ఈ మేరకు గురువారం కేంద్ర విద్యుత్ మంత్రిత్వశాఖ ఆదేశాల జారీ మేరకు సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీతో ఈ మేరకు సంప్రదింపులు జరుగుతున్నాయి. డ్రాఫ్ట్ ఎస్‌ఓపి యొక్క కొన్ని ముఖ్యాంశా లు ఇలా ఉన్నాయి. పబ్లిక్ ఈవి ఛార్జింగ్ పాయింట్ స్టేషన్ల కోసం విద్యుత్ కనెక్షన్ ఆమోదం, క్లియరెన్స్‌లను క్రమబద్ధీకరించడం స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌ఓపి) లక్ష్యంగా ఉంటుంది. ఎస్‌ఓపి పబ్లిక్ ఈవి ఛార్జింగ్ కనెక్షన్‌ల మంజూరు కోసం ఒకే పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ ఆన్‌లైన్ ప్లాట్ ఫారమ్‌ను ప్రతిపాదిస్తుంది.రాష్ట్ర డిస్కమ్‌లు అటువంటి సింగిల్ విండో సిస్టమ్, పోర్టల్‌ను అందజేస్తాయి, ఇక్కడ ఈవి సిపిఓ దరఖాస్తులను సమర్పించవచ్చు.

ఎస్‌ఓపి వేగవంతమైన అమలును నిర్ధారించడానికి క్లియరెన్స్ ప్రక్రియ ప్రతి దశకు టైమ్‌లైన్‌లను ఏర్పాటు చేస్తుంది. ఆన్‌లైన్ పోర్టల్ దృశ్యమానత ఛార్జింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్‌స్టాలేషన్‌ల స్థితిని పర్యవేక్షించడం కోసం సంబంధిత రాష్ట్ర నోడల్ ఏజెన్సీ, సెంట్రల్ నోడల్ ఏజెన్సీ పోర్టల్‌లతో ఏకీకృతం చేయబడుతుంది. బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ 10 జూలై 2024 నాటికి ఎస్‌ఓపి ముసాయిదా పై వారి ఇన్‌పుట్‌లు లేదా వ్యాఖ్యలను అందించడానికి అన్ని వాటాదారులను ఆహ్వానించడం గమనార్హం.

## ప్రజా సమస్యలే ప్రధాన ఎజెండా

**(మొదటి పేజీ తరువాయి)**

సువర్ణ అక్షరాలతో లిఖించబడిందన్నారు. దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతి బిసి హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో గురువారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దుంభవన్‌లోని రాజ్ బహుదూర్ గౌర్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా నాయకులు దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలాలు వేసి నివాళ్లు అర్పించారు. బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన వర్ధంతి సభలో కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, ఎన్.బాలమల్లేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఉజ్జని రత్నాకర్‌రావు, తెలంగాణ రాష్ట్ర గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సంఘం అధ్యక్షులు కె.కాంతయ్య, మహిళా సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.లక్ష్మి, సిపిఐ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కార్యదర్శి డి.జె.సాయిలు గౌడ్, సహాయ కార్యదర్శులు దామోదర్‌రెడ్డి, ఉమామహేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ సిపిఐ ప్రధాన ఎజెండా ప్రజా సమస్యలేనని, వాటి పరిష్కారానికి నాటి దొడ్డి కొమురయ్య లాంటి అనేక మంది అమరవీరులే స్ఫూర్తిగా మరింత సమరశీల పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీతో పొత్తు ఉందని, అయితే ఇది రాజకీయ అవగాహన మాత్రమేనని, ప్రజా సమస్యలను పరిష్కరించకపోతే ప్రభుత్వంతో రాజీ పడే ప్రసక్తే ఉండదని ఆయన స్పష్టం చేశారు. పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ అనాడు ఏ తెలంగాణ సాయుధ పోరాట యోధుల పేరు చెప్పుకుని ఉద్యమం సాగించారో అదే కెసిఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత కండివెండిలో తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య పేరుతో స్మారక భవనం నిర్మించి ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరితే 10 ఏళ్ల కాలంలో కనీసం పట్టించుకోలేదన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య పేరు మీద స్మారక భవనం నిర్మించడంతోపాటు ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రతి ఏటా ఆయన వర్ధంతి వేడుకలను ఎంతో ఘనంగా నిర్వహిస్తోందని చెప్పారు. నాడు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో 4500 మంది ప్రాణ బలిదానాలు జరగగా, 10 వేల గ్రామాలను విముక్తి చేసి 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన ఘన చరిత్ర కమ్యూనిస్టులదని, అయితే నేడు దానిని కొంత మంది వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. బాలమల్లేష్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్దించి 78 ఏళ్లు పూర్తి అవుతున్నా నేటికి 80 శాతం మంది ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు వాటి ఫలాలు అందుకోలేని పరిస్థితి ఉండడడం దారుణమన్నారు. భూమి కోసం, భుక్తి, కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం సమసమాజం లక్ష్యమే ధ్యేయంగా నాడు సాగించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటల యోధుల ఆశయం నేరవేరాలంటే దేశవ్యాప్తంగా బిసి కుల గణన చేపట్టి, జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించడం ద్వారానే సాధ్యం అవుతుందన్నారు. అంజయ్య నాయక్ మాట్లాడుతూ నేటికీ 90 శాతం ప్రజలకు సరైన కూడు, గూడు, నాణ్యమైన విద్య, వైద్యానికి నోచుకోడం లేదని, వీరందరికీ న్యాయం జరగాలంటే నాటి తెలంగాణ సాయుధ పోరాట యోధుల స్ఫూర్తితోఅందరూ కలిసి కట్టుగా మరింత పెద్దఎత్తున ఉద్యమించాలని కోరారు. ఉమామహేశ్వర్ వందన సమర్పణ చేయగా, కార్యక్రమంలో సిపిఐ నాయకులు జె.శంకర్, హరినాథ్, శంకర్‌రావు, రచ్చ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## బొగ్గు బ్లాకులు సింగరేణికే

**(మొదటి పేజీ తరువాయి)**

మంత్రిత్వ శాఖ ప్రకటించిందని తెలిపారు. దేశంలోని ఇతర ప్రాంతాలకు కోచ్ ఫ్యాక్టరీలు మంజూరు చేసిన రైల్వేశాఖ కాజీపేటలో మాత్రం రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడం సాధ్యం కాదని ప్రకటించడం సరికాదన్నారు. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ మంజూరు చేయాలని ప్రధానమంత్రికి విజ్ఞప్తి చేశారు.

**ఇండియా సెమీకండక్టర్ మిషన్‌లో తెలంగాణను చేర్చాలి**

వివిధ కంపెనీల ప్రతిపాదనలు ప్రస్తుతం ఇండియా సెమీకండక్టర్ మిషన్ సమీక్షలో ఉన్నందున, ఇండియా సెమీకండక్టర్ మిషన్‌లో తెలంగాణ రాష్ట్రానికి చోటు కల్పించాలని ప్రధానమంత్రి మోదీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. హైదరాబాద్‌లో సెమీకండక్టర్ ఫ్యాబ్స్‌ను నెలకొల్పేందుకు పలు కంపెనీలు ఆసక్తి కనపర్చుతున్నట్లు మోదీకి రేవంత్‌రెడ్డి తెలియజేశారు.

**బిఆర్‌జిఎఫ్ నిధులు రూ.1800 కోట్లు ఇవ్వండి**

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధి (బిఆర్‌జిఎఫ్) కింద కేంద్ర ప్రభుత్వం 2015 నుంచి 2019 వరకు అయిదేళ్లలో తెలంగాణకు రూ.2,250 కోట్లు కేటాయించిందని ప్రధాని మోదీకి సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఒక్కో ఏడాదికి రూ.450 కోట్ల చొప్పున ఈ గ్రాంట్ మంజూరు చేశారని, 2019–20, 2021–22, 2022–23, 2023–24 సంవత్సరాలకు సంబంధించి బిఆర్‌జిఎఫ్ కింద తెలంగాణకు రావల్సిన రూ.1,800 కోట్లు విడుదల చేయాలని ప్రధానిని సిఎం కోరారు.

**రక్షణ శాఖ భూముల బదిలీ చేయండి**

రాజధాని హైదరాబాద్‌లో పెరిగిన ట్రాఫిక్ అవసరాల దృష్ట్యా హైదరాబాద్‌కరీంనగర్ రహదారి, హైదరాబాద్ నాగ్‌పూర్ రహదారి (ఎన్‌హెచ్44)పై ఎలివేటెడ్ కారిడార్లు నిర్మించాలని నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి ప్రధానమంత్రికి తెలియజేశారు. ఆ రెండు కారిడార్ల నిర్మాణానికి అడ్డంకి లేకుండా మార్గమధ్యలో రక్షణశాఖ పరిధిలో ఉన్న భూములను రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేయాలని కోరారు. ఆ కారిడార్లతో పాటు హైదరాబాద్ నగరంలో రహదారుల విస్తరణ, రవాణా, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర రక్షణ శాఖ పరిధిలో 2450 ఎకరాల భూములను రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేయాలని ప్రధానమంత్రి మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆ భూములకు ప్రత్యామ్నాయంగా రావిరాల ప్రాంతంలో రీసెర్చ్ సెంటర్ ఇమరాత్ (ఆర్‌సిఐ)కి లీజుకు ఇచ్చిన 2,462 ఎకరాల భూములను పూర్తిగా కేంద్రానికి అప్పగించేందుకు తమ ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని తెలిపారు.

**రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం వేగవంతం చేయాలి**

కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్)ఉత్తర భాగం (సంగారెడ్డి నుంచి చౌటుప్పల్ వరకు) జాతీయ రహదారి నిర్మాణానికి ఆమోదం తెలిపిందని ప్రధాని దృష్టికి ముఖ్యమంత్రి తీసుకెళ్లారు. ఆ రహదారి నిర్మాణానికి సంబంధించిన భూ సేకరణ వ్యయంలో 50 శాతం ఖర్చును ఇవ్వడంతో పాటు రహదారి నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్దంగా ఉందని ప్రధానమంత్రికి ముఖ్యమంత్రి తెలియజేశారు. ఈ రహదారులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను వీలైనంత తొందరగా చేపట్టాలని కోరారు. హైదరాబాద్ చుట్టూ జాతీయ రహదారుల అభివృద్ధికి అత్యంత ఉపయోగంగా ఉండే ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని (చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు) వెంటనే జాతీయ రహదారిగా గుర్తించి, వెంటనే భారత్ మాల పరియోజనలో దాని నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశా రు.

**జాతీయ రహదారులుగా :** తెలంగాణలోని ప్రధాన పట్టణాలు, పుణ్య క్షేత్రాలకు పెరిగిన రవాణా అవసరాల దృష్ట్యా 13 రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయాలని ప్రధాని మోదీకి సిఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. జగిత్యాలపెద్దపల్లి కాటారం, దిండిదేవరకొండమల్లెపల్లినల్గొండ, భువనగిరి చిట్యాల, చౌటుప్పల్ అమన్‌గల్‌షాద్‌నగర్ సంగారెడ్డి, మరికల్ నారాయణపేట రామసముద్ర, వనపర్తికొత్తకోటగద్వాల మంత్రాలయం, మన్నెగూడ, వికారాబాద్, తాండూరు, జహీరాబాద్, బీదర్, కరీంనగర్, సిరిసిల్ల, కామారెడ్డి, ఎల్లారెడ్డి, పిట్లం, ఎర్రవల్లి, ఎక్స్‌రోడ్డు, గద్వాల, రాయచూరు, కొత్తపల్లి, హుస్నాబాద్, జనగాం, హైదరాబాద్, సారపాక ఏటూరునాగారం, దుద్దెడ, కొమురవెల్లి, యాదగిరిగుట్ట, రాయగిరి క్రాస్ రోడ్డు, జగ్గయ్యపేట వైరాకొత్తగూడెం రహదారులను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయాలని ప్రధానిని సిఎం కోరారు.



రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని మర్యదపూర్వకంగా కలిసి 'అసెంబ్లీ సాక్షిగా నా ప్రసంగాలు' పుస్తకాన్ని అందజేస్తున్న సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎంఎల్‌ఎ చాడ వెంకట్ రెడ్డి.

## తెలుగు రాష్ట్రాల ప్రజల మధ్య విభేదాలు రాకుండా ముఖ్యమంత్రుల సమావేశం కొనసాగాలి

బిఆర్ఎస్ మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ, ఎపి ప్రజల మధ్య మళ్ళీ విభేదాలు లేకుండా రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం కొన సాగాలని, సమస్యలను శాశ్వితంగా పరిష్కరించుకోవాలని బిఆర్ఎస్ మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. విభజన చట్టం ప్రకారం నడుచుకోవాలని, రామున్ని(భద్రచలం) కాపాడుకోవాలని కోరారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో తెలంగాణ, ఎపి ముఖ్యమంత్రుల సమావేశాన్నినిర్వహించడం అభినందనీయమన్నారు. విభజన సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇద్దరు ముఖ్యమంత్రులు సహచరులని, విభజన అంశాలు కొలిక్కి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కృష్ణా ,గోదావరి నదులపై కూడా చర్చించి నిర్ణయం తీసుకోవాలన్నారు. రెండు రాష్ట్రాలకు ప్రయోజనం చేకూరేలా,ఇతర రాష్ట్రాల నుండి రావాల్సిన వాటాపై కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు లో చిన్న చిన్న తప్పులు జరుగుతుంటాయని, అనేక రాష్ట్రాల్లో బ్రిడ్జీలు కూలిపోయాయని తెలిపారు.

## కాంగ్రెస్ అధిష్టానం చేతిలో రేవంత్ బందీ : ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ అధిష్టానం చేతిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బందీగా మారారని, దీంతో రాష్ట్రంలో పారిపాలన పూర్తిగా కుంటుపడి పోతోందని బి జెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్ ఆరోపించారు. గురువారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు దీపాదాస్ మున్షీ రాష్ట్రంలో రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తుండగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌లు సైంధవ పాత్రను పోషిస్తున్నారని దీంతో ఈ నలుగురి మధ్య తెలంగాణ నలిగిపోతోందన్నారు. రాష్ట్రంలో మంత్రివర్గ ఏర్పాటుకు రా జ్యాంగ బద్ధంగా ముఖ్యమంత్రికి విశేషమైన అధికారాలు ఉన్నా సిఎం రేవంత్ రెడ్డి మాత్రం ఢి ల్లీకి ప్రాధేయపడాల్సిన అవసరం ఏం ఉందంటూ ప్రశ్నించారు. వచ్చిముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రమాణస్వీకారం తర్వాత కేబినేట్‌లోని కీలక శాఖలన్నీ ఆయన వద్దే ఉండడంతో పరిపాలన కుంటుపడుతోందన్నారు. భావిస్తోందన్నారు. ఈనెల 6వ తేదీన జరగబోయే తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీలో విభజన చట్టంలోని హామీల పరిష్కారం కోసం చొరవ తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అయితే ఈ సమావేశం జరుగుతుందో లేదో అన్న అనుమానం ఉందన్నారు.

## రాష్ట్రంలో ఐదు రోజులు వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రాగల ఐదురోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. గురువారం నుంచి శనివారం వరకు రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయన్నారు. ఆదివారం, సోమవారాల్లో పలు జిల్లాల్లో భారీ వర్షాలు పడే సూచనలున్నాయన్నారు. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశామన్నారు. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, 3040 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయన్నారు. సోమవారం మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్, ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్, వరంగల్, జనగాం జిల్లాలో భారీ వానలు కురుస్తాయన్నారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, సూర్యాపేట, వరంగల్, హన్మకొండ, సిద్దిపేట, భువనగిరి, హైదరాబాద్, మేడ్చల్, మల్కాజిగిరి, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయన్నారు.

## రైతు ప్రభాకర్‌కు రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియాను చెల్లించండి: ఎంఎల్‌సి తాత మధు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైతులకు సకాలంలో ఎరువులు,విత్తనాలు ప్రభుత్వం అందించడం లేదని బిఆర్ఎస్ ఎంఎల్‌సి తాత మధు ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ చింతకాని మండలంలో ఆత్మహత్య చేసుకున్న రైతు ప్రభాకర్ కుటుంబానికి రూ. 25లక్షల ఎక్స్‌గ్రేషియాలను ఇవ్వాలని, ఆయన కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు పిర్యాదు చేసిన పట్టించుకోని అధికారులను వెంటనే అక్కడి నుండి బదిలీ చేయాలని, అప్పుడే రైతు కుటుంబానికి న్యాయం జరుగుతుందన్నారు. సిఎం, డిప్యూటీసిఎం, మంత్రులు పాలనను గాలికి వదిలేసి ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొడుతున్నారని ఆరోపించారు. జులై మాసం వచ్చినప్పటికీ ఇంకా రైతు భరోసాకు దిక్కు లేదని తాత మధు అన్నారు.

## కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి: ఎఐటియుసి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిపరిష్కరించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ, తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ (రెగ్యులర్) రాష్ట్ర అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డిలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురవారండిఎంఈతో సమావేశమైనఎఐటియుసి నేతలు కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి నేతలు మాట్లాడుతూ 2022లో టెండర్ పిలిచే సమయంలో టిఎస్ ఎం ఎస్ ఐడి సి వాళ్ళు, అప్పటి డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ కార్మికుల జీతాల చెల్లింపు విషయంలో సరైన అవగాహన లేకుండా టెండర్ షెడ్యూల్లో జీవో నెంబర్ 60 ప్రకారం జీతాలు చెల్లించాలని పొందుపరిచి, ఆ తర్వాత ఆ జీవోను పక్కకు పెట్టి మరో సర్క్యులర్ విడుదల చేసి దాని ప్రకారం జీతాలు చెల్లించాలని తెలపడంతో గందరగోళం ఏర్పడి కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఈ అంశంపై అనేక మార్లు వినతి పత్రాలు ఇచ్చిన పరిష్కారం కాలేదని, ఇప్పటికీ కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. రెండు జిఓలను కాంట్రాక్టర్లు అసరగా చేసుకుని కార్మికులకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు జీవో ప్రకారం ప్రస్తుతం ఉన్న రూ.700 వేతనాన్ని రూ.10వేలకు పెంచాలని,అప్పుడే కార్మికులకు న్యాయం జరుగుతుందన్నారు. అదేవిధంగా చట్ట ప్రకారం కార్మికులకు రావాల్సిన పండగ, జాతీయ సెలవులు ఆర్థిక సెలవులు అమలు చేయాలని వారు డిఎంఈని కోరారు. ఈ సందర్భంగా డిఎంఈ స్పందిస్తూ ఈ అంశంపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ్మా సమగ్ర నివేదికను అడగారని , త్వరలోనే కార్మికుల అన్ని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎఐటియుసి నాయకులకు హామీఇచ్చారు.

# తెలంగాణ నిఘా విభాగాలకు నిధులు కేటాయించండి

అదనపు ఐపిఎస్ పోస్టుల మంజూరు చేయండి
సిఆర్‌పిఎఫ్ జెటిఎఫ్ క్యాంపులు ఏర్పాటుచేయాలి
కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వినతి



**ప్రజాపక్షం / హైదరాబాద్:** రాష్ట్ర స్థాయి అత్యున్నత నిఘా విభాగాలైన తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో (టిజి న్యాబ్), తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజి సిఎస్‌బి) ఆధునీకరణకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్ర హోం శాఖ మంత్రిని ఆయన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం కలిశారు. సుమారు గంటపాటు కొనసాగిన భేటీలో వివిధ అంశాలను కేంద్ర మంత్రి దృష్టికి ముఖ్యమంత్రి తీసుకెళ్లారు. భేటీలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పాల్గొన్నారు. డ్రగ్స్, సైబర్ నేరాల నియంత్రణతో పాటు అరికట్టడానికి కావాల్సిన ఆధునికసాంకేతిక పరిజ్ఞానం, పరికరాల కొనుగోలు కోసం టిజి న్యాబ్‌కు రూ.88 కోట్లు, టిజి సిఎస్‌బికి రూ.90 కోట్లు కేటాయించాలని కేంద్ర మంత్రి అమిత్ షాను ముఖ్యమంత్రి కోరారు. ప్రతి ఐదేళ్లకు ఒకసారి ఐపిఎస్ క్యాడర్ సమీక్ష చేయడం తప్పనిసరి అని, తెలంగాణకు సంబంధించి 2016లో మొదటి సారి సమీక్ష నిర్వహించారని, నాటి నుంచి సమీక్ష చేయనుందున వెంటనే సమీక్ష చేయాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణకు 61 ఐపిఎస్ పోస్టులు కేటాయించారని, కొత్త రాష్ట్ర అవసరాలకు ఐపిఎస్‌లు సరిపోనందున, తెలంగాణకు అదనంగా మరో 29 ఐపిఎస్ పోస్టులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ సరిహద్దు రాష్ట్రాలైన ఛత్తీస్‌ఘఢ్, మహారాష్ట్రలో వామపక్ష తీవ్రవాదానికి వ్యతిరేకంగా పెద్ద సంఖ్యలో సెక్యూరిటీ ఫోర్స్ క్యాంపులు ఏర్పాటు చేసిన విషయాన్ని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ఆదిలాబాద్, మంచిర్యాల, కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో కూడా ఇదే విధమైన క్యాంపులను ఏర్పాటు చేయడానికి అవకాశం ఉందన్నారు. వామపక్ష తీవ్రవాద ప్రభావిత జిల్లాలుగా గతంలో ఉండి తొలగించిన మూడు జిల్లాలను ఎస్ఆర్ఈ కింద (భద్రతాపరమైన వ్యయం, చెల్లింపులు) తిరిగి కొనసాగించాలని కోరారు. సరిహద్దు రాష్ట్రాలతో విశాలమైన సరిహద్దు ఉండటంతో తెలంగాణ భద్రతపైన మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందని కేంద్ర హోం శాఖ మంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలో వామపక్ష తీవ్రవాదాన్ని అణిచి వేసేందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం కొండవాయి గ్రామం, ములుగు జిల్లా వెంకటాపురం మండలం ఆలుబాక గ్రామ పరిధిలో సిఆర్‌పిఎఫ్ జెటిఎఫ్ క్యాంపులు ఏర్పాటు చేయాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టల కొండల్లో ఉన్న అనుకూలతను ఆసరాగా చేసుకుని సిపిఐ మావోయిస్టు కమిటీ ఒక ప్రత్యేక దళాన్ని ఏర్పాటు చేసి తమ ప్రాబల్య విస్తరణకు ప్రయత్నిస్తోందని కేంద్ర మంత్రి దృష్టికి సిఎం తీసుకెళ్లారు. మావోయిస్టు ప్రత్యేక దళం కదలికల నియంత్రణతో పాటు నిర్మూలనకు జెటిఎఫ్ క్యాంపులు ఉపయోగపడతాయని తెలిపారు. ఎస్‌పిఓలకు చెల్లించాల్సిన నిధుల్లో కేంద్రం వాటా 60 శాతం నాలుగేళ్ల నుంచి పెండింగ్ లో ఉందని, ఆ మొత్తం రూ.18.31 కోట్లు విడుదల చేయాలని కోరారు. మావోయిస్టుల నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన ఎస్‌పిఓల్లో మాజీ సైనికులు, మాజీ పోలీసులను మాత్రమేచేర్చుకోవాలనే నిబంధన సమాచారం చేరవేతకు ఇబ్బందిగా ఉందన్నారు. 1065 మందిని ఎస్‌పిఓల్లో చేర్చుకోవడానికి నిబంధనలు సడలించాలని కోరారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో మాజీ సైనికులు, మాజీ పోలీసులు అందుబాటులో లేరని కేంద్ర మంత్రి దృష్టికి ముఖ్యమంత్రి తీసుకెళ్లారు.

### పునర్విభజన చట్టం

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పునర్విభజన సమస్యల పరిష్కారానికి సహకరించాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. షెడ్యూల్ 9లోని (చట్టంలోని 53, 68, 71 సెక్షన్ల ప్రకారం) ప్రభుత్వ భవనాలు, కార్పొరేషన్ల పంపిణీ, షెడ్యూల్ 10లోని సంస్థల వివాదం (చట్టంలోని 75 సెక్షన్ ప్రకారం) సామరస్యపూర్వకంగా పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. పునర్విభజనచట్టంలో ఎక్కడా ప్రస్తావించని ఆస్తులు, సంస్థలను ఆంధ్రప్రదేశ్ క్లెయిమ్ చేసుకుంటున్నందున, అందులో తెలంగాణకు న్యాయం జరిగేలా చొరవ చూపాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు.

## పేదల అభ్యున్నతే లక్ష్యంగా పని చేస్తున్నాం

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం
శ్రీలంక జర్నలిస్టులతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అవుతుందని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తూ.చ తప్పకుండా అమలు చేస్తున్నామని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని అన్నారు. శ్రీలంక దేశానికి చెందిన మీడియా నిపుణులతో కూడిన ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం గురువారం సచివాలయంలో రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిశారు. డాక్టర్ ఎంసిఆర్ హెచ్ఆర్‌డి ఇన్‌స్టిట్యూట్ నిర్వహిస్తున్న మీడియా మేనేజ్‌మెంట్‌పై రెండు వారాల శిక్షణా కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రతినిధి బృందం తెలంగాణలో ఉన్న నేపథ్యంలో ఆ ప్రతినిధి బృందం పర్యటనను భారత ప్రభుత్వ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పాన్సర్ చేసింది. రాష్ట్రానికి వచ్చిన బృందానికి స్వాగతం పలికిన మంత్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణకు ఘనమైన సాంస్కృతిక చరిత్ర, సహజ వనరులు ఉన్నాయని అన్నారు. ఎమర్జింగ్ టెక్నాలజీల రంగంలోనూ రాష్ట్రం ముందంజలో ఉందిని అన్నారు. రాష్ట్రంలోని జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం చేపడుతున్న పలు కార్యక్రమాలను వివరించారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం పేదలు, రైతుల సంక్షేమానికి అంత్యంత ప్రాధాన్యతను ఇస్తుందని అన్నారు. రైతులకు ఏక కాలంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తున్నామని, పేదలకు ఉచితంగా ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని, రెండు వందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, 500 రూపాయలకే సిలిండర్ అందిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకున్న నిర్ణయాలను మంత్రి వారికి వివరించారు. జర్నలిస్టులతో మాట్లాడిన ఆయన తెలంగాణలో వారు పర్యటించిన ప్రదేశాలు గురించి అడిగి తెలుసుకున్నారు. విదేశాల నుంచి జర్నలిస్టులకు శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఎంసిఆర్ హెచ్ఆర్‌డి సంస్థను ఆయన అభినందించారు. డైరెక్టర్ జనరల్ ఎంసిఆర్‌హెచ్ఆర్‌డి శశాంక్ గోయెల్ సంస్థ చేపట్టిన వివిధ కార్యక్రమాల గురించి మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటివి మీడియాలో సాంకేతిక రంగంలో కొత్త పరిణామాలు, అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీల వల్ల ఎదురవుతున్న సవాళ్లపై సందర్శకులకు శిక్షణ ఇచ్చామన్నారు. శ్రీలంకకు చెందిన జర్నలిస్టులు తమకు లభించిన సాదర స్వాగతం, ఆతిథ్యానికి తమ కృతజ్ఞతలు తెలియజేసారు. శిక్షణా కార్యక్రమం ద్వారా తాము ఎంతో ప్రయోజనం పొందామని చెప్పారు. ఇది తమకు గొప్ప అనుభవం అని చెప్పారు. ఈ సమావేశంలో సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ హనుమంతరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ట్యాంక్ బండ్‌పై దొడ్డి కొమురయ్య విగ్రహం

దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/ జనగామ ప్రతినిధి:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ఆర్అండ్‌బి శాఖ మాత్యులు కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి హామి ఇచ్చారు. ప్రజా ప్రతినిధులు పార్టీలు, పదవులు పక్కన పెట్టి ప్రజల కోసం పనిచేయాలని సూచించారు. దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతి సందర్భంగా జనగామలోని కళ్లె కమాన్ వద్ద ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. జనగామ జిల్లా పోరాటాల ఖిల్లా, జనగామ, ఆలేరు, భువనగిరి, నల్లగొండ ప్రాంతాలు నైజాం నవాబును గడగడలాడించాయన్నారు. దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయడంతో పాటు ఆయన స్మారక భవనం కోసం జనగామ 2 ఎకరాల భూమి కేటాయించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశిస్తానని తెలిపారు. విప్, ఆలేరు ఎంఎల్‌ఎ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ బానిస సంకెళ్లు తెంచుకోవడం కోసం ఆనాడు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరిగిందన్నారు. జనగామ ఎంఎల్‌ఎ పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ విస్నూరు రామచంద్రారెడ్డి ఆగడాలకు అంత లేకుండా పోయేదని, ప్రజల ధన, మాన, ప్రాణాలకు రక్షణ లేని పరిస్థితిలో గ్రామాలకు గ్రామాలు కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు చేశాయన్నారు. ఆ స్ఫూర్తిలో తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమంలోనే జనగామ ఉముందుందని భవిష్యత్తులోనే అదే స్ఫూర్తితో పనిచేయాలన్నారు. డిసిసి అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ బానిసత్వం, దోపిడీకి వ్యతిరేకంగా దొడ్డి కొమురయ్య లాంటి వారు పోరాటం చేశారని, ప్రస్తుతం దోపిడీ, దొంగ పనులు చేసే వారిని సైతం తరిమికొట్టేవారు ఉన్నారన్నారు. సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వెలకట్టలేనిదన్నారు. అరుణోదయ కళాకారిని విమలక్క మాట్లాడుతూ పాలకుర్తి, దేవరుప్పుల, కడవెంటి, భైరాన్‌పల్లి వంటి ప్రాంతాలు చరిత్రనే తిరగరాశాయని, దోపిడి మూఖల్ని తరమి కొట్టి భూమి, భుక్తి, విముక్తిని పొందారన్నారు. విమలక్క సభలో పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ పోకల జమున, మాజీ ఛైర్మన్లు వై సుధాకర్, వేమల్ల సత్యానారాయణరెడ్డి, మాజీ వైస్ ఛైర్మన్ కంచె రాములు, సిపిఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎంఎల్‌ఎ సిహెచ్ రాజారెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, మల్లేశం, వైకుంఠం, జాయ మల్లేశ్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారం..ప్రతిపక్షం శాశ్వతం కాదు

చిత్తశుద్ధితో అప్పగించిన పాత్రను నిర్వర్తిస్తాం: కెసిఆర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజాస్వామ్యంలో ప్రజలదే అంతిమ నిర్ణయమని,అధికారం శాశ్వతం కాదని, అలాగని ప్రతిపక్ష పాత్రకూడా శాశ్వతం కాదని బిఆర్ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ రావు అన్నారు. ప్రజా తీర్పే శిరోధార్యమన్నారు. ప్రజలు ఎటువంటి పాత్రను అప్పగిస్తే దానిని చిత్తశుద్ధితో నిర్వర్తించాలన్నారు.ఖమ్మం, మహబూబాబాద్, వేములవాడ నర్సాపూర్, ఇబ్రహీంపట్నం తదితర ప్రాంతాల నుండి తనను కలిసేందుకు వచ్చిన నాయకులు,కార్యకర్తలతో ఎర్రవెల్లిలో కెసిఆర్ గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కెసిఆర్ మాట్లాడుతూ అధికారం కోల్పోయామని బాధపడడం సరైన రాజకీయ నాయకుని లక్షణం కాదన్నారు. ప్రజాసంక్షేమం కోసం కొనసాగే నిరంతర ప్రక్రియనే రాజకీయమని, దీనికి గెలుపు, ఓటములతో సంబంధం ఉండదని అన్నారు. ప్రజలతో కలిసివుంటూ వారి సమస్యలపైన నిరంతరం పోరాడుతూ వారి అభిమానాన్ని సాధించాలని కెసిఆర్ పునరుద్ఘటించారు. రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని, తెలంగాణ సంపూర్ణ అభివృద్ధి సాధించడమే బిఆర్ఎస్ అంతిమలక్ష్యమన్నారు. గెలుపోటములకు అతీతంగా నిరంతర కృషి కొనసాగించడమే మన కర్తవ్యమన్నారు. తెలంగాణ రాష్ట్రం అనతికాలంలోనే దేశానికి ఆదర్శంగా నిలిచేలా పాలననందించామన్నారు. విద్యుత్, సాగు, తాగు నీరు, వ్యవసాయం తదితర రంగాల్లో నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యాచరణ దేశ చరిత్రలోనే మునుపెన్నడు లేని విధంగా కొనసాగిందని వివరించారు. ముందస్తు సమాచారం లేకుండా ఎర్రవెల్లికి రావడంతో ఇబ్బందేనని, ముందస్తు అనుమతి తీసుకుని రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్మూరు మా జీ ఎంఎల్‌ఎ అషన్నగారి జీవన్‌రెడ్డి తదితరులుపాల్గొన్నారు.

## తోడ్పాటు అందించండి

ప్రధాని మోదీతో ఎపి సిఎం చంద్రబాబు భేటీ



**న్యూఢిల్లీ :** ప్రధాన మంత్రి నరేంద్రమోదీతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు గురువారం సమావేశమయ్యారు. ఈనెల చివరి వారంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టనున్న వేళ రాష్ట్ర అవసరాలను ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రానికి ఆర్థిక సాయం సహా, రాష్ట్ర పునర్‌నిర్మాణానికి అవసరమైన సహకారంపై చర్చించారు. గత ప్రభుత్వం విధ్వంసంతో రాష్ట్రం ఎదుర్కొంటున్న ఇబ్బందుల్ని ప్రధాన మంత్రికి నివేదించారు. కష్టాల్లో ఉన్న రాష్ట్రానికి ఆర్థిక సాయం కోరడంతో పాటు మౌలిక వసతుల కల్పన, అమరావతి నిర్మాణం, పోలవరం పూర్తి చేయడానికి తోడ్పాటు అందించాలని కోరారు. అనంతపురం అమరావతి ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంతో పాటు, కీలక రహదారుల మరమ్మతులు, పట్టణ, గ్రామీణ పేదల ఇళ్లు, జల్‌జీవన్ మిషన్ కింద ఇంటింటికీ తాగునీటి సరఫరా వంటి ముఖ్యమైన అంశాలపై విజ్ఞప్తులు చేశారు. ప్రధానితో సమావేశానికి ముందు కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్‌ను కలిసిన సిఎం.. ఆ తర్వాత మరికొందరు మంత్రులను కలిసి వినతులు సమర్పించారు. కేంద్ర మంత్రులు కె.రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, బిసి జనార్ధన్‌రెడ్డితో పాటు పలువురు ఎంపీలు చంద్రబాబు వెంట ఉన్నారు.

## ఆర్థిక వ్యవస్థలో సహకార సంఘాల సహకారం కీలకం

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర సహకార సంఘాల సహకారాలదేనని,ఈ రంగంలో యువత, మహిళల ప్రత్యేక భాగస్వామ్యం ఉన్నపుడు మాత్రమే ఈ రంగం మ రింత పురోగతి సాధిస్తాయని వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన సహకార సంఘాలకు జాతీయ సహకార అభివృద్ధి సంస్థ(ఎన్‌సిడిసి)ద్వారా గురువారం అవార్డుల ప్రధానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా 5 సహకార సంఘాలకు అవార్డులు అందచేయడంతో పాటు రూ. 25వేల నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, టిజిసిఎబి చైర్మన్ ఎం. రవీందర్ రావు, టిజిసిఎబి ఎండి గోపి, కోఆపరేటివ్ డైరెక్టర్ ఉదయ్ కుమార్, ఎన్‌సిడిసి రిజనల్ డైరెక్టర్ వంశీకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో సహకార రంగం సుమారు 125 ఏళ్ల నాటిది కాగా, కాలనుగుణంగా మార్పులకు నోచుకోక పోవడంతో కొంత ఆదారణ కొల్పోయిందన్నారు. ఇప్పుడైనా సహకార రంగం ఈ కాలపు అవసరాలకు అనుగుణంగా బలోపేతంకావడం ద్వారామరోసారి ప్రతి ఒక్కరి విశ్వాసాన్ని గెలుచుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. సహకార రంగం బలోపేతానికి పిఎసిఎస్‌లను బలోపేతం చేయడం చాలా ముఖ్యమని, ఇందుకోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గడచిన 125 ఏళ్లలో సహకార సంఘాలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు గర్వించదగిన తోడ్పాటును అందించాయని, భవిష్యత్‌లో మరింత భాగస్వా మ్యం కావాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 60,759 వివిధ రకాల సహకార సంఘాలు ఉన్నాయని, 908 ప్రాథమిక వ్యవసాయ రుణ సంఘాలు, 24,539 వినియోగదారులు, పొ దుపు సంఘాలు, అనేక మత్స్య సహకార సంఘాలు ఉన్నాయని తెలిపారు. గ్రామాలలోని అధిక శాతం రైతులు ఏదో ఒక రూ పంలో సహకార సంఘాలతో అనుబంధం కలిగి ఉన్నరన్నారు. రాష్ట్రం మొత్తం వ్యవసాయ రుణంలో సహకార రంగం వాటా 20 శాతం కాగా, 60శాతం ఎరువుల పంపిణీతో పాటు వరి సేకరణ, పాల ఉత్పత్తి, మత్స్యకారుల వ్యాపారం కూడా ఎక్కువ స హకార సంఘాల ద్వారానే జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా అవార్డుల స్వీకరించిన ప్రాథమిక వ్యవసాయ రుణ సం ఘాలు కాల్వ శ్రీరాంపూర్, రాయికల్, మహదేవ్ పూర్, అప్పన్నపేట, జీడిమెట్ల మత్స్య సహకార సంఘంప్రతినిధులను మంత్రి తుమ్మల అభినందించారు.

### వ్యవసాయ శాఖ కార్యాలయంలో మంత్రి తుమ్మల ఆకస్మిక తనిఖీ



సకాలం రాని ఉద్యోగులు మండి పడ్డ మంత్రి ఉద్యోగులు సకాలంలో విధులకు హాజరు కాకపోతే కఠిన చర్యలు తప్పవంటూ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉద్యోగులను హెచ్చరించారు. గురువారం ఉదయం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అకస్మిక తనిఖీ చేశారు. దీంతో అధికారులు, ఉద్యోగులు ఒక్కసారిగా ఖంగు తిన్నారు. మంత్రి తుమ్మల కార్యాలయం మొత్తం కలియ తిరుగుతూ అధికారులు, ఉద్యోగుల చాంబర్లను పరిశీలించారు. వాటిలో చాల మేరకు ఖాళీగా దర్శనమివ్వడంతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ అంశంపై వెంటనే సమగ్ర నివేదిక ఇవ్వాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపిని ఆదేశించారు. శుక్రవారం నుంచి ఉద్యోగులందరూ సకాలంలో హాజరు కావాలని అదేశించారు. లేకపోతే చర్యలు తప్పవంటూ హెచ్చరించారు

తెలంగాణ ప్రభుత్వం
రోడ్లు మరియు భవనాల శాఖ
టెండరు నోటీసు
NIT No. 6/PA to EE/NLG/2024-25, తేది:29.06.2024
పనుల సంఖ్య: 1 పని, మొత్తం ఇ.సి.వి.: రూ.32.26 లక్షలు, టెండర్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ మరియు బిడ్ డాక్యుమెంట్ దాఖలు: 03.07.2024న మ.3.30గం.ల నుండి 11.07.2024న సా.3.30గం.ల వరకు, సాంకేతిక బిడ్ ప్రారంభ తేది: 11.07.2024న సా.4.00గం.లకు, ధర బిడ్ ప్రారంభ తేది: 11.07.2024న సా.5.00గం.లకు.
సం/- కార్యనిర్వాహక ఇంజనీర్ (ర&భ)
జిల్లా కార్యాలయం : నల్లగొండ
DIPR R.O. No. : 237-DP/CL/ADVT/1/2024-25 Date: 04-07-2024

ప్రజాపక్షం

శుక్రవారం, జులై 05

# మణిపూర్ సమస్యపై చిత్తశుద్ధి ఏదీ?

మణిపూర్.. అక్కడ గిరిజన మహిళలను వివస్త్రలుగా చేసి ఊరేగిస్తారు. గిరిజన యువకులను సజీవ దహనం చేస్తారు. అక్కడ మెజారిటీ మైతీలతే రాజ్యం. వారు చెప్పిందే వేదం. కుకీ, నాగా తదితర గిరిజన సమూహాల హక్కులను కాలరాసి, వారి ఆస్తులను కొల్లగొట్టడానికి జరిగిన కుట్రే మణిపూర్ అశాంతికి కారణం. మైతీలను గిరిజన వర్గాల జాబితాలో చేర్చి, అక్కడి బిజెపి సర్కారు కలహాలకు బీజం వేసింది. ఒకేవర్గానికి మద్దతునిస్తూ సమస్యను పెంచింది. వారు చేస్తున్న దారుణాలను చూసీచూడనట్టు వ్యవహరిస్తూ, పరోక్షంగా అలజడుల నెగళ్లను ఎగదోస్తున్నది. గిరిజన, గిరిజనేతరుల మధ్య ఘర్షణలతో, మణిపూర్‌లో జాతి హింస మొదలై ఏడాది దాటింది. రాష్ట్రం మొత్తం తగలబడిపోతున్నది. నిరసనలతో హోరెత్తుతున్నది. రాష్ట్రం వల్లకాడులా మారుతున్నా ఇన్నాళ్లూ పట్టించుకోని ప్రధాని నరేంద్ర మోదీ హఠాత్తుగా స్పందించారు. అక్కడ నెలకొన్న పరిస్థితిపై రాజ్యసభలో నోరు విప్పారు. ఎప్పటి మాదిరిగానే, ఈసారి కూడా సమస్యను ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్‌కు అంటగట్టే ప్రయత్నం చేశారు. కేంద్రంలో యుపిఎ అధికారంలో ఉన్నప్పుడు, మణిపూర్‌లో 10 పర్యాయాలు రాష్ట్రపతి పాలన విధించారని, 1993లో ఇంతకంటే భయానకమైన హింస చోటు చేసుకుందని నిందలు వేశారు. ప్రస్తుత పరిస్థితులకు అటు రాష్ట్రంలో, ఇటు కేంద్రంలో ఉన్న బిజెపికి ఎలాంటి సంబంధం లేదన్న విచిత్ర వాదనను తెరపైకి తెచ్చారు. ఆయన ప్రసంగంలో ఎక్కడా మణిపూర్ సమస్య పట్ల చిత్తశుద్ధి కనిపించలేదు. పరిష్కారం దిశగా సూచనలు లేవు. అల్లర్లు, గృహదహనాలతో సర్వస్వం కోల్పోయిన సుమారు 60,000మంది శరణార్థులు పడుతున్న బాధల ప్రస్తావన లేదు. పిల్లలను కోల్పోయిన తల్లుల ఆవేదన ఆయనకు పట్టలేదు. 30 ఏళ్ల క్రితం జరిగిన అల్లర్లు గుర్తున్నాయిగానీ, ఇప్పుడు జరుగుతున్న మారణహోమం ఊసేలేదు. అల్లర్లు, కలహాలతో అట్టుడుకుతున్న మణిపూర్ ప్రజల జీవితాల్లో విషాద కోణం ఏదీ మోదీ ప్రసంగంలో చోటు చేసుకోలేదు. అక్కడ హింసను ప్రేరేపించింది, ద్వేషాన్ని రగిలించింది ఎవరనేది బహిరంగ రహస్యం. ఇటు రాష్ట్రంలో, అటు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి మణిపూర్ సమస్యకు ఆజ్యం పోసి, ఎగదోసిందే తప్ప శాంతి స్థాపనకు ప్రయత్నించలేదు. రాజ్యాంగ బద్ధంగా కుకీ, నాగా తదితర గిరిజన జాతులకు లభించిన హక్కులను బిజెపి విస్మరించింది. అధిక సంఖ్యాకులైన మైతీలకు గిరిజన హోదా కల్పించబోయింది. అసలు సిసలైన గిరిజనులకు నిలువనీడ లేకుండా చేసే కుట్రకు తెరలేపింది. సమస్య మూలాలు బిజెపి సృష్టే అన్నది బహిరంగ రహస్యం. ఇప్పటికే రాష్ట్రం అన్ని విధాలా దెబ్బతిన్నది. నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తే భారీ మూల్యం చెల్లించక తప్పదు. కానీ, పార్లమెంటులో ప్రధాని ప్రసంగం మొత్తంలో మణిపూర్ సమస్యను కాంగ్రెస్‌కు ఆపాదిస్తూ, తమ ప్రమేయం లేదని వివరణ ఇచ్చుకునే ప్రయత్నమే కనిపించింది. కేవలం అనుమానం మీద అరెస్టు చేసిన ఒక కుకీ గిరిజనుడు అనారోగ్యంతో అల్లాడుతున్నా, ఆసుపత్రికి తీసుకెళ్లని వైనాన్ని సుప్రీం కోర్టు ప్రస్తావించిందంటే పరిస్థితి ఎంతగా దిగజారిందో ఊహించుకోవచ్చు. మణిపూర్ ప్రభుత్వంపై నమ్మకం లేదని కోర్టు చేసిన వ్యాఖ్యలకు బీరేన్ సింగ్ సర్కారు సిగ్గుతో తలదించుకోవాలి. నిందితుడు కుకీ గిరిజనుడు కాబట్టి, అతనిని ఆసుపత్రికి తరలిస్తే శాంతి భద్రతల సమస్యలు తలెత్తుతాయన్న అనుమానం వ్యక్తం చేయడం మణిపూర్ ప్రభుత్వానికే చెల్లింది. అక్కడ పాలన, శాంతి భద్రతలు ఇంతలా పతనమైనా, ప్రధానిలో ఏ మాత్రం చలనం కనిపించలేదు. గిరిజనులపై జరుగుతున్న ఘాతుకాలను ప్రస్తావించకపోవడం ఆయన కరడుగట్టిన విద్వేషపూరిత రాజకీయాలకు నిదర్శనం. ప్రజల చేత తిరస్కారానికి గురై, మిత్రపక్షాల మద్దతుతో అతి కష్టంమీద అధికారంలోకి వచ్చామన్న స్పృహ ఆయనలో ఏమాత్రం లేదు. అబద్ధాలు.. అర్ధసత్యాలతో ప్రజలను కలకాలం మోసం చేయడం సాధ్యం కాదని ప్రధాని గ్రహించాలి. మణిపూర్ కాంగ్రెస్ ఎంపి అగోమ్చా బిమోల్ అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. మణిపూర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయన్న ప్రధాని ప్రకటన వాస్తవం కావాలని ఆశించుదాం.

# ఆర్టీసీలో ఔట్‌సోర్సింగ్ దేనికి సంకేతం?



ఎస్.బాబు, అధ్యక్షులు
టిఎస్ ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్

ఏ కార్పొరేషన్ అయినా లేదా ఏ కంపెనీ అయినా, గవర్నమెంట్ డిపార్టుమెంట్‌లు అయినా పర్సనల్ కాస్ట్ తగ్గించుకోవడం కోసం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను వారివారి సంస్థలలో నియమించుకోవడం జరుగుతోంది. ఈ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వల్ల పర్సనల్ కాస్ట్ తగ్గిపోయి సంస్థలు లాభాల బాట పడతాయని యాజమాన్యాలు చెప్తూ ఉంటాయి. గడిచిన 10 సంవత్సరాల కాలంగా తెలంగాణ ఆర్టిసిలో ఏ విధమైన రిక్రూట్‌మెంట్ లేదు. రెగ్యులర్ ఉద్యోగాలు తగ్గిపోయాయి. 2014లో 58 వేలమంది రెగ్యులర్ ఉద్యోగులుండగా అప్పుడు సంస్థ నష్టాలు 2,500 కోట్లు. 2024లో రెగ్యులర్ ఉద్యోగులు సుమారు 41వేలు. ఇప్పుడు సంస్థ నష్టాలు 6వేల కోట్ల పైమాటే. ఒకపక్కన రెగ్యులర్ ఉద్యోగులను తగ్గిస్తూ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పెంచుకుంటూ పోయినా సంస్థ నష్టాలు పెరిగాయే తప్ప తగ్గలేదు. 2014 నుండి 2024 వరకు దాదాపు 17వేల మంది రెగ్యులర్ ఉద్యోగులు తగ్గిపోయారు. అంటే వారి పర్సనల్ కాస్ట్ తగ్గిపోయింది. సెక్యూరిటీ, ట్రాఫిక్, మెయిన్‌టెనెన్స్, మెడికల్‌తో పాటు ఇతర డిపార్ట్‌మెంట్‌లలో కూడా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు వచ్చారు. ఇంకా వస్తూనే ఉన్నారు. బ్రెడ్ విన్నర్ స్కీమ్‌లో రిక్రూట్ అయ్యే ఉద్యోగులు కూడా రెగ్యులర్ ఎంప్లాయీస్ కాదు. కన్సాలిడేటెడ్ పే విధానంలో నియమిస్తున్నారు. సంస్థలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పెరగడం అంటే దేనికి సంకేతం? అంటే ఒకరకంగా ప్రైవేటీకరణ చాపకింద నీరులా జరిగిపోవడమే కదా.

1950 సంవత్సరంలో అమలులోకి వచ్చిన ఆర్టీసి యాక్ట్ ప్రకారం సంస్థ ఎఫిషియన్సీతో పని చేయాలి. ఆర్థిక అవసరాలను అదుపులో ఉంచుతూ ఎకనమికల్‌గా ఉండాలి. ఆర్టీసి అవసరాల మేరకు సిబ్బందిని నియమించుకుని ప్రయాణీకుల డిమాండ్ మేరకు బస్సులు ఆపరేట్ చేస్తూ అధికారులు, ఉద్యోగులు పరస్పర సహకారంతో పనిచేయాలి. 60 సంవత్సరాలు వస్తే ఆర్టీసి సర్వీసు రెగ్యులేషన్స్ ప్రకారం ఉద్యోగి రిటైర్ అవుతాడు. అంటే ఆ ఉద్యోగి పని చేయటానికి పనికిరాడు అని సర్వీసు నుండి రిటైర్ చేస్తారు. మళ్ళీ అదే ఉద్యోగిని అవుట్ సోర్సింగ్ పేరుతో ఉద్యోగానికి తీసుకోవడం అంటే అతను ఎఫిషియన్సీతో పని చేస్తాడా? 60 సంవత్సరాల ముదిమి వయసులో ఎఫిషియన్సీ ఎక్కడనుండి వస్తుంది? ఎఫిషియన్సీ కావాలంటే యంగ్ బ్లడ్‌తో రిక్రూట్‌మెంట్ జరగాలి. ఒక రిటైరైన ఆఫీసర్‌ను నెలకు 50 వేల రూపాయలు ఇచ్చి అవుట్ సోర్సింగ్ రిక్రూట్‌మెంట్ జరిపితే అతను ఎఫిషియంట్‌గా వర్క్ చేస్తాడా? ఎకనమికల్ గా ఇది కరెక్టేనా? ఎందుకంటే అతనికి ఇచ్చే రెమ్యునరేషన్, రెగ్యులర్ ఆఫీసర్ బేసిక్ పే తో దాదాపు సమానంగా ఉంటాయి. మరి అటువంటప్పుడు యువకులను రిక్రూట్ చేస్తే వారి ఆలోచనా విధానం, వారి ఎఫీషియన్సీ సంస్థకి ఉపయోగపడుతుంది కదా. అంతేకాకుండా అవుట్ సోర్సింగ్ ఉద్యోగికి ఎంతవరకు బాధ్యత ఉంటుంది? ఎంతవరకు సంస్థ రక్షణ, రహస్యాలను మెయిన్‌టెయిన్ చేస్తాడు? ఉద్యోగ నిర్వహణలో ఏదైనా పొరపాటు జరిగితే అవుట్ సోర్సింగ్ ఉద్యోగి అకౌంటబిలిటీ ఎంత? ఎంతవరకు అంకితభావంతో పనిచేస్తాడు? రెగ్యులర్ ఉద్యోగికి ఉన్న బాధ్యత అవుట్ సోర్సింగ్ ఉద్యోగికి ఎలా



ఉంటుంది? డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పోస్టులలో దాదాపు అదే జీతాలు ఇస్తున్నప్పుడు అవుట్ సోర్సింగ్ ఎందుకు? రెగ్యులర్ రిక్రూట్‌మెంట్‌కే వెళ్ళచ్చు కదా. ఇదే పద్ధతి కొనసాగితే సమీప భవిష్యత్తులో ఆర్టీసిలో రెగ్యులర్ ఉద్యోగే ఉండడు. సంస్థ ఉత్తర భారతదేశ ఆర్టీసిల లాగే నిర్వీర్యమైపోతుంది. పబ్లిక్ అండర్‌టేకింగ్ డిపార్టుమెంటుగా కనుమరుగైపోతుంది.

ఒక పక్కన సంస్థ నష్టాలు అంటూ వుంటే అవుట్ సోర్సింగ్ రూపంలో యాజమాన్యం డబ్బు లు ఎందుకు ఖర్చు చేస్తోంది? ఒక సాఫ్ట్ వేర్ కన్సల్టెంట్ ని నియమించుకుని నెలకు 80,000 రూపాయలు ఆ సంస్థ కన్సల్టెంట్ సంస్థకు ఖర్చు చేయాల్సిన అవసరమేముంది? రిటైర్డ్ ఐపిఎస్ అధికారికి ఛీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా అవుట్‌సోర్సింగ్ రూపం లో నియమించి ఆయనకు నెలకు లక్ష రూపాయలు సంస్థ ఖర్చు చేస్తోంది. ఆపరేషన్స్ చూసుకోవడానికి సర్వీసులో ఉన్న ఉద్యోగి ఒకరు ఈడీ(ఓ)గా పని చేస్తున్నారు. ఆయన ఉండగా ఈ సీఓఓ ఎందుకు? రిటైర్డ్ ఆర్టీసి అధికారిని అవుట్ సోర్సింగ్ రూపంలో ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్‌డి)గా నియమించి నెలకు సుమారు 80 వేల రూపాయలు సంస్థ ఎందుకు ఖర్చు పెడుతోం ది? డ్రైవర్, కండక్టర్లు ఎండనకా వాననకా రోడ్లమీద పడి కష్టపడి డబ్బు సంపాయించి తీసుకొస్తుంటే ఈ అవుట్ సోర్సింగ్ ఖర్చులేమిటి? చోళ మండలం అనే టీమును తీసుకువచ్చి ఆర్టీసిలో డ్రైవర్లకు ట్రైనింగ్ పేరుతో సుమారు 50,00000 రూపాయ లు ఖర్చు చేయటం అవసరమా? డ్రైవర్లకు ట్రైనింగ్ ఇవ్వటానికి సంస్థలో డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్ట ర్లు, మెకానికల్ ఇంజనీర్లు ఉన్నారు కదా? కాల్ హెల్త్ ప్రోగ్రామ్ పేరుతో మొదటి దశలో సుమారు కోటి 20 లక్షల రూపాయలు, రెండవ దశలో 50 లక్షల రూపాయలు కార్మికుల కోసం ఖర్చు చేసినట్లు గా చెప్తున్నారు. మరి ఈ కాల్ హెల్త్ ప్రోగ్రామ్ ద్వారా ఎంతమంది ఉద్యోగుల ఆరోగ్యాలు బాగుపడ్డాయో అవుట్‌సోర్సింగ్ చేస్తున్న యాజమాన్యానికే తెలియాలి. సంస్థలోకి కొత్త కొత్త స్టార్టప్ కంపెనీలను హైర్ చేసుకుని ఇప్పటికే సుమారు 10 కోట్ల రూపాయలు ఖర్చు చేయటం జరిగింది. జీవా వాటర్ బాటిల్ పేరుతో ఖర్చుపెట్టిన 30 లక్షల రూపాయలు తిరిగొచ్చాయా? అసలీ జీవా వాటర్ అనేది విజయవంతమయిందో లేదో అధికారులే చెప్పాలి. అవుట్ సోర్సింగ్ రూపంలో నష్టాల్లో ఉన్న సంస్థపై ఇంత డబ్బు ఖర్చు పెట్టడం అవసరమా? ఈ అవుట్‌సోర్సింగ్ సైన్యం ఎవరికి ఉపయోగపడుతోంది?

ఇది ప్రజా రవాణా సంస్థ. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్‌తో ఏర్పడిన సంస్థ. దీనికి యజమానులు ప్రైవేట్ వ్యక్తులు కాదు. దీని నిర్వహణ బాధ్యత అంతా రాజ్యాంగ ఉమ్మడి జాబితాలో ఉంటుంది. అందువలన ఒక ప్రైవేటు కంపెనీలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమించుకుని వర్క్ ఫ్రం హోమ్ చేయించుకుంటున్నట్లుగా ఆర్టీసిలో కుదరదు. డ్రైవర్, కండక్టర్లు ఇంటి దగ్గర కూర్చుని బస్సులు నడపలేరు. కాబట్టి ఆర్టీసి లో అవుట్ సోర్సింగ్, కన్సాలిడేటెడ్ పే విధానం పూర్తిగా ఆచరణ యోగ్యం కాదు. రెగ్యులర్ రిక్రూట్‌మెంట్ జరిపితే సంస్థ ముందుకు పోతుంది. ఇకనైనా ఆర్టీసి అధికారులు అవుట్ సోర్సింగ్ రూపంలో ఖర్చులను తగ్గించుకుంటే సంస్థ నష్టాలు మరికొంత తగ్గించుకోవచ్చు. ఆ దిశగా మేనేజిమెంట్ ఆలోచించాలి.

## ఆర్‌బిఐ ప్రకటనల్లో స్పష్టత అవసరం

ద్రవ్య విధానాన్ని ఖరారు చేయడమంటే ఆరు బంతులతో గారడీ చేయడమేనని రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ ఒకసారి చమత్కరించారు. ఆయన మాటలు అక్షర సత్యాలు. అందులో అనుమానమే లేదు. నాలుగైదు మంతులతో గారడీ చేసే సమయంలో, ఏ ఒక్క బంతి పక్కకు జరిగినా, రెప్పపాటుకాలం ఆలస్యమైనా అసలుకే మోసం వస్తుంది. ద్రవ్య విధానంలోనూ అంతే...ఏ ఒక్క రంగాన్ని తక్కువ చేసినా లేదా సరైన ప్రాధాన్యతను ఇవ్వకపోయినా లేదా అతిగా నెత్తిన పెట్టుకున్నా, ఆర్థిక వ్యవస్థ కుప్పకూలే ప్రమాదం ఉంటుంది.

మన దేశంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ)ను సెంట్రల్ బ్యాంక్ పేర్కోవాలి. సాంప్రదాయ ద్రవ్య విధాన సాధనాల వల్ల ఆర్థిక వ్యవస్థ పురోగవృద్ధి మందగిస్తుంది. అనేకానేక పరిమితుల నేపథ్యంలో, లక్ష్యాలు సాధించడం గగనమవుతుంది. అందుకే, కమ్యూనికేషన్ లేదా సమాచార వ్యూహాత్మక ఉపయోగాన్ని ఆర్థిక నిపుణులు ప్రతిపాదిస్తున్నారు. సెంట్రల్ బ్యాంక్ ద్వారా జరిగే సమర్థమైన కమ్యూనికేషన్ ద్రవ్య విధానం ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతుందని అంటున్నారు. మిగతా అన్ని అంచనాలు, అవకాశాలు విఫలమైనప్పుడు, ద్రవ్యోల్బణాన్ని కమ్యూనికేషన్లు ప్రభావితం చేస్తాయి. ఆర్థిక అనిశ్చితి సమయంలో, వడ్డీ రేటు సర్దుబాటు లేదా పరిణాత్మక సడలింపు చర్యలపై మాత్రమే ఆధారపడితే, ఆశించిన ఫలితాలు దక్కకపోవచ్చు. అటువంటప్పుడు సెంట్రల్ బ్యాంక్ విస్పష్టమైన సమాచారాన్ని అందించడం, ప్రజల్లో నెలకొన్న అపోహలను, భయాందోళనలను తగ్గించే రీతిలో వివరాలను బహిర్గతం చేయడం మంచి ఫలితాలనిస్తాయని నిపుణుల అభిప్రాయం. అయితే, సెంట్రల్ బ్యాంక్‌తోపాటు, ఇతరత్రా బ్యాంకులు, సంస్థలు లేదా మంత్రిత్వ శాఖలు, ప్రభుత్వాలు ప్రకటనలు చేస్తే, గందరగోళానికి తెరలేచే ప్రమాదం ఉంది.

మన దేశం విషయానికి విస్తే, ఆర్‌బిఐ, దాని అనుబంధ ఆర్థిక సంస్థలు ఒకే అంశంపై వేర్వేరు అభిప్రాయాలను వ్యక్తం చేయడం సమసాత్మకంగా మారింది. ఒకదానికొకటి విరుద్ధమైన దృక్కోణాలు ఏర్పడడం వల్ల ప్రజలకు సరైన సమాచారం అందడం లేదు. ఆర్‌బిఐ నుంచి కూడా, వేరువేరు సందర్భాల్లో వేరువేరుగా ప్రకటనలు వెలువడడం దారుణం. ఆర్‌బిఐ ఇటీవల ద్రవ్య విధాన ప్రకటలను నిశితంగా పరిశీలిస్తే, ఏకాభిప్రాయం లేకుం డా, అధికారులు ఎవరికివారు, తమకు తెలిసిన సమాచారాన్ని అందిస్తున్నట్టు స్పష్టమవుతుంది. ద్రవ్య విధాన కమిటీ (మానిటరీ పాలసీ కమిటీ/ ఎంపి సి) బాహ్య సభ్యుడు జయంత్ వర్మ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తున్న గణనీయమైన వ్యయాలను ఉటంకించారు. అయితే, వాస్తవ రేట్లకు వ్యతిరేకంగా ఆయన ఇంటర్వ్యూ కొనసాగింది. ఇది ముమ్మాటికీ వాస్తవాలను మరుగుపరచడమే. అసలైన సమస్యల నుంచి దృష్టి మళ్లించే ప్రయత్నమే. ఆర్‌బిఐ అనుసరిస్తున్న పలాయన వాదానికి నిదర్శనమే.

# ప్రాథమిక విద్య-ప్రభుత్వ బాధ్యత



మారుపాక అనిల్ కుమార్

బి.జెపి కేంద్రంలో అధికార పగ్గాలు చేపట్టిన తరువాత సాంస్కృతిక బహుళత్వం, సమానత్వం, విజ్ఞాన శాస్త్ర పరిశోధనలకు సంబంధించిన ఆలోచనలను, ఆచరణను పెంపొందించేందుకు స్థాపించబడిన వివిధ సంస్థలను. ఒక ఒక పద్ధతి ప్రకారం లక్ష్యం చేసుకుని నిర్వీర్యం చేసేందుకు పూనుకుంది.

స్వాతంత్రం వచ్చాక మన రాజ్యాంగంలో ప్రాథమిక హక్కుల్లో దీనికి స్థానం దక్కకున్నా ఆదేశిక సూత్రాల్లో చేర్చి (ఆర్టికల్ 45) 1960 కల్లా 14 ఏళ్ల పిల్లలందరికీ విద్యనందించాలని ఒక లక్ష్యంగా చెప్పుకున్నాం. కానీ జరిగిందేమిటి? నూతన విద్యా విధానాన్ని 1986 లో రూపొందించుకునేటప్పుడు వెనక్కు తిరిగి చూసుకుంటే 6–11 వయస్సు పిల్లల్లో 50శాతం బడి మొహమే చూడ్దం లేదని. ఇప్పుడు మళ్లీ నూతన విద్యా విధానం (2020) అమల్లోకి వచ్చింది. ఇది పాడుతున్నదీ పాత పాటే! కనీస మౌలిక అక్షర జ్ఞానం, సంఖ్యా జ్ఞానం దేశంలో ఐదు కోట్ల మంది పిల్లలకు అబ్బడం లేదట! తక్షణం మూడో తరగతి పిల్లలకు ఈ పఠన సంఖ్యా జ్ఞానం అందించాలట. దీనికోసం National Literacy Mission on Fundamental Literary and Numeracyని ఏర్పాటు చేయాలట దీనర్థం ఏమిటి? పద్నాలుగేళ్ల వరకు చదువుగాదు మన మహత్తర నూతన విద్యా విధానం మూడో తరగతి దగ్గరే మనం దారి తప్పాం? కనీసం ఉన్నంతలో ఏది ప్రత్యామ్నాయం? తమ తమ ఆర్థిక రాజకీయ వ్యవస్థలు ఏవైనా ఆధునిక ప్రపంచదేశాలన్నీ వీలున్నంత తక్కువ గడువులో పౌరులందర్నీ అక్షరాస్యుల్ని చేయడం తమ తక్షణ కర్తవ్యాలుగా అంగీకరించాయి.



పేదరిక నిర్మూలన జరిగే దాకా అందరు పిల్లలు బడికి వెళ్ళలేరనీ, గ్రామీణ ఉత్పత్తి అవసరాలకోసం ప్రస్తుతానికి బాల కార్మిక వ్యవస్థ తప్పదనీ సిద్ధాంతరీకరించే ధోరణి భారతదేశంలోనే చూస్తున్నాం. మన సంస్కరణోద్యమాలన్నీ విద్యకు, మరీ బాలికా విద్యకు పెద్ద పీట వేశాయి. కాని, స్వాతంత్ర్యం వచ్చాక మాత్రం ఒక రాజకీయ సామాజిక తక్షణ లక్ష్యంగా విద్య మన అజెండాలోకి రాలేకపోవడం మాత్రం పచ్చి నిజం. మన సమాజమే దీన్ని అత్యవసరాంశంగా గుర్తించ లేకపోయింది. దీనికి భిన్న దృక్పథం గల దేశాల్లో అవి ఎంత పెద్ద దేశాలైనా, ఎంత వెనుకబాటులో ఉన్నా ఎన్ని ముక్కలు ముక్కలుగా చీలి వున్నా వీటన్నిటిని అధిగమించి అత్యంత వేగంగా సాక్షరతను సాధించాయి. ఇలా ప్రపంచమంతా సార్వత్రిక ప్రాథమిక విద్యను ఒక ఆధునిక ప్రజాస్వామిక యుగ అవసరంగా మార్చుకున్నాయి. భారతదేశమే దీనికి మినహాయింపు. కానీ కళ్ళ ముందే భారత్‌లోనే కేరళ దీనికి భిన్నంగా ఎలా వుండగలిగింది. ఇప్పుడు హిమాచల్ ప్రదేశ్, తమిళనాడు సార్వత్రిక విద్యలో ఎలా అగ్రపీఠానికి చేరుకోగలిగాయి. అదే సందర్భంలో తెలంగాణా వంటి సంపన్న రాష్ట్రాలు సైతం ఎందుకు వెనకబడ్డాయి. ఇలా చూస్తే ఎక్కడో మన రాజకీయ దృక్పథంలోనే లోపముంది. దీని నుంచి మనం పాఠాలు ఎలా తీసుకోవాలి. ఆధునిక రాజ్యంగా మనం మారాలంటే, ప్రజాస్వామ్య సమాజంగా మనం నిలదొక్కుకోవాలంటే, ఉత్పత్తిలో శ్రామికశక్తిలో కొత్త పుంతలు తొక్కాలంటే పాఠశాల విద్యపై సర్వశక్తులు ఒడ్డడం మినహా మార్గం లేదు. సమాజం మొత్తం దీన్నిలా అర్థం చేసుకొని ముందు నిలబడేలా, అన్ని పార్టీలు దీన్ని తమ ఎజండాల్లోకి తెచ్చుకునేలా మన రాజకీయాలు మొదట మారాలి. దానికి తగ్గ సామాజిక ఒత్తిడి కావాలి. అయోధ్య చుట్టూ నడిపిన భావోద్వేగాలని ఎనిమిదో తరగతి దాకా మంచి చదువు కోసం ఎందుకు నడపలేరు?

ఇటీవలి నూతన విద్యా విధానం రాష్ట్రాల్ని తోలుబొమ్మలుగా మారుస్తోంది. సర్వం కేంద్రీకృతం చేస్తోంది. సాంప్రదాయక జ్ఞాన వ్యవస్థలంటూ రాగాలు తీస్తోంది. దీనికి ప్రత్యామ్నాయ విధానం కావాలి. అది కామన్ స్కూల్ విధానాన్ని రాజకీయ దృక్పథంగా పేర్కొనాలి. మన వైవిధ్యాల్ని, అసమానతల్ని గుర్తించి, వాటికి దగ్గ వ్యవస్థల్ని, వ్యూహాల్ని బోధనా విధానాల్ని ముందుకు తేవాలి. ఏ రాష్ట్రానికారాష్ట్రం, ఏ ప్రాంతానికా ప్రాంతం తన అవసరాలకు తగ్గ ప్రణాళికలు రూపొందించుకునే స్వేచ్ఛ వుండాలి. ఇంటిముందు ఏదో ఒక బడి పెడితే చాలు. అది సాంస్కృతికంగా సైతం అక్కడి పిల్లలకు అత్యంత సన్నిహితంగా వుండాలి. ఇంత వైవిధ్యం, దానికి తగ్గ స్వేచ్ఛా సృజనాత్మకతలు లేకుండా మంచి ప్రాథమిక విద్య అందరికీ అందడం అసంభవం. అలాగే బడి వారి అవసరాలను తీర్చగలగాలి. వారి నైపుణ్యాలను, సామర్థ్యాలను పెంచగలగాలి. అన్ని వైపులా వారిని ఒక మెట్టు ఎక్కించగలగాలి పిల్లలచేత నీతి వాక్యాలు వల్లింపజేస్తే సరిపోదు. పరాయికరిస్తే అసలే పనికిరాదు. దీనికి కేరళ, హిమాచల్ వంటి రాష్ట్రాల అనుభవాలను ఆదర్శంగా తీసుకోవచ్చు.

మన దేశంలో 1990ల దాకా గ్రామీణ ప్రాథమిక పాఠశాలలు వీధిబడి స్థాయిని దాటలేదు.

మనదేశంలోనే దీనికి మంచి నమూనాలున్నాయి. కేరళ అనుభవం వీటిలో చాలా గొప్పది. అక్కడ పాఠశాలల నిర్వహణ అంతా పంచాయతీలదే. బాధ్యత వాటిదే. ఆ పంచాయతీలు ఎంతో బలమైనవి. ప్రభుత్వం నియామకాలు, వేతనాలు, అకడమిక్ విధానాలకు పరిమితం అవుతుంది. రోజువారీ నిర్వహణ అంతా పంచాయతీలదే. అలాగే తమిళనాడులో స్వాతంత్ర్యం రాక ముందు నుంచి ఎంతో సమర్థవంతమైన పేరెంటు టీచర్స్ అసోసియేషన్స్, భవన నిర్మాణాల నుంచి మధ్యాహ్న భోజనం, టీచర్ల సెలవుల దాకా ఇవే నిర్ణయిస్తాయి, పర్యవేక్షిస్తాయి. ఇటీవలి కాలంలో హిమాచల్ ప్రదేశ్ దీనికి మరీ మంచి ఉదాహరణగా చెబుతున్నారు. ప్రజా సహకారం, ప్రజా ప్రమేయం, మరీ బడి చుట్టూ తల్లులు రక్షణ కవచంగా నిలబడడం దీని ప్రత్యేకత.

మహిళా శ్రామిక శక్తి, సంఘటన శక్తి బలంగా ఉన్నచోట కూడా పాఠశాలలు బాగా నడుస్తాయని, బాలికా విద్య పటిష్టంగా వుంటుందని మరికొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి.

వాస్తవానికి ప్రపంచమంతటా బడి నిర్వహణలలో స్థానిక కమిటీలదే ప్రధాన బాధ్యత. అన్ని దేశాల్లోనూ స్థానిక ప్రజావ్యవస్థలదీ, తల్లిదండ్రులదే ప్రధానపాత్ర. నిధులకు, పాలసీలకు ప్రభుత్వాలు పరిమితం. మన దేశం మాత్రం దీనికి పూర్తిగా భిన్నం. మన వ్యవస్థ మొత్తం బ్యూరోక్రాట్ల మీద ఆధారపడినడుస్తోంది. బడి అధికారులకే తప్ప ప్రజలకేమీ జవాబుదారీ కాకపోవడం మన దేశంలోనే చూస్తున్నాం. అలాగే ఉపాధ్యాయులను నమ్మాలి. వారికి స్వేచ్ఛనివ్వాలి. బాధ్యతలను అప్పజెప్పాలి. సమాజానికి జవాబుదారీ చెయ్యాలి. మరి దీనికి నూతన విద్యావిధానం చెబుతున్న పరిష్కారం ఏమిటి? మరింత విద్యా శాఖ నియంత్రణ లేదా స్వీయ నియంత్రణా నిర్వహణా పద్ధతు లూ ఈ రెండింటిలోనూ ప్రజల ప్రమేయం ఆవగింజంత కూడా లేదు. ప్రజావ్యవస్థల పాత్రకు చోటే లేదు. బడి సమాజం నుంచి దూరమై ఏకాకి గా మారడం పట్ల ఏమాత్రం దీనికి దృష్టి లేదు. మన పాఠశాల విద్యా కమిటీలు కేవలం పేద ప్రజలతో కూడినవి కావడంతో ఏ జోక్యం చేసుకోలేనివన్న స్పృహ దీనికి లేదు.

వాస్తవానికి విద్యా హక్కు చట్టం పిల్లల విద్యా హక్కుకు ప్రభుత్వం, టీచర్లు, తల్లిదండ్రులు ముగ్గురూ గ్యారంటీ ఇవ్వాలంటుంటుంది. ఆ దృష్టితో చూచినా పాలనా నిర్వహణల్లోనూ వీరి ముగ్గురి ప్రమేయం ఉండాలి. దీన్ని నూతన విద్యా విధానం పట్టించుకోలేదు. కేరళ, హిమాచల్ వంటి రాష్ట్రాల అనుభవాలను అది చూడ నిరాకరిస్తోంది. దీన్నంతా మూడు ముక్కల్లో చెప్పొచ్చు. ఒకటి ప్రభుత్వమే అందరికీ నాణ్యమైన విద్యకు పూచీ పడాలి. రెండు బలమైన వ్యవస్థల్ని నిర్మించాలి. మూడు వాటి నిర్వహణలో ప్రజాస్వామిక దృక్పథం వుండాలి. ప్రజా వ్యవస్థల్ని తోడు తెచ్చుకోవాలి అయితే ఇవన్నీ ఏమీ గాల్లోంచి రావు. రాజకీయాలు ప్రజాస్వామికంగా మారితే తప్ప, విద్యారంగాన్ని ప్రజాస్వామ్యానికి పునాదిగా గుర్తించే దృక్పథం వుంటే తప్ప మన ప్రస్తుత ప్రాథమిక విద్య ఇంత కంటే మెరుగుపడే అవకాశం లేదనిపిస్తోంది. దీనికి తగ్గ ఒత్తిడి సమాజం నుంచి రావాల్సిన తరుణమిది. అట్లని అందరికీ మంచి ప్రాథమిక విద్య అసాధ్యం కూడా కాదు. చాలా దేశాలు దీన్ని సాధించి చూపించాయి. మనదేశంలోనే కేరళ, తమిళనాడు, హిమాచల్ ప్రదేశ్ లాంటి రాష్ట్రాలు దీన్ని సులభంగానే సాధించాయి. మనసుంటే మార్గం వుంది.

# అడిగిందొకటి ఆడింది మరొకటి!



సంగిరెడ్డి హనుమంత రెడ్డి
9490 20 4545

బెల్లమడిగితే చింతపండిచ్చావన్నాడు కొనేవాడు. అది లేకనే నీ నాలుకను చీరే చింతపండిచ్చానన్నాడుషేటు. కొత్త పార్లమెంటులో ప్రతిపక్షాలు ఎన్నో సమస్యలను ప్రస్తావించాయి. సంఘ్ వీరుల దగ్గర సమాధానాలు లేవు.చమత్కారాల అమిత్ స్పీకర్ సాయంతో, రాజనాథ్ విషయాంతరంతో నీళ్ళు నమిలారు.తాతల కాలం కథలతో మోదీ వీరంగమాడారు. తన కుతర్కంతోఏ వరూప్రస్తావించని విషయాలతో నెహ్రూను కించపరిచారు. వివేకముంటే ఆ విషయాల్లో నెహ్రూ ప్రజాస్వామ్య నిబద్ధత, సహనశీలత కనిపిస్తాయి.

రాష్ట్రపతి ప్రసంగ ధన్యవాద తీర్మానంలో రాహుల్ ప్రశ్నలు పిల్లచేష్టలన్నారు మోదీ. రాహుల్ ది బాలక బుద్ధి. అతను విద్యార్థి దొంగ. అవినీతి కేసులో బెయిల్ పై ఉన్నాడు. సావర్కర్ ను అవమానించినందుకు అతనిపై కేసు నడుస్తోంది. అని అవమానించారు. ఓడిన పక్షాలు మద్దెల ఓడటున్నాయి. (విపక్ష) అవినీతి అంతం,అభివృద్ధి, బుజ్జగింపులేని (స్వపక్ష) న్యాయం, నా నిబద్ధత. అన్నారు. ఇవి తన పాలనపై రాహుల్ భావార్థ ప్రశ్నలకు విపరీత, విరోధ, వినోద జవాబులు. మోదీ, షాల గోధ్రానంతర నరమేధ దోపిడి, హత్య, అత్యాచారాల నేరాలను మోదీ ప్రధాని కాగానే న్యాయస్థానం కొట్టేసింది. మండుతున్న మణిపూర్, వివాదాస్పత తాత్కాలిక సైన్య అగ్నిపథ్,మతపర సమాజ చీలిక, భయాందోళనల జిత్తులు, మతరాజకీయాకరణలపై మోదీ స్పందన లేదు. హైందవంలో విద్వేషం,హింస లేవు. హింసావిద్వేష ప్రోత్సాహకులైన అమిత్, మోదీలు హిందువులు కారు. అని రాహుల్ చిత్ర ప్రదర్శన చేశారు. దీన్ని హైందవ అవమానమని మోదీ అభాండించారు.ప్రజాస్వామ్య ప్రాణమైన స్వేచ్ఛానిర్భయత్వాల,పౌరరక్షణ, జవాబుదారితనాలపై స్పందించ లేదు. ప్రభు త్వ యంత్రాగస్వార్థపూరితదురుపయోగంపై,ప్రశ్నాపత్రాల అమ్మకాలపై, అయోధ్య, ఢిల్లీవిమానాశ్రయాల పైకప్పులు కూలడంపై, అయోధ్య రామ రహదారి గుహగా మారడంపై, అయోధ్య, గుజరాత్ రైల్వే స్టేషన్ల కారడంపై, వర్షానికి బాల రామాలయ ధ్వంసంపై, రైళ్ల ప్రమాదాలపైప్రధాన సేవకుని చింతే లేదు.వ్యవస్థిత పార్లమెంటరి ప్రజాస్వామ్య సూత్రాలను తెంచారు మోదీ. పదేళ్ళ వాగాడంబరాన్నేఇప్పుడూ కొనసాగించారు. తటస్థంగా ఉండవలసిన స్పీకర్ ఓం బిర్లా ప్రతిపక్ష నేతలనే మందలించారు. ప్రజాస్వామ్యలౌకికులమని కోతలుకోసే మద్దతుపక్షాలు మౌనంగా ఉన్నాయి.

ఇవిఎంలపై, రాజ్యాంగంపై, రిజర్వేషన్లపై, రాఫెల్ యుద్ధ విమానాలపై, హెచ్.ఎ.ఎల్.,ఎల్.ఐ.సి., బ్యాంకులపై అబద్దాలు ప్రచారంచేశారు. ఇవిఎంలు బాగా పనిచేశాయి. రాజ్యాంగానికి ముప్పేమీ లేదు. రిజర్వేషన్లు కొనసాగుతున్నాయి. రాఫెల్ విమానాలు బాగా పనిచేస్తున్నాయి. హెచ్.ఎ.ఎల్., ఎల్.ఐ.సి., బ్యాంకులు లాభాలు తెచ్చాయి .నిన్న అగ్నివీర్, కనీస మద్దతు ధరలపై సభ ను తప్పుదారి పట్టించారు. సైన్యాన్ని అవమానించారు. నా సర్కారు రైతులకుచాలామేళ్ళు చేసింది. కాంగ్రెస్, మిత్ర పక్షాలతో సీట్లు పెంచుకున్న పారజైట్ (పరాన్నబుక్కు)పార్టి. 60 ఏళ్ళు దేశాన్నేలిన కాంగ్రెస్ అరాచక వ్యాప్తి దేశ దౌర్భాగ్యం. ఉత్తర భారత దేశంలో దక్షిణానికి వ్యతిరేకంగా, దక్షిణ భారతంలో ఉత్తరానికి విరుద్ధంగా భాష మార్చి మాట్లాడారు. దేశాన్ని చీల్చడానికి అన్ని ప్రయత్నాలు చేశారు. దేశ విభజనను కోరినవారికి కాంగ్రెస్ పార్లమెంటు టికెట్లు ఇచ్చింది. విపక్షాల దురాలోచనలు వాటి దేశాభివృద్ధి పథకాలుగా మారాయి. నా విజయ రహస్యంఇదే. ఇలా అనర్గళంగా మాటల తూటాలతో రెండు గంటల సేపుయుద్ధంచేశారు.

మతఛాందసుల ఆలోచనాధోరణే వేరు. ఒకరు ఖరీదైన కారు కొన్నారు. గుడిలో పూజలు చేయించారు.ఎర్రనీళ్ళ దిష్టితీశారు. మిరప, నిమ్మకాయల, వెంట్రుకల దండ కట్టారు. సాయంత్రమేకారు యజమాని కొడుకు తాగి కారు నడిపారు. కారు పచ్చడయింది. పిల్లవాడికి కాళ్ళు, నడుం విరిగాయి. పూజలు చేయకపోతే పిల్లాడే చనిపోయేవాడని యజమాని సమర్థించుకున్నారు. ఈ ఆలోచన అశాస్త్రీయం. ప్రభుత్వరంగ సంస్థల్లో పాలకపక్ష పక్షపాత ప్రమేయం లేకపోతే లాభాలు పెరిగి ప్రజాప్రయోజనం కలుగుతుందన్నది నిరూపిత సత్యం. ప్రజాందోళనలకు, వాటికి ప్రతిపక్షాల మద్దతుకు కారణాలు వేరు. జరిగిన దుశ్చర్యలు, ఫలితాలు వేరు. మోదీ వాక్చాతుర్యాలు వాటికి వక్రీకరణలు. ఇవిఎంలను మోదీయం అవసరార్థం, తనకు అనుకూలంగా సిబ్బంది మంద సహాయంతో వాడుకుంది. 2022 గుజరాత్ ఎన్నికల్లో విజయరహస్యమిదే. మోదీ తన రాజ్యాంగవిరుద్ధాలను రాజ్యాంగరక్షణలని పొగుడుకున్నారు. రాజ్యాంగ లోపాలను వాడుకొని రాజ్యాంగ వ్యతిరేక చట్టాలను చేసింది మోదీ సర్కారు. రాజ్యాంగ మార్పుకు 400సీట్లు కావాలని బిజెపి నాయకులు ప్రచారంచేశారు.ఎస్.సి., ఎస్.టి.రిజర్వేషన్ల రద్దు, ముస్లింల బహిష్కరణవంటి కోరికలను తీర్చుకోవచ్చని భావించారు. ప్రతిపక్షాలు రాజ్యాంగరక్షణేఎన్నికల ప్రచారఅస్త్రంగా చేశాయి. రాఫెల్ యుద్ధ విమానాలు పనిచేయవని ఎవరన్నారు?వాటిని ఎక్కువ ధరకు కొన్నారని, భారత వాయుసేనకు రాఫెల్ యుద్ధ విమానాలకూర్పు, శిక్షణ సౌకర్యాలను, హెచ్.ఎ.ఎల్. లాభాలను హరించారని,విమానాల తయారి అనుభవం లేని అనిల్ అంబానీకిరాఫెల్ఒప్పందంఇచ్చారని మోదీపై అభియోగం. ఎల్.ఐ.సి. నష్టపోతుందన్నప్రస్తావనే లేదు. పెట్టుబడులే అక్కరలేనిఎల్.ఐ.సి.లో విదేశీ పెట్టుబడులు ఎందు కు, దాని వాటాలను అమ్మడమెందుకని నిరసనలు, ఆందోళనలు జరిగాయి. 4శాతం వడ్డీ ఇచ్చిన ప్రజాధనాన్ని10–17 శాతం వడ్డీకి తిప్పే బ్యాంకులకు నష్టం రాదు. ప్రభుత్వ బ్యాంకుల నుండి తమ ఆశ్రిత సంస్థలకు లక్షల కోట్ల అప్పులు ఇప్పించారని, అవి మోదీ హయాం లో పెరిగాయని, బ్యాడ్ బ్యాంక్ లాంటి దలాలి సంస్థలను స్థాపించి బ్యాంకులను మోసంచేశారని, ఏడేళ్లలో రూ.11లక్షల కోట్ల అప్పులు మాఫీచేశారని, కోట్ల కోట్ల అప్పులు ఎగ్గొట్టినవారికి విదేశాలకు పారిపోయే అవకాశం కల్పించారని అవినీతి నిర్మూల న చక్రవర్తి మోదీపై నిందలు.

అగ్నివీరులను ఎవరూ అవమానించలేదు. వారు అన్యాయానికి గురయ్యారని, తాత్కాలిక సైన్యంతో దేశభద్రతకష్టమని, అగ్నిపథ్ పద్ధతిలో సైన్యంలో ఏటా నికరంగా 75 వేల సిబ్బంది కొరత ఏర్పడుతోందని,45 వేల తాత్కాలిక సైనికులు బజారునపడి నిరుద్యోగ సైన్యంలో చేరతారని, కార్మిక సంక్షోభం ఏర్పడుతుందనిబాధ. దీనివల్ల భారత సైన్యంలో చేరవలసిన నేపాలీ ఘోర్ఖాలు రష్యా తరఫున ఉక్రెయిన్‌తో యుద్ధంచేస్తున్నారు. రేపు పాక్, చైనా ల పక్షాన మన తోనే పోరాడవచ్చు. భారత ఏకైక ఫీల్డ్ మార్షల్ మానెక్ షా ఘోర్ఖాదళానికి చెందినవారే. రాష్ట్రాల జాబితాలోని వ్యవసాయరంగంలో మోదీ సర్కారు కార్పొరేట్లకు మేళ్ళుచేసే నాలుగు నల్ల చట్టాలను చేసింది. వాటికి నిరసనగా రైతులు 13 నెల లు ఉద్యమం చేశారు. ప్రభుత్వ లెక్కల్లో 750 మంది చనిపోయారు. ఈ ఉద్యమ నిరోధానికి దేశభక్త మోదీయం భారత రహదార్లపై మేకులు పరిచింది. కందకాలు తవ్వింది. నేటికీ రైతులకు కనీస మద్దతు ధర హామీ ఇవ్వలేదు.

కాంగ్రెస్ కూటమి పరస్పర సహకారంతో సీట్లు పెంచుకొంది. మొన్న వాజపేయి,నేడు మోదీ కూటమిపైనే ఆధారపడి ప్రభుత్వాలను ఏర్పాటుచేశారు. మోదీబిజెపి ఎం.పి.ల్లో వందమంది, కొన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు ఇతర పార్టీల నుండి వచ్చినవారే. కాంగ్రెస్ కూడా బహుళ జాతి సంస్థల ప్రయోజనకారే. కాని అరాచకం, అప్రజాస్వామికం, నిరంకుశత్వం మోదీ బిజెపినిర్వాకాలే. భాష, సంస్కృతి, సనాతన సంప్రదాయం, మతం విన్యాసాలతో దేశాన్ని చీల్చింది మోదీ సుపరిపాలనే.గాంధి హత్య సమర్థకులకు, గోడ్సె భక్తులకు పార్లమెంటు సీట్లిచ్చిన ఘనత మోదీదే. దేశానికి పోటీతత్వ నాగరిక సంభాషణల చర్చలు కావాలి. ప్రధానిగా చివర మాట్లాడే అవకాశాన్ని దుర్వినియోగం చెయ్యరాదు.

రచయిత : ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి

## ప్రజాప్రతినిధుల కృషి అభినందనీయం

### తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్



ప్రజాపక్షం/తిరుమలగిరి: ఐదేళ్ళపాటు మండల అభివృద్ధి ప్రజాప్రతినిధులు అందించిన సేవలు అభినందనీయమని తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో పదవీకాలం ముగిసిన ఎంపిపి, జెడ్‌పిటిసి, ఎంపిటిసిలను ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధుల పాత్ర అభివర్ణనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నెమరగొమ్ముల స్నేహలత, జెడ్‌పిటిసి దూపటి అంజలి రవీందర్, ఎంపిటిసిలు ధరావత్ జుమ్మిలాల్ నాయక్, కోఆప్షన్ సభ్యులు మౌలానా, మున్సిపల్ చైర్ పర్సన్ శాగంటి అనసూర్య రాములు, అధికారులు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు



ప్రజాపక్షం/చివ్వెంల: మండలంలోని అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారునికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ, మండల ప్రత్యేక అధికారి జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ మండల ప్రజా పరిషత్ ప్రాదేశిక సభ్యులు ఐదు సంవత్సరాల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికా రులను నియమించినట్లు తెలిపారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపిడిఓ చక్రల సంతోష్ కుమార్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

## నేడు కలెక్టరేట్ల ముట్టడి

### బొగ్గు బ్లాకుల వేలాన్ని నిరసిస్తూ ఆందోళన

ప్రజాపక్షం/ ఖమ్మం : ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగా సింగరేణిలో బొగ్గు బ్లాకులను వేలం వేయడాన్ని నిరసిస్తూ వామపక్ష పార్టీలు, అఖిలపక్ష కార్మిక సంఘాలు ఆందోళనలకు పిలుపునిచ్చాయి. బొగ్గు బ్లాకుల వేలాన్ని ఉపసంహరించుకోవాలని, తెలంగాణ రాష్ట్రంలో బొగ్గు ఉత్పత్తిని సింగరేణి ద్వారానే జరపాలని వామపక్షాలు ఆందోళనకు పిలుపునిచ్చాయి. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడికి పిలుపునిచ్చాయి. బొగ్గు బ్లాకుల వేలాన్ని నిలిపి వేయాలని, సింగరేణిని పరిరక్షించాలని వామపక్షాలు ముఖ్యంగా సిపిఐ దీర్ఘకాలిక పోరాటానికి పిలుపునిచ్చింది. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ వైపు పరుగులు పెడుతుందని ఆ క్రమంలోనే సింగరేణి పరిధిలోని బొగ్గు బావులను సైతం ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తుందని వామపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. బొగ్గు బ్లాకుల వేలాన్ని ఉపసంహరించుకునేంత వరకు ఆందోళనలు కొనసాగిస్తామని సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా లు తెలిపారు. సింగరేణిలో ఆందోళనలు చేపట్టి ప్రభుత్వం ఉపసంహరించుకునేలా చేస్తామని అప్పటి వరకు ఆందోళనలు కొనసాగుతూనే ఉంటాయన్నారు.

## సిసిరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



ప్రజాపక్షం/తిరుమలగిరి: మున్సిపల్ పరిధిలోని 1వ వార్డు సుందరయ్య కాలనిలో రూ. ఒక కోటితో నిర్మించనున్న సిసి రోడ్డు పనులకు తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్ గురువారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ కాలని ఏర్పాటై సంవత్సరాలు గడుస్తున్న నాటి పాలకుల హాయాంలో రోడ్లను నిర్మించకుండ విస్మరించారన్నారు. కాలనీలు, పల్లెలు, వాడలు కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ శాగంటి అనసూర్యరాములు, కమిషనర్ రామదుర్గారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు వై నరేష్, నాయకులు అంబేద్కర్, సుంకరి జనార్ధన్, ధరావత్ జుమ్మిలాల్ నాయక్, పేరాల వీరేష్ పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలపై సమరశీల పోరాటాలు



### ఎఐవైఎఫ్ , ఎస్ఎఫ్ జిల్లా నాయకులు గడ్డం నవీన్, ఇరిగి ప్రవీణ్

ప్రజాపక్షం/చండూరు : దేశ వ్యాప్తంగా విద్యారంగ సంస్థలను బిజెపి ప్రభుత్వం వ్యాపార రంగంగా మార్చి విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించాయని ఎఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం నవీన్ , ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఇరిగి ప్రవీణ్ అన్నారు. ఎఐఎస్ఎఫ్, వైఎఫ్ ఆద్వర్యంలో గురువారం తలపెట్టిన భారత్ బంద్ కార్యక్రమంలో భాగంగా చండూరు మండలంలో భారత్ బంద్‌ను విజయవంతం చేశారు. వారు మా ట్లాడుతూ బిజెపి పాలిత రాష్ట్రాలలో పేపర్ లీకులు జరుగుతున్న ప్రధాని నరేంద్రమోదీ స్పందించకపోవడం అప్రజా స్వామికం అని అన్నారు. పేపర్ లీకేజీల వలన దేశ ప్రతిష్ట మసకబారుతుందని అన్నారు. నీట్ బాధిత విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం న్యాయం చేయకుంటే భవిష్యత్ ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హరికృష్ణ , సైదులు, గడ్డం పవన్, బరిగెల నిఖిల్, గడ్డం సాయి, ఏర్పుల శంకర్, బగిగెల అజిత్, నవీన్, మహేష్ రాజు చరణ్ చింటు పాల్గొన్నారు.

## నార్కట్‌పల్లి పోలీస్ స్టేషన్ తనిఖీ



ప్రజాపక్షం/నార్కట్‌పల్లి : నల్లగొండ జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ గురువారం నార్కట్ పల్లి పోలీస్ స్టేషన్ ను సందర్శించారు. నార్కట్ పల్లి స్టేషన్ హౌస్ ఆఫీసర్ నర్రా అంతిరెడ్డి ఎస్‌పికి పూ ల మొక్కతో స్వాగతం పలి కారు.ముందుగా పోలీస్ గౌరవ వందనం ఎస్‌పి స్వీకరించారు. అనంతరం పోలీస్ స్టేషన్ లో క్రైమ్ రేట్ పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులను, సిసి కెమెరాల పర్యవేక్షణను పరిశీలించారు. డిఎస్‌పి శివరాం రెడ్డి, సిఐ నాగరాజులు ఉన్నారు.

## రైతుభరోసాపై ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాపక్షం/చింతలపాలెం : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రైతుల కోసం ప్రభుత్వం విడుదల చేయాల్సిన రైతు భరోసాపై గురువారం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ప్రజాభిప్రాయ సేకరణలో పలువురు రైతులు మాట్లాడుతూ 10 ఎకరాల వరకు రైతుభరోసా పథకం వర్తింప చేయాలని,రైతులకు సబ్సీడి రూపంలో సేంద్రీయ ఎరువులు, వ్యవసాయ పనిముట్లు అందించాలన్నారు. కౌలురైతులను గుర్తించి వారిని ప్రభుత్వం ఆదుకోవాలని, పంటలకు మద్దతు ధర కల్పించాలని, ప్రకృతి వైపరిత్యాల వలన పంటకు నష్టం జరిగితే నష్టపరిహారం అందించాలని రైతులు అభిప్రాయాలను వ్యక్తం చేశారు. జిల్లా సహకార అధికారి పద్మ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ అంజయ్య, ఏవో శ్రీనివాస్‌గౌడ్, ఎన్‌డిసిబి బ్రాంచ్ మేనేజర్ మోహినుద్దీన్,పిపిసిఎస్ చైర్మన్ వేముల రంగాచారి, పిపిసిఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# అవినీతి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

### అభివృద్ధి పనులు నాణ్యతతో వేగవంతం చేయాలి

### అధికారులకు ప్రజలకు అందుబాటులో ఉండాలి

### మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి




ప్రజాపక్షం/హుజూర్‌నగర్: అవినీతి అక్రమాలకు పాల్పడితే ప్రజాప్రతినిధులైన, అధికారులపైన అయినా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు.గురువారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో క్రైస్తవ స్మశానవాటిక పనులను పరిశీలించి టియూఎఫ్ఐడిసి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరైనా చట్టం ప్రకారమే వ్యవహరించాలని చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు ఉంటాయన్నారు. అభివృద్ధి పనులు నాణ్యతతో వేగవంతం అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సంక్షేమ అభివృద్ధి పనులలో భాగస్వామ్యం చేయాలన్నారు. మున్సిపాలిటీల లేఅవుట్ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్లు పకడ్బందీగా వ్యవహరించాలన్నారు. గత బిఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతి,అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి దోషులను వెలికితీయాలన్నారు. ప్రభుత్వభూము లు అన్యాక్రాంతం కాకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. భూములను రక్షించేందుకు న్యాయ వ్యవస్థను సమర్ధవంతంగా ఉపయోగించుకోవాలన్నారు. హుజూర్‌నగర్,నేరేడుచర్ల మున్సిపాలిటీలలో లేఅవుట్ స్థలాలను రక్షి ంచేలా మున్సిపల్ కమిషనర్లు 24 గంటలు లోపల చర్యలు తీసుకోవాలని తీసుకోకపోతే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. రామస్వామి గుట్ట వద్ద త్వ రలో 2160ఇండ్లు పేదలకు పారదర్శకంగా పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. గుట్ట వద్ద 50ఎకరాల ప్రభుత్వస్థలంలో ఏర్పా టు చేసిన ప్లాట్లపై ఐదుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసి రీసర్వే జరిపి వాస్తవాలను తెలియజేసేలా 15 రోజులలో రిపోర్టు అందచేయాలని కలెక్టర్‌ను కోరారు. రూ.2కోట్లతో నిర్మించే మినీస్టేడియం నిర్మాణానికి అనువైన స్థలాన్ని మూడురోజుల్లో గుర్తించాలని అధికారులను కోరారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు అత్యంత నాణ్యతతో జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. న్యాక్ ద్వారా శిక్షణ పొందిన 30 మంది మహిళలకు రూ.2లక్షల10వేల విలువైన కుట్టు మిషన్లను మున్సిపల్ కార్యాలయంలో లబ్దిదారులకు అందజేశారు. అధికారులు అప్రమత్తతో వ్యవహరించాలి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తించకుండా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ కోరారు. హుజూర్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్ మంజూరు చేయించిన నిధులకు సంబంధించి టెండర్, పనులను వేగవంతంగా చేసేలా అధికారులు వ్యవహరించాలన్నారు. ఎక్కడైనా ప్రజలకు సేవలందించడంలో నిర్లక్ష్యం వహిస్తే సాంకేతికతను ఉపయోగించి కనుగొనడం జరుగుతుందన్నారు.మంచినీటి సరఫరా,పరిసరాల పరిశుభ్రత విషయంలో ఎట్టి పరిస్థితులలో నిర్లక్ష్యం వహించరాదన్నారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చన రవి, వైస్‌చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి, ఆర్డీవో శ్రీనివాసులు, కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి,కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయంలో అవినీతిని అరికట్టాలి

### అవినీతికి పాల్పడుతున్న-సర్వేయర్‌లను సస్పెండ్ చేయాలి

### సిపిఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా




ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం: తహసిల్దార్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి అరికట్టాలంటే సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో గురువారం నారాయణపురం ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. డబ్బులు ఇస్తేనే సర్వే చేస్తున్న సర్వేయర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య మాట్లాడుతూ సంవత్సరకాలంగా తహసీల్దార్ కార్యాలయము రిపోర్టులు ఇవ్వకుండా ధరణి దరఖాస్తులను పెండింగ్లో పెట్టిందని ఆరోపించారు. అదేవిధంగా డబ్బులు ఇచ్చినవారి ఫైళ్లను క్లియర్ చేస్తూ తహసిల్దార్ కార్యాలయంలో అవినీతికి పాల్పడుతున్నారని అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి పనికి ఓ రేటును నిర్ధారించి దళారుల ద్వారా వ్యవస్థను కొనసాగిస్తున్నారన్నారు. రాచకొండలో గల గ్రామ పంచాయతీ భూములను తిరిగి ఇతరులకు రిజిస్ట్రేషన్ చేస్తున్నారని ఆరోపించారు. తహసీల్దార్ కార్యాలయానికి వస్తే పేదలు ఎవరికీ న్యాయం జరగడం లేదని, ఆ కార్యాలయంలో అవినీతికి పాల్పడుతున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అదేవిధంగా ఏళ్లుగా ప్రభుత్వ భూములలో సాగు చేసుకుంటున్నా రైతులకు నూతన పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని వెంటనే వారికి నూతన పాస్ పుస్తకాల మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా చేస్తున్న వారి వద్దకు ఎమ్మార్వో కృష్ణ వచ్చి సమస్యలన్నిటినీ పరిష్కరిస్తామని తమ దృష్టికి తీసుకువస్తే అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని సమాధానం ఇవ్వడంతో ధర్నాను విరమించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసిల్దార్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్,సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కురిమిద్ద శ్రీనివాస్, సిపిఐ పట్టణ కార్యదర్శి చిలువేరు అంజయ్య, పల్లె మల్లారెడ్డి, కలకొండ సంజీవ, సుర్వి నర్సింహా, పొట్ట శంకరయ్య,కొప్పు సుధాకర్, భీమనపల్లి గాలయ్య,వీరమళ్ళ యాదయ్య,గడ్డం యాదయ్య, బద్దుల పెంటయ్య, గుండు నర్సింహా,సురపల్లి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులు నైతిక విలువలతో పనిచేయాలి

### తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి



ప్రజాపక్షం/కొండమల్లేపల్లి : జర్నలిస్టులు నైతిక విలువలతో పనిచేయాలని ఐజెయు జాతీయ అధ్యక్షుడు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారంమండల కేంద్రంలోని ఎస్వీ కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కొండమల్లేపల్లి ప్రెస్‌వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలచాపికప దేవరకొండ ఎంఎల్‌ఎ నేనావత్ బాలునాయక్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రణాళిక తయారు చేస్తుందని , ఆ ప్రణాళిక ప్రకారం త్వరలో అర్హత గల జర్నలిస్టులందరికి అక్రిడిటేషన్లు, ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డులు వస్తాయన్నారు. ఎంఎల్‌ఎ బాలునాయక్ మాట్లాడుతూ త్వరలో మండల జర్నలిస్టులందరికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇండ్ల స్థలాలు, ఇండ్లు ఇస్తామన్నారు. తన సొంత నిధుల నుండి ప్రెస్ అసోసియేషన్ భవనం మంజూరు చేస్తానని జర్నలిస్టులకు హామీ ఇచ్చారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ మాట్లాడుతూ జర్నలిస్టులందరూ ఐక్యతతో ఉండి ప్రజల సమస్యలను వెలికి తీసి వాటి పరిష్కారానికి కృషి చేయాలని మండల జర్నలిస్టులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజె జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణా రెడ్డి, జిల్లా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షుడు గిరిధర్ రావు, పార్లమెంట్ కో–ఆర్డినేటర్ సిరాజ్‌ఖాన్, నాయిని మాధవరెడ్డి, గుమ్మకొండ వెంకటేశ్వర్ రెడ్డి, ఊట్కూరి వేమన్‌రెడ్డి, మాజీ సర్ప ంచ్ కుంభం శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ గంధం సురేష్, జెడ్పిటిసి సలహాదారుడు పసునూరి యుగేందర్‌రెడ్డి, మండల ప్రెస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏరుకొండ రాము, ఉపాధ్యక్షులు కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

### పంటల పెట్టుబడికి 50శాతం అదనంగా

# మద్దతు ధర నిర్ణయించాలి

### తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ డిమాండ్



ప్రజాపక్షం/భువనగిరిరూరల్: పంటల పెట్టుబడికి 50 శాతం అదనంగా కలిపి మద్దతు ధర నిర్ణయించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్ చేశారు. అఖిలభారత కిసాన్ సభ ఇచ్చిన పిలుపులో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని గంజి మార్కెట్ ఎదురుగా మెయిన్ రోడ్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ మాట్లాడుతూ పంటల మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేసి అమలు చేయాలని రుణమాఫీ చట్టం అమలు చేయాలని చెప్పారు. సుదీర్ఘకాలం దేశ రైతాంగం ఢిల్లీలో 16 నెలల పాటు సరిహద్దులను మూసివేసి నిర్వహించిన చారిత్రాత్మక రైతు ఉద్యమ వత్తిడికి తలోగ్గి పంటల మద్దతు ధరలను డాక్టర్ స్వామినాథన్ కమిటీ సూచనల మేరకు వ్యవసాయానికి పెట్టిన పెట్టుబడి ఖర్చుకు 50 శాతం అదనంగా కలిపి మద్దతు నిర్ణయించడానికి ఒక కమిటీని వేసి నిర్ణయిస్తామని ప్రధానమంత్రి మోడీ వాగ్దానం చేశారు. కేంద్ర పాలకులు ఈ తరహా రైతు వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని అన్నారు. పం టల మద్దతు ధరలకు పార్లమెంటులో చర్చించి డాక్టర్ స్వామినాథన్ కమిటీ సూచనల మేరకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లూరి రాజయ్య, గీత పనివారాల సం ఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు గోదా శ్రీరాములు, అఖిలభారత యువజన సమాఖ్య జిల్లా మాజీ నాయకులు యానాల దామోదర్ రెడ్డి, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఏషాల అశోక్, ఏఐటీయూసీ జిల్లా ప్రధా న కార్యదర్శి ఎండి ఇమ్రాన్, ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేష్, గీతా పనివారాల సంఘం జిల్లా కార్యవర్గ స భ్యులు పుట్ట రమేష్, రైతు సంఘం నాయకులు సోమన ఐలయ్య, సుర్కంటి సాయిరెడ్డి, జక్కా దయాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిగత స్వేచ్ఛను హరిస్తున్న కొత్త చట్టాలు

### న్యాయవాదుల దీక్షకు మద్దతు తెలిపిన సిపిఐ



ప్రజాపక్షం/ ఖమ్మం : వ్యక్తిగత స్వేచ్ఛను హరించేవిధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన చట్టాలు ఉన్నాయని సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ఆరోపించారు. ప్రజల సమ్మతి లేకుండా పార్లమెంటులో చర్చ జరగకుండా అమల్లోకి తీసుకు వచ్చిన నూతన చట్టాలను తక్షణం ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఖమ్మం బార్ అసోసియేషన్‌లో నూతన చట్టాలను రద్దు చేయాలని జరుగుతున్న రిలే నిరాహార దీక్షకు గురువారం సిపిఐ తరుపున సంఘీభావాన్ని, న్యాయవాదుల పోరాటానికి మద్దతును తెలిపారు. ఈ సందర్భంగా పోటు ప్రసాద్ మాట్లాడుతూ నూతన చట్టాలను తీసుకు వచ్చే ముందు విస్తృతంగా చర్చ జరగాల్సి ఉందని ఇటువంటిది జరగలేదని పార్లమెంటులో సైతం చర్చ జరగకుండానే ప్రజా వ్యతిరేక చట్టాలను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. ఈ చట్టాలు స్వేచ్ఛను హరించడంతో పాటు సామాన్యులకు శాపాలుగా మారనున్నాయన్నారు. ఖమ్మం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోరాటం అభినందనీయమని భారత కమ్యూనిస్టు పార్టీ న్యాయవాదుల పోరాటానికి మద్దతుగా నిలుస్తుందని ప్రసాద్ తెలిపారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్య లు జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, రావి శివరామకృష్ణ, ఐఏఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓరుగంటి శేషగిరిరావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐఏఎల్ అధ్యక్షులు కె. సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు కొల్లికొండ శరత్‌బాబు, సీనియర్ న్యాయవాదులు పట్టాభి, అమర్ చంద్, ఉమామహేశ్వరరావు, జివి లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డెక్కిన హాస్టల్ విద్యార్థులు

### ప్రిన్సిపాల్ మాకొద్దంటూ ఆందోళన



ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్: హాస్టల్‌లో సరైన సౌకర్యాలు లేకపోవడంతో గురువారం మండల పరిధిలోని బాలెంల సమీపంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, బాలికల జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులు సూర్యాపేటజనగాం రహదారిపైకి ఎక్కారు. కళాశాల ప్రిన్సిపల్ మాకొద్దంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. హాస్టల్‌లో సౌకర్యాలు సరిగ్గా లేవని, భోజనం బాగోలేదని, పుచ్చిపోయిన, మురిగిపోయిన కూరగాయలతో వండిపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం ప్రిన్సిపల్ దృష్టికి తీసుకెళ్తే పట్టించుకోగపోగా పైగా టిసి ఇచ్చి ఇంటికి పంపుతానని బెదిరింపులకు పాల్పడుతుందని వాపోయారు. ప్రభుత్వాలు మారిన పాలకులు మారిన తమకు సరైన సదుపాయాలు కల్పించడం లేదని అన్నారు. విషయం తెలుసుకున్న బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు వీరబోయిన లింగయ్య యాదవ్ సంఘటన స్థలానికి చేరుకోని విద్యార్థుల ఆందోళనకు మద్దతు తెలిపారు. పరిస్థితి ఉధృతంగా మారడంతో సూర్యాపేట రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకోని విద్యార్థులను నచ్చచెప్పి ఆందోళనను విరమింప చేశారు.

## బొగ్గు బ్లాకుల వేలం ఉపసంహరించుకోవాలి

### తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : కేంద్రంలోని నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం ప్రైవేట్ సంస్థలకు బొగ్గు బ్లాకులను వేలం వేయాలనే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొ య్యడ సృజన్ కుమార్ డిమాండ్ చేశారు. ప్రైవేట్ సంస్థలకు మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాకులను కేంద్రంలోని నరేంద్ర మోడీ బిజె పి ప్రభుత్వం వేలం వేస్తున్నదని, సింగరేణి సంస్థను ప్రైవేట్ సంస్థలతో పాటు వేలం పాటలో పోటీపడాలని నిర్ణయించడం సిగ్గేచేటన్నారు. తెలంగాణలో సింగరేణి కాలరీస్ బొగ్గు గనుల తవ్వకం కోసమే స్థాపించిన ప్రభుత్వ రంగ సంస్థ అనే విషయం కేంద్ర ప్రభుత్వం మరిచిపోయిందన్నారు. సహజంగానే శ్రావణపల్లిలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో బొగ్గు తవ్వకాలు చేపట్టాలని కానీ వేలం పాట ద్వారా ప్రైవేట్ సంస్థలకు అవకాశం సరికాదన్నారు. ఇప్పటికే నాలుగు బ్లాకులు గత ప్రభుత్వ పాలనలోనే మోడీ ప్రభుత్వం ప్రైవేట్ సంస్థలకు అప్పగించిందన్నారు. ప్రస్తుతం సింగరేణి 40 వేల మంది పర్మినెంట్ కార్మికులకు, మరో 26 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులకు ఉపాధి కల్పిస్తోందన్నారు. రికార్డు స్థాయిలో తక్కువ ధరకే నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేస్తోందన్నారు.

తెలంగాణ ప్రజలకు తీరని అన్యాయం చేస్తున్న కేంద్ర బిజెపి ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలన్నారు. దేశభక్తి పేరుతో దేశ సంపదను ప్రైవేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తున్న బిజెపి విధానాలను ప్రజానీకం గుర్తించి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

## మహిళలకు పెద్దపీట

### ఎంఎల్ఎ వేముల వీరేశం



ప్రజాపక్షం/నార్కట్‌పల్లి: మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని నకిరేకల్ ఎంఎల్‌ఎ వేముల వీరేశం అన్నారు. గురువారం నార్కట్‌పల్లి పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కళ్యాణలక్ష్మీ, షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. మండలంలో 55 చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నరేందర్ రెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు,వైస్ ఎంపీపీ కల్లూరి యాదగిరి,ఎంపీటీసీ లు శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# ఏదో తప్పు జరిగింది..సమన్వయంతో సరి చేసుకోండి

### అంతా ప్రిన్సిపాల్‌తో నేను మాట్లాడాను

### శ్రీ చైతన్య పాఠశాల వ్యవహారంపై విద్యాశాఖ ఏడి

### విద్యార్థి సంఘ నాయకులతో ఫోన్‌లో సంభాషణ

### సోషల్ మీడియాలో వైరల్





ప్రజాపక్షం/సూర్యాపేటప్రతినిధి: ఏదో తప్పు జరిగింది.. సమన్వయంతో సరి చేసుకోండి... ప్రిన్సిపాల్‌తో నేను మాట్లాడాను అంటూ శ్రీ చైతన్య పాఠశాల వ్యవహారంపై విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శైలజ విద్యార్థి సంఘ నాయకులతో ఫోన్ మాట్లాడిన మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ఇచ్చే కాసులకు కక్కుర్తిపడి విద్యావ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్న విద్యాశాఖ అధికారుల తీరును ఆడియోరూపంలో విన్న ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బీబిగూడెం సమీపంలో శ్రీ చైతన్య యాజమాన్యం ఈ విద్యాసంవత్సరం నూతనంగా సిబిఎస్‌సి పాఠశాలను ప్రారంభించింది. పాఠశాలనిర్వహణకు సంబంధించి విద్యాశాఖ నుండి ఏలాంటి అనుమతులు లేవు. పాఠశాల భవనం కూడా పూర్తి కాకముందే అడ్మిషన్లు తీసుకోని తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల నుండి కూడా ఫీజులు లక్షల్లో వసూళ్లు చేస్తున్నారు.దీంతో ఇటీవల విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాల ఎదుట ఆందోళకు దిగారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్దంగా పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, నోటు బుక్స్, టై, బెల్టు, దుస్తులు విక్రయిస్తుండగా సంఘ నాయకులు పట్టుకున్నారు. ఈ విషయమై జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించగా స్పందించకపోవడంతో అడిస్టెంట్ డైరెక్టర్ శైలజకు ఫోన్ చేశారు. విద్యార్థి సంఘ నాయకులతో తాను తనిఖీకి వస్తున్నట్లు చెప్పారు. విద్యాశాఖ అధికారులు వస్తారని నాయకులు గంటల తరబడి అక్కడే ఆందోళన కొనసాగిస్తు ఉండిపోయారు. కానీవారు ఎంతకి రాకపోవడంతో తిరిగి ఆమెకు ఫోన్ చేశారు. రెండోసారి విద్యార్థి సంఘ నాయకులు ఫోన్ చేయగా స్పందిచిన ఆమె ఏదో తప్పు జరిగింది... సమన్వయంతో సరి చేసుకుండి. అంతా ప్రిన్సిపాల్‌తోనే నేను మాట్లాడాను. సంఘ నాయకులు అందరు గుంపులు గుంపులుగా కాకుండా ఒక్కోక్కరుగా వెళ్లండి అంటూ చెప్పడం జరిగింది. ఈ సంభాషణ ఆడియోను విద్యార్థి సంఘ నాయకులు సోషల్ మీడియాలో వైరల్ చేశారు. దీనిపై కలెక్టర్ స్పందించి ప్రైవేట్ విద్యాసంస్థలకు అక్రమాలకు వత్తాసుపలుకుతున్న శైలజపై చర్యలు తీసుకుంటారా వేచి చూడాల్సిందే.

# వరంగల్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** చారిత్రాత్మక వరంగల్ నగర అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ, వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వరద ముప్పు నుంచి వరంగల్ నగరాన్ని విముక్తి కలిగిస్తామని, వీలైనంత త్వరగా 2050 మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తామన్నారు. సెప్టెంబర్ 9న కాళోజీ జన్మదిన సందర్భంగా కాళోజీ కళాక్షేత్రాన్ని ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని, అప్పటివరకు పెండింగ్ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. వరంగల్ నగర అభివృద్ధిపై హైదరాబాద్, సచివాలయంలో గురువారం తన కార్యాలయంలో వరంగల్ జిల్లాకు చెందిన మంత్రులు కొండా సురేఖ,దనసరి అనసూయ సీతక్క, ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డి లతో కలిసిసమీక్ష నిర్వహించారు. ప్రధానంగా ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధి, ఐఆర్ఆర్ భూసేకరణ, ఓఆర్ ఆర్ అలైన్ మెంట్, వరంగల్ మాస్టర్ ప్లాన్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, కుడా మాస్టర్ ప్లాన్, కాళోజీ కళాక్షేత్రం, జిడబ్ల్యుఎంసి పరిధిలో రిటైనింగ్ వాల్ ల నిర్మాణం, వరద నివారణ చర్యలు, ఇంకుడు గుంతల నిర్మాణం, కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనులు, నర్సంపేట్ మెడికల్ కాలేజీ తదితర అంశాలపై చర్చించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ 2050 వరకు జనాభా పెరుగుదలకు అనుగుణంగా, వరంగల్ నగరఅవసరాలకుసరిపోయేలామాస్టర్‌ప్లాన్‌ను తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మాస్టర్ ప్లాన్ లో ఫార్మా సిటి, ఐటిధ సర్వీసెస్, మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్స్, ఎకో టూరిజం, ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్, స్టేడియం, ఎయిర్‌పోర్టు, లాజిస్టిక్స్ పార్కు, టూరిజం, ఖమ్మంవరంగల్ రహదారిలో, కరీంనగర్‌వరంగల్ రహదారిలో డంపింగ్ యార్డుల ఏర్పాటు తదితర అంశాలు ప్రధానంగా ఉండేలా మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించాలని ఆదేశించారు. ఇటీవల సిఎం రేవంత్ రెడ్డి తన వరంగల్ జిల్లా పర్యటనఇచ్చినహామీలఅమలు, ప్రభుత్వ ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకుని వరంగల్ నగరాభివృద్ధి పనులను యుద్ధ ప్రతిపాదికన చేపట్టాలన్నారు. హైదరాబాద్‌నగరానికి ధీటుగా వరంగల్‌నుఅభివృద్ధిపరిచేలా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు.వరంగల్‌నగరం వర ద ముప్పునకు గురి కాకుం డా, వరద నీరు సాఫీగా వెళ్లడానికి నాలాలను విస్తరించాలని, ఇందుకోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డిఆర్ఎఫ్) బలోపేతం చేయాలని, ఇందుకు అవసరమైన సిబ్బందిని రెవెన్యూ శాఖ నుండి సమకూరుస్తామన్నారు.

**గడువులోగా పూర్తి చేయకపోతే చర్యలు**

ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రతి ప్రాజెక్టుకు సంబంధించిన డిపిఆర్‌లను త్వరితగతిన రూపొందించాలని అధికారులకుమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. గడువులోగా పనులు పూర్తి చేయకపోతేఅధికారులపై చర్యలుతీసుకుంటామన్నారు.వరంగల్ నగరంలో నిర్మించే రింగ్‌రోడ్డు జాతీయ రహదారులకు కనెక్టివిటీ ఉండేలా చూడాలని, ఈ ప్రాజెక్టుకు భూసేకరణను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలన్నారు. నర్సంపేటలోని మెడికల్ కాలేజీ కార్యకలాపాలు ఈ ఏడాది నుంచి ప్రారంభించేందుకు ఉన్న సాధ్యసాధ్యాలను పరిశీలించాలని ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా చొంగ్తును ఆదేశించారు. కాజీపేట్ అయోధ్యాపురం ఆర్ఒబి నిర్మాణ పనుల ఆలస్యంపైన మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నాలాలు, చెరువులు ఆక్రమణకు గురి కావడంతో తరచూ వరంగల్ నగరం వరద ముప్పుకు గురవుతుందన్నారు. ఈ నాలాలు అక్రమణకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని, ఆక్రమించుకుని అక్కడ నివాసం ఉంటున్న వారిని తక్షణమే మరో ప్రాంతానికి తరలించాలని, ఈ సమయంలో మానవతాదృక్పథంతోవ్యవహరించిపేదప్రజలకు ఇబ్బంది కలగకుండా వారికి ఇండ్లు, స్థలాలను ఇవ్వాలని తెలిపారు. వరంగల్ జిల్లా ప్రజా ప్రతినిధులు ఎంపి కడియం కావ్య, ఎంఎల్ఏలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి, దొంతి మాధవరెడ్డి, కె.నాగరాజు, ఎంఎల్‌సిలు బండ ప్రకాష్, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, బస్వరాజు సారయ్య, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, మున్సిపల్ శాఖ కార్యదర్శి దాన కిశోర్, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా చొంగ్తు, రోడ్లు,భవనాల శాఖ కార్యదర్శి హరిచందన , సిడిఎంఎ విపి గౌతమ్ పాల్గొన్నారు. వరంగల్, హన్మకొండ జిల్లాల కలెక్టర్ లు డాక్టర్ సత్య శారదా, పి. ప్రావీణ్య, వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ అశ్వినీ తానాజీ వాఖేడే ఉన్నారు.

## 7న సిపిఐ సమితి సమావేశం

సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి



**ప్రజాపక్షం/భీమదేవరపల్లి:**హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ములుకనూరులో ఈనెల 7న సిపిఐ జిల్లా సమితి నిర్మాణ సమావేశం నిర్వహిస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి తెలిపారు. గురువారం ములుకనూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపెల్లి శ్రీనివాసరావు హజరవుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో భారత కమ్యూనిస్టు పార్టీ అనుబంధ సంఘాలు అన్ని గ్రామాల్లో బలోపేతం చేయనున్నట్లు వెల్లడించారు. రానున్న స్థానిక సంస్థలు, నగరపాలక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి ప్రణాళికలు రూపొందించి సిపిఐ సత్తా చాటుతామన్నారు. నిరంతరం ప్రజల మధ్య ప్రజల సమస్యల పరిష్కారం కోసం అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తూ పార్టీ నిర్మాణం చేస్తామన్నారు. కౌన్సిల్ సమావేశంలో చర్చించి భవిష్యత్ నిర్ణయాలను ప్రకటిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు కర్రె లక్ష్మణ్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొంగల రాంచంద్రారెడ్డి, జిల్లా సిపిఐ మహిళ కార్యదర్శి మంచాల రమాదేవి, జిల్లా కౌన్సిల్ సభ్యులు కొట్టెపాక రవి, మంచాల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్య



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులు అందరూ దారిద్ర్య రేఖకు దిగువనున్న వారే ఉంటారని ఓపికతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ ములుగు మండలంలోని జగ్గన్నపేట గ్రామ పంచాయతీ పరిధిలోని సారంగపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు కొద్ది సేపు ముచ్చటించారు. పుస్తకాలు, స్కూల్ యూనిఫాం ఇచ్చారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులను, పాఠశాల ఆవరణ పరిశీలిస్తూ సమర్థ నిర్వహణకు ప్రధానోపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పాఠశాల ఆవరణలో పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పాఠశాలలో మౌళిక వసతులు కల్పనతో పాటు పాఠశాలను ఆహ్లాదకరంగా తీర్చి దిద్దుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సర్వన్‌కుమార్, ములుగు తహసీల్దారు విజయ భాస్కర్, ఆర్ఐ విజయేందర్, తదితరులు పాల్గొన్నారు.

## అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలి



**ప్రజాపక్షం/ములుగుప్రతినిధి:** ములుగు జిల్లాలోని కన్నాయిగూడెం మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరిచేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి శ్రీజ అన్నారు. గురువారం జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి శ్రీజ, నీతి అయోగ్ ప్రొఫెషనల్ అధికారిణి గాయత్రితో కలిసి కన్నాయిగూడెం ఆస్పిరేషనల్ బ్లాక్ మండలంలో సంపూర్ణ అభియాన్ కార్యక్రమాన్నిప్రారంభించారు. జిల్లా అదనపుకలెక్టర్ మాట్లాడుతూములుగు జిల్లాలో కన్నాయిగూడెం మండలం ఆస్పిరేషనల్ బ్లాక్ మండలంగా ఎంపికైందని, సంపూర్ణ అభియాన్ కార్యక్రమాన్ని జులై 4నుండి సెప్టెంబర్ 30 వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా సంపూర్ణత అభియాన్‌లో భాగంగా సూచించిన ఆరు సూచికలను ప్రామాణికంగా తీసుకొని పూర్తిగా మండలంలో అమలు చేయాలని, ఆస్పిరేషనల్ బ్లాక్ మండలంగా తీర్చిదిద్దడానికి నీతి అయోగ్ సూచించిన 6 సూచికలను మూడు నెలల ప్రణాళికలో 100 శాతం అమలు పరిచడానికి సంపూర్ణత అభియాన్ మంచి కార్యక్రమం అని పేర్కొన్నారు. స్థానిక ఆశ్రమ బాలుల పాఠశాలలో ఈ సంపూర్ణ అభియాన్ గురించి వ్యాసరచన పోటీలు, పోస్టర్ కాంపిటీషన్, క్విజ్ పోటీలు నిర్వహించి ప్రతిభ చూపించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ శ్రీనివాస్‌కుమార్, డిఎంహెచ్ఓ అప్పయ్య, డిడబ్ల్యుఓ స్వర్ణలత లెనిన పాల్గొన్నారు.

## అప్రమత్తంగా ఉండాలి..




**ప్రజాపక్షం/ఏటూరు నాగారం:** లోతట్టు ప్రాంత ప్రజలు వర్షాలు కురవడం తో వరదలు వాగులు వంకలు పొంగిపొర్లుతుండడంతో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సమీప గ్రామాల ప్రజలు జాలర్లు ఎవరు కూడా చాపల వేటకు వెళ్లకూడదని ఏటూరు నాగారం ఎస్సై ఎస్కే తాజుద్దీన్ అన్నారు. మండల కేంద్రంలోని జంపన వాగు .గోదావరి వరద తీర ప్రాంతాలను గురువారం సందర్శించారు. చాపల వేటకు వెళ్లిన వారితో సమావేశం ఏర్పాటు చేసి వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోరుగా వానలు కురుస్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తడిసిన కరెంట్ పోల్స్, తడిసిన గోడలు ముట్టుకోవద్దని అన్నారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉందినీ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సివిల్, సిఆర్పిఎఫ్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన



**ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి:** ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తన క్యాంపు కార్యాలయంలో ఉద్యాన శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయిల్ ఫామ్ సాగుపై గ్రామ స్థాయిలో ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయుటకు ఎమ్మెల్యే సూచించారు. ఉద్యాన శాఖ ద్వారా వచ్చే సబ్సిడీలను ప్రజలకు వివరించి రైతుల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. గోద్రేజ్ కంపెనీ ద్వారా రైతులకు ఉచితంగా మొక్కలు సరపరా ఫామ్ అయిల్ సాగుకు ప్రభుత్వం సూచించిన దరకే గోద్రేజ్ కమంపెనీ కొనుగోలు చేస్తుందన్నారు. నాటు వేసిన నుంచి కోత వచ్చే వరకు గోద్రేజ్ కంపెనీ ఉద్యాన శాఖ అధికారులు రైతులకు ఎప్పకటికప్పుడు అప్రమత్తం చేసి సూచనలు సలహాలు చేస్తారని అన్నారు. కార్యక్రమంలో డిడి హార్టీకల్చర్ సోమేశ్వరరావు ,హార్టికల్చర్ ఆపీసర్ సమత పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలతో యువత జీవితం చిత్తు



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** గంజాయి సేవించి జీవితాలను నాశనం చేసుకోవద్దని, మాదక ద్రవ్యాలతో యువత జీవితం చిత్తవుతుందని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. గురువారం భూపాలపల్లి సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో మత్తు పదార్థాల అవగాహన, గంజాయి సేవిస్తూ పట్టుబడిన వారికి భూపాలపల్లి పోలిసు స్టేషన్ ఆవరణలో ఎస్పీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ, జిల్లాలో గంజాయి నియంత్రణకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, గంజాయి వినియోగదారులు, రవాణా దారులపై నిఘా పెట్టామని అన్నారు. గంజాయి రవాణా చేసే ముఠాలపై కఠిన చర్యలు తప్పవని, గంజాయి నియంత్రణకు జిల్లా టాస్క్ ఫోర్స్ టీం ఏర్పాటు చేశామని, జిల్లాకు సరిహద్దు రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఛత్తీస్ ఘడ్ లోని గడ్చిరోలి, చంద్రపూర్, బీజాపూర్ నుంచి గంజాయి రవాణా అయ్యే అవకాశం ఉందని, జిల్లా టాస్ఫోర్స్ టీంలు గంజాయి రవాణా దారులకు చెక్ పెడతాయని పేర్కొన్నారు. పదే పదే నేరాలకు పాల్పడుతూ, గంజాయి రవాణా చేస్తూ పట్టుబడితే పిడి యాక్ట్ నమోదు చేస్తామని ఎస్పి కిరణ్ హెచ్చరించారు. యువత డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసలై వారి భవిష్యత్తుని నాశనం చేసుకోవద్దనే ఉద్దేశంతో ఈ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు.జిల్లాలోఉన్న గంజాయి రవాణా,సేవించేవారు, తప్పనిసరిగా తమ కుటుంబం కోసం మారాలని, మత్తు పదార్థాలకు బానిసలై ఆరోగ్య సమస్యలు తలెత్తడమే కాకుండా నేరాలు చేసే అవకాశం ఉందన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల బారిన పడిన యువకులు మంచి మార్గంలో నడుచుకోవడానికి కౌన్సెలింగ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. చెడు వ్యసనాలను దూరం చేసుకొని మంచి ప్రవర్తనతో మెలగాలని,లేనిపక్షంలో కఠినంగా వ్యవహరిస్తామన్నారు. గంజాయి అక్రమరవాణాకు పాల్పడడం, మత్తుపదార్థాల వినియోగించే వారిని ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## తెలంగాణలో వ్యాపారాలు ప్రారంభించాలి



**ప్రజాపక్షం/హన్మకొండటౌన్ :** విదేశాలలో స్థిరపడిన వారంతా ముందుకు వచ్చి తెలంగాణలో వ్యాపారాలను ప్రారంభించాలని రాష్ట్ర ఐటి,పరిశ్రమలు,శాసన సభా వ్యవహారాల శాఖా మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. గురువారం హన్మకొండలో రంజిత్ రావుల ఏర్పాటు చేసిన రాక్ ఐటి సొల్యూషన్‌ను ప్రారంభించిన అనంతరం మంత్రి మాట్లాడారు.రంజిత్ తన సొంత జిల్లా అన్న ఆలోచనతో ఇక్కడ స్థానికులకు సహయం చేయాలనే లక్ష్యంతో ఈ సంస్థను ఏర్పాటు చేయడం హంతోషకరమైన విషయం అనిఅన్నారు. ప్రతి ఒక్కరూ హైదరాబాద్ లోనే వ్యాపారం చేస్తూ స్థిరపడాలనే ఉద్దేశ్యంతో కాకుండా విద్యకు కేం ద్రంగా ఉన్న వరంగల్‌లో కూడా అన్ని రకాల వనరులు అందుబాటులో ఉన్నందున అన్ని రకాల పరిశ్రమలను, సాఫ్ట్‌వేర్ కంపెనీలు ప్రారంభించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలను, సాఫ్ట్‌వేర్ కంపెనీలను ప్రారంభించిన వారికి మౌళిక సదుపయాలు కల్పిస్తూ అండగా ఉంటుందన్నారు.వరంగల్‌లో విమానాశ్రయం విషయం పెండింగ్‌లో ఉందని, పరిష్కరించాలని కేంద్రాన్ని కోరినట్లుచెప్పారు.వరంగల్, హన్మకొండలలో సాఫ్ట్‌వేర్ కంపెనీలే కాకుండ అన్ని రకాల సంస్థలను ఏర్పాటు చేసేందుకు సీఎం కృషి చేస్తున్నారన్నారు. రానున్న రోజులలో హైదరాబాద్ తరువాత వరంగల్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు.వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, రాక్స్ ఐటి సొల్యూషన్స్ వ్యవస్థాపకులు రంజిత్ రావుల, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

**ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్యాలయం తనిఖీ**

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వరంగల్ పర్యటనలో భాగంగా గురువారం ములుగురోడ్‌లోని తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రియల్‌ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కార్యాలయం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ అధికారులతో మట్లాడారు. కార్యాలయంలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సరిగా లేకపోవడంపై అసహనం వ్యక్తంచేశారు.ఈ కార్యాలయంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## ఉత్తమ సేవలతోనే రాజకీయ అవకాశాలు



**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి:** ఉత్తమ సేవలతోనే రాజకీయ అవకాశాలుంటాయని వరంగల్ జిల్లా పరిషత చైర్మన్ గండ్ర జ్యోతి అన్నారు. జిల్లా పరిషత్ సభ్యుల పదవీ కాలం ముగియడంతో గురువారం జిల్లా పరిషత్ సభ్యులకు ఆత్మీయవీడ్కోలు సమావేశం నిర్వహించారు. చైర్మన్, సభ్యులను ఘనంగా సన్మానించారు. అనంతరం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జడ్‌పిసిఈవో రామ్‌రెడ్డి అధ్యక్ష తన వీడ్కోలు సమావేశంలో గండ్ర జ్యోతి మాట్లాడుతూ వరంగల్ జిల్లా పరిషత్ ఐదు సంవత్సరాల పాలన కాలంలో సంతృప్తిగా సాగటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. జడ్పీ చైర్మన్ ఉన్న సహకరించిన ప్రతిసభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలలోకి తీసుకెళ్లడంలో అధికారులు ప్రజాప్రతినిధుల పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. జడ్పీ వైస్ చైర్మన్ శ్రీనివాస్, జడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉషాదయల్, డిఈఓ వాసంతి, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## రవాణా వ్యవస్థ బలోపేతానికి వినతి

**ప్రజాపక్షం/నర్సాపూర్:** నర్సాపూర్ నియోజకవర్గ ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని కాంగ్రెస్ నాయకులు గురువారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆంజనేయులు గౌడ్ ఆవుల రాజిరెడ్డి తదితరులు హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిశారు. వారు మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం అమలుతో పెరిగిన రద్దీకి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో పలు గ్రామాలకు కొత్త బస్సు సౌకర్యం కల్పించాలన్నారు.త్వరలో నూతనంగా ప్రవేశపెట్టే ఎలక్ట్రికల్ బస్సులు నర్సాపూర్ డిపోకు కేటాయించాలని,దేవాలయాలకు వెళ్లేలా బస్సు సౌకర్యాలు కల్పించాలని మంత్రిని కోరినట్లు వారు తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌సానుకూలంగా స్పందించారన్నారు. నాయకులు సుధాకర్ గౌడ్, మహేష్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

## సాయుధ పోరాట స్ఫూర్తితో ఉద్యమాలు

సిపిఐ ఆధ్వర్యంలో
దొడ్డి కొమురయ్యకు నివాళులు




**ప్రజాపక్షం/జనగామప్రతినిధి:**తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో ఉద్యమాలు నిర్వహించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎంఎల్ఏ సిహెచ్ రాజారెడ్డి పిలుపునిచ్చారు. సిపిఐ ఆధ్వర్యంలో దేవరుప్పుల మండలం, కడవెండి గ్రామంలోని దొడ్డి కొమురయ్య స్థూపం వద్ద నివాళ్లు అర్పించారు. సిపిఎం ఎండాను ఎగరవేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలోనూ దొడ్డి కొమురయ్య విగ్రహానికి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ దొరల అణచివేత,ఆగడాలనుఅరికట్టడంకోసంగ్రామ గ్రామాన సంఘాలుగా ఏర్పడి నైజాం మూఖల్ని ఎదర్కొవడం జరిగిందన్నారు. విస్నూరు రామచంద్రా రెడ్డి ఆగడాలకు అవదులు లేని రోజుల్లో ప్రజలంతా ఏకమై పోరాటం చేశాడన్నారు. ఆ పోరాటంలో దొడ్డి కొమురయ్య తొలి అమరుడగా చరిత్రకెక్కాడన్నారు. భూమి, భుక్తి, విముక్తి కోసం ఆనాడు పోరాటం జరిగగా వేలాది ఎకరాల భూములు పంచి పది లక్షల మందికి విముక్తి కలిగించడం జరిగిందన్నారు. ఆ పోరాటం మరువలేనిదని, ప్రపంచ దేశాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. పాలకులు వారి కలల్ని నిజం చేయడం లేదని, భూ పంపిణీ జరగకపోగా దాదులు, దౌర్జన్యాలు పెరుగుతూనే ఉన్నాయన్నారు. రెక్కాడితే గాని డొక్క నిండని పేదల బతుకులు మారాలంటే పాలకులు సంక్షేమ పథకాలు పేదల జరిచేరనివ్వాలన్నారు. భూ పంపిణీతో పాటు ఇళ్లు మంజూరు చేయాలని, నాణ్యమైన విద్యా, వైద్యం అందించాలన్నారు. ఇప్పటికైనా స్పందించాలన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న, రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, జిల్లా నాయకులు మంగళంపల్లి జనార్ధన్, జనగామ పట్టణ కార్యదర్శి చొప్పరి సోమయ్య, దేవరుప్పుల మండల కార్యదర్శి బెజ్జిగం ఎల్లయ్య, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా సిపిఎం ఆధ్వర్యంలో దొడ్డి కొముయ్య వర్ధంతి ఘనంగా జరిగింది. కడవెండిలో కొమురయ్య స్థూపం వద్ద నివాళ్లు అర్పించారు. అనంతరం జిల్లా పార్టీ కార్యాలయంలో దొడ్డి కొమురయ్య విగ్రహానికి నివాళ్లు అర్పించారు. జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి మాట్లాడారు.సింగారపు రమేష్ అధ్యక్షత వహించగా జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఇర్రి ఆహలయ్య, జిల్లా కమిటి సభ్యులు బూడిద గోపి, జోగు ప్రకాష్, సుంచు విజేందర్, రమావత్ మీట్యానాయక్, సుధాకర్, యాకయ్య, రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు

## రియల్ వ్యాపారుల ఆట కట్టించండి



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** ములుగు జిల్లా కేంద్రంలో ప్రేమ్ నగర్, జంగాలపల్లి, వెంకటాపూర్ మండల కేంద్రంలో స్థిరాస్తి వ్యాపారులు నిర్మిస్తున్న ప్రహరీ గోడలను సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ గురువారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ స్థిరాస్తి వ్యాపారాల పేరుతో కొంత మంది వ్యాపారులు భూములు కొనుగోలు చేసి ఆ భూముల చుట్టు ప్రహరీ గోడలు నిర్మిస్తున్నారన్నారు. వాటి మూలాన చుట్టు ప్రక్కల ఉండే రైతులకు దారులు లేకుండా చాలా దూర ప్రాంతం నుండి వెళ్ళాల్సిన పరిస్థితులు ఉన్నవని అన్నారు. కనుక అధికారులు స్పందించి వ్యాపారులు నిర్మిస్తున్న ప్రహరీ గోడలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. వారు చేసుకునే వ్యాపారాలను సిపిఐ ఏమాత్రం వ్యతిరేకించడం లేదని, కానీ భూమి పుట్టిన కాడి నుండి అదే భూముల నుండి వెళుతున్న రైతులకు అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఊరుకోమన్నారు. అది కాకుండా కాలువలు కూడా లేకుండా చేస్తున్నారన్నారు. కాలువలు కూడా కనుమరుగైతే రైతులకు నీరు ఎలా వస్తుందన్నారు. కనుక రెవెన్యూ అధికారులు, అలాగే జిల్లా పంచాయతీ అధికారులు, వెంటనే ఈ విషయంపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా నాయకులు ఇంజం కొమురయ్య, ముత్యాల రాజు, బోడ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## రూ.25 లక్షలతో అభివృద్ధి పనులు



**ప్రజాపక్షం/మహబూబాద్ ప్రతినిధి:** మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 36వ వార్డు 22వ వార్డు లోని బిఎన్ గుప్తా కాలనీ దగ్గర మరియు కంకర బోర్డ్ దగ్గర అదేవిధంగా 25వ వార్డు పరిధిలోని ధర్మన్న కాలనీలో 25 లక్షల రూపాయలతో సిసి రోడ్లు సిసి డ్రైనేజీ పనులకు నేడు ఎమ్మెల్యే శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ శంకుస్థాపన కార్యక్రమానికి సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అదే సారధి 36వ వార్డు కౌన్సిలర్ రెడ్డి ధర్మన్న అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళి నాయక్ మాట్లాడుతూ నిధులు ఇవ్వలేదని అన్నారు. మణిపూట అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని మానుకోట అభివృద్ధిలో తన వంతు కృషి చేస్తామన్నారు. 22 36 వార్డుల్లో అభివృద్ధి బాగా జరిగిందని ఈ ప్రాంత కౌన్సిలర్లు అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. టిఆర్ ఎస్ ప్రభుత్వం మానుకోటకు చేసింది శూన్యమని అన్నారు. 36 22 వార్డుల అభివృద్ధికి ఎప్పుడూ తన వంతు సహకారం అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ రామ్మోహన్ రెడ్డి కమిషనర్ నోముల రవీందర్ సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయసారథి, సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారథి రెడ్డి 36వ వార్డు కౌన్సిలర్ బి.నీరజారెడ్డి ధర్మన్న, డిఈ ఉపేందర్ ఏఈ సురేష్, వైస్ చైర్మన్ వెంకన్న, వార్డు ప్రజలు కుమార్, వెంకన్న సాంబ లక్ష్మి మేక వీరన్న, రవి, బోసు రమేష్, పాల్ నాగేశ్వరరావు కుమార్, ఉమాకర్ శ్రీనివాస్, కాసిం చరణ్, నవీన్, శ్రవణ్, ప్రవీణ్, రవీందర్, అశోక్, వెంకట్ రెడ్డి, వేణు, గునారి, సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి, పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. 22వ వార్డు పరిధిలోని పోతి రెడ్డి కుంట అభివృద్ధి చేయాలని వివిధ అభివృద్ధి పనులకు నిధులు కేటాయించేందుకు కృషి చేయాలని అన్నారు. టిఆర్ఎస్ పాలనలో జీవోలు ఇచ్చి నిధులకు ఎగనామం పెట్టారన్నారు.

## నిధులు విడుదలకు వినతి




**ప్రజాపక్షం/జయశంకర్‌భూపాలపల్లి ప్రతినిధి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో దళిత హక్కుల పోరాట సమితి డిహెచ్ పిఎస్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం ఇవ్వడం అందజేశారు. డిహెచ్ పిఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మరాఠీ కాంతారావు, రాసపల్లి భద్రయ్యలు మాట్లాడుతూ, దళితుల అభివృద్ధి కోసం గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళిత బంధు పథకాన్ని కొనసాగించాలని అర్హులైన వారందరికీ దళిత బంధు ఇవ్వాలన్నారు. అర్హులైన వారందరికీ వెంటనే రేషన్ కార్డులు మంజూరు చేయాలని, గత పది సంవత్సరాల నుండి కొత్త రేషన్ కార్డులు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దళితవాడల్లో ఎస్సీ సబ్ ప్లాన్ కింద మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న దళితులందరికీ పట్టాలు ఇవ్వాలని, దళితులు సాగు చేసుకుంటున్న వ్యవసాయ భూములకు సీలింగ్ యాక్ట్ తొలగించాలని, ఎస్సీ కార్పొరేషన్ నిధులు విడుదల చేయాలని కోరారు. కొత్తగా కార్పొరేషన్ నుండి రుణాలు మంజూరు చేయడానికి నోటిఫికేషన్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డిహెచ్‌పిఎస్ జిల్లా నాయకులు నేరెళ్ల జోసఫ్, పొనగంటి లావణ్య, పీక రవికాంత్, బొద్ద కమలాకర్, పెద్దమామల సంధ్య పాల్గొన్నారు.

## సింగరేణి ప్రైవేటీకరణ పాపం బిజెపి, బిఆర్ఎస్‌లదే : రాజ్‌కుమార్



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లిప్రతినిధి :** బొగ్గు గనుల ప్రైవేటీకరణ ఎంఎంఆర్‌డి చట్టం చేసి బొగ్గు బ్లాకుల వేలం వేయదానికి బిజెపి, బిఅరెఎసే కారణమని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ ఆరోపించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎఐటియుసి కొమరయ్య భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజ్‌కుమార్ మాట్లాడుతూ సింగరేణి బొగ్గు బ్లాకుల వేలంపై రాజకీయ పార్టీలు ఒకరి మీద ఒకరు నిందలు వేస్తూ పబ్బం గడుపుతున్నారన్నారు. పార్లమెంటులో మైనింగ్ యాక్ట్ ప్రవేశపెడితే బిఆర్ఎస్ ప్రభుత్వం దానికి మద్దతు తెలిపి ఆబిల్లును పాస్ చేయించిందని, ఎలాంటి అర్హతలు లేని అరబిందో, అవంతిక కంపెనీలకు గనులను లీజుకు కట్టబెట్టిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వందని మండిపడ్డారు. అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణి సంస్థను వేలం పాటలో పాల్గొనకుండా చేసి దొడ్డదారిన అగ్రిమెంట్ చేసుకుని తన అనుచరులకు టెండర్లను కట్టబెట్టిందని విమర్శించారు. మూడోసారి బిజెపి అధికారంలోకి రాగానే తెలంగాణ నుండి బొగ్గు గనులశాఖ మంత్రిగా ఎన్నికైన కిషన్‌రెడ్డి గనుల వేలాన్ని హైదరాబాదులోనే వేలం పాటలో పెట్టాడని మండిపడ్డారు. సింగరేణి సంస్థను కాపాడే విధంగా ఆందోళన పోరాటాలను ఉధృతం చేస్తామని రాజ్‌కుమార్ హెచ్చరించారు. సింగరేణి వేలం పాటను వేయడాన్ని నిరసిస్తూ దశలవారీగా పోరాటాలకు ఎఐటియుసి పిలుపునిచ్చిందని, శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, పార్టీలకతీతంగా పాల్గొని విజయవంతం చేయాలని రాజ్ కుమార్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, నూకల చంద్రమౌళి, సప్ప కృష్ణమూర్తి, మల్లికార్జున్, తిరుపతి, ఐలయ్య, హైమద్ ఖాన్, రాజు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

## బొగ్గు గనుల వేలం నిలిపివేయాలి

### సిపిఐ అసిఫాబాద్ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ ప్రతినిధి :** బొగ్గు గనులను వేలం లేకుండా బేషరతుగా సింగరేణికి అప్పగించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో నెల 5 నుంచి 12 వరకు సింగరేణి వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సిపిఐ కొమురం భీం జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం బొగ్గు గనులను ప్రభుత్వ రంగ సంస్థలకు ఇవ్వకుండా వేలం ద్వారా ప్రైవేటు వారికి ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుందని ఆరోపించారు. తెలంగాణలో ఉన్న నూతన బొగ్గు గనులను వేలం వేయకుండా సింగరేణికి ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎఐటియూసి విన్నవించినా కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి వల్ల బొగ్గు గనులను వేలం వేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో గోలేటి బ్రాంచ్ కార్యదర్శి సోమరం తిరుపతి, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి రాయిల్లా నర్సయ్య, రమేష్, సురేష్, పార్టీ నాయకులు మోర్ల శ్యామ్ రావు, తోట రాంచందర్, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

## మన బావులు మనకు దక్కేదాకా పోరాటాలు : సీతారామయ్య



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** తెలంగాణలో ఉన్న మన బావులు (బొగ్గు గనులు) మనకు దక్కేవరకు సింగరేణిలో పోరాటాలు చేస్తామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య పేర్కొన్నారు. గురువారం గోదావరిఖని జిడికె 2వ ఇంక్లైన్ లో జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం కోట్ల రూపాయలు ఖర్చు చేసి గుర్తించిన నూతన బొగ్గు గనులను కేంద్ర ప్రభుత్వం సింగరేణి కి ఇవ్వకుండా వేలం ద్వారా ప్రైవేటు వారికి ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని, దీనిని వ్యతిరేకిస్తూ సిపిఐ, ఎఐటియుసి రాష్ట్ర కమిటీలు జూలై 5 నుంచి 17 వరకు తెలంగాణ వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చాయన్నారు. కేంద్రంలోని బిజేపి ప్రభుత్వం మూడో సారి అధికారంలోకి వచ్చిన వెంటనే దేశంలో ఉన్న బొగ్గు గనులను కోల్ ఇండియా, సింగరేణి కి ఇవ్వకుండా వేలం ద్వారా ప్రైవేటు వారికి ఇచ్చేందుకు చర్యలు ప్రారంభించిందని ఆయన ఆరోపించారు. తెలంగాణలో ఉన్న నూతన బొగ్గు గనులను వేలం వేయకుండా ఇతర రాష్ట్రాలకు ఇచ్చిన విధంగా నామినేషన్ పద్ధతిలో సింగరేణి కి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో మడ్డి ఎల్లాగౌడ్, కవ్వంపల్లి స్వామి, బ్రాంచి సహాయ కార్యదర్శి రంగు శ్రీనివాస్ పాల్గొన్నారు.

# 'నీట్'పై న్యాయం జరిగే వరకూ పోరాటం

## వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల విద్యాసంస్థల బంద్ విజయవంతం

**ప్రజాపక్షం/ న్యూస్ నెట్‌వర్క్ :** లీకేజీ జరిగిన నీట్ పరీక్ష రద్దు చేసి తిరిగి పరీక్ష నిర్వహించాలని, 24 లక్షల విద్యార్థుల భవిష్యత్తుపై ప్రధాని మోదీ స్పందించకపోవడం సరికాదని, సుప్రీంకోర్టు జడితో విచారణ జరిపించి నష్టపోయిన విద్యార్థులకు కేంద్రం అండగా ఉండాలని వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యచరణ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష తిరిగి నిర్వహించాలని, పేపర్ లీకులకు కారణమైన ఎన్‌టిఎ సంస్థను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం దేశవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ సందర్భంగా రాష్టవ్యాప్తంగా వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల బంద్ విజయవంతం అయింది. కరీంనగర్‌లో జరిగిన విద్యాసంస్థల బంద్ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోనగిరి మహేందర్, యుగేంధర్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్ పాల్గొన్నారు. వరంగల్ జిల్లాలో ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు అశోక్ స్టాలిన్, చుక్క ప్రశాంత్, నరేష్, ల్యాదల శరత్, అర్జున్, సుధీర్, పెద్దపల్లి జిల్లాలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం, నర్సంపేటలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు దిడ్డి పార్థసారధి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో జరిగిన ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోతుకు ప్రవీణ్‌కుమార్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసెఫ్, ఖమ్మం జిల్లాలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, హన్మకొండ జిల్లాలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బాషబోయిన సంతోష్, యాదాద్రి జిల్లాలో ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్, నల్లగొండ జిల్లాలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బరిగెల వెంకటేష్, జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ తదితరులు



ఖమ్మం..


హన్మకొండ..


వరంగల్..


భూపాలపల్లి..


పెద్దపల్లి..


కరీంనగర్..


నల్లగొండ..

# పాఠ్యాంశంగా దొడ్డి కొమురయ్య జీవిత చరిత్ర

## సిపిఐ డిమాండ్

**ప్రజాపక్షం/న్యూస్ నెట్‌వర్క్ :** దొడ్డి కొమురయ్య 78 వర్ధంతిని రాష్ట్రవ్యాప్తంగా సిపిఐ శ్రేణులు నిర్వహించాయి. దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సిపిఐ జిల్లా కార్యాలయాల్లో జరిగిన కార్యక్రమాల్లో నాయకులు మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. నల్లగొండలో సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి, బొల్లగూరి నరసింహ, సూర్యాపేటలో సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, వేనేపల్లి వెంకటేశ్వర్ రావు, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు గోపగాని రవి, ఎఐవైఎఫ్ జిల్లాఅధ్యక్షులు బూర సైదులు, యాదాద్రి జిల్లాలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ, సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు, సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, హన్మకొండలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, మాజీ కార్యదర్శి సిరబోయిన కర్ణాకర్, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మారుపాక అనిల్, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేశ్, వరంగల్ జిల్లాలో సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవిసిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాషమియా, పనాస ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు గుండె భద్రి, బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఐత యాకుబ్, నిజామాబాద్ జిల్లాలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, ఖమ్మం జిల్లాలో సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌కె జానిమియా, శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు, తోట రామాంజనేయులు, కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లిలో జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషా, మహబూబ్ నగర్‌లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల నరసింహ తదితరులు పాల్గొని దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పించారు.


హన్మకొండ..


యాదగిరిగుట్ట..


ఖమ్మం..


లక్ష్మీ దేవిపల్లి


నిజామాబాద్...


వరంగల్..


వరంగల్..


నర్సంపేట..


నల్లగొండ...



సూర్యాపేట..


మహబూబ్‌నగర్..

# తవ్వేకొద్దీ బయటపడుతున్న చిత్రపురి అక్రమాలు

### రంగారెడ్డి డిస్ట్రిక్ట్ కో- ఆపరేటివ్ ఆఫీసర్ ధాత్రి దేవిపై.. ఐదు క్రిమినల్ కేసులు నమోదు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** చిత్రపురి కాలనీ హౌసింగ్ సొసైటీలో అక్రమాలపై బాధితుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తున్నాయి. ఒక్కొక్కరుగా ముందు కొచ్చి తమకు జరిగిన అన్యాయంపై పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఎంతో మంది కన్నీటికి కారణమైన చిత్రపురి అవినీతి కేసులో తవ్వేకొద్దీ అవినీతి అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో మొత్తం చిత్రపురికాలని సొసైటీ అక్రమాలపై 15 కేసులు నమోదు కాగా తాజాగా ఐదు ఫిర్యాదులు అందినట్లు ఇన్‌స్పెక్టర్ వెంకన్న వెల్లడించారు. ఐదుగురు సభ్యుల కమిటీ ఆదేశాలను పట్టించుకోకుండా సొసైటీ పాలక మండలి, జిల్లా సహకార శాఖ అధికారులు అర్హతలేని వారికి 336 ప్లాట్లు రిజిస్టర్ చేశారని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఎంతో పేరుగాంచిన చిత్రపురి కాలనీను అవినీతిపరుల అక్రమాలతో నిజమైన లబ్ధిదారులకు అందకుండా పోతున్నాయి.

### బిఆర్ఎస్ హయంలో పట్టించుకోని ఉన్నతాధికారులు..

గత బిఆర్ఎస్ ప్రభుత్వం హయంలో పాలకులు చూసిచుడనట్లు వ్యవహరించడంతో ప్రజల ఆస్తులను కాపాడాల్సిన అధికారులు అక్రమార్కులతో కుమ్మకై పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చిత్రపూరి కాలనీలో అనేక అక్రమాలు చోటు చేసుకుంటున్న నాటి ప్రభుత్వ హయంలో ఉన్నతాధికారులు స్పందించలేదు. అప్పుడే ఉన్నతాధికారులు స్పందించి ఉంటే తమకు ఇంత నష్టం జరిగేదికాదని బాధితులు వాపోతున్నారు. తాజాగా రంగారెడ్డి జిల్లా కో ఆపరేటివ్ ఆఫీసర్ ధాత్రి దేవిపైన నాన్ బెయిల్ సెక్షన్‌ల కింద 5 క్రిమినల్ కేసులు నమోద య్యాయి. మరో వైపు ప్రెసిడెంట్ అనిల్ కుమార్, వల్లభనేని కుమార్, సెక్రెటరీ దొర, కమిటీపైన కూడా కొత్తగా ఐదు కేసులు నమోదు అయ్యాయి. వీటితో పాటు మరో నాలుగు కేసులు కూడా నమోదయ్యే అవకాశం ఉందని తెలిసింది. రాజేంద్రనగర్ కోర్టు ద్వారా నిందితులపై కేసులు నమోదు అయ్యాయి. కమిషనర్, డిసిఓ, శేరిలింగంపల్లి సబ్ రిజిస్ట్రార్‌లు చిత్రపురి కమిటీతో కుమ్మకై అక్రమ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని కొంతమంది సభ్యులు ముందే అధికారులను హెచ్చరించినా, కోర్ట్ ఆర్డర్స్ ఇచ్చినా అప్పుడు పట్టించుకోకపోవడంతో బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికే 3 నుండి 4 కేసులు దాటినందున అక్రమాలకు పాల్పడిన వారిపై పిడి యాక్ట్ నమోదు చేయాలని బాధితులు రాయదుర్గం పోలీసులను కోరుతున్నారు. అవినీతికి పాల్పడిన మరింత మందిపై పోలీసులకు ఫిర్యాదు అందుతాయని బాధితులు చెప్పుతున్నారు.

### పోలీసులను ఆశ్రయించిన సీనియర్ దర్శకుడు కాట్రగడ్డ రవితేజ

సీనియర్ సిని దర్శకుడు కాట్రగడ్డ రవితేజ (74) పోలీసులను ఆశ్రయించిన వారిలో ఉన్నారు. తాను డబ్బులు చెల్లించినా ఫ్లాట్ కేటాయించకుండా ఇతరులకు అప్పగించారన్నారు. ఓ వ్యక్తి తాగునీటి పైపులైన్ కోసం రూ. 37.50 లక్షలు తీసుకుని పనిచేయలేదని, తిరిగి ఆ డబ్బులు సొసైటీకి చెల్లిస్తానన్నా అలా చేయలేదని ఆరోపిం చారు. జూనియర్ ఆర్టిస్ట్ టి. పద్మావతి(54), పైడిపాటి రాజేంద్రకుమార్ కుమారుడు రాహుల్, బాకి జానకి, ఎం. శ్రవణ్ కుమార్ కూడా ఫిర్యాదు చేశారు.

## హేమంత్ సోరెన్ ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)

కూడా హేమంత్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి విచ్చేశారు. కాగా.. భూ కుంభకోణానికి పాల్పడ్డారని ఆరోపణలతో హేమంత్ సోరెన్ జనవరిలో అరెస్ట్ అయ్యారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తనని అరెస్టు చేయడానికి కొన్ని నిమిషాల ముందు ఆయన సిఎం పదవికి రాజీనామా చేశారు. దీంతో.. ఆయన స్థానంలో జార్ఖండ్ సిఎంగా చంపాయి సోరెన్ బాధ్యతలు చేపట్టారు. ఆ కుంభకోణంలో హేమంత్‌ది ప్రత్యక్ష ప్రమేయం ఉన్నట్లు రికార్డులు లేకపోవడంతో హైకోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. ఇలా జైలు నుంచి బయటకొచ్చిన హేమంత్‌ను మళ్లీ సిఎంగా బాధ్యతలు చేపట్టాల్సిందిగా మద్దతు లభించింది. ఈ తరుణంలోనే చంపాయి సోరెన్ బుధవారం తన సిఎం పదవికి రాజీనామా చేసి, గవర్నర్‌కు సమర్పించారు.

## లాకర్‌లో 1.2కిలోల బంగారం

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు గత నెలలో అక్రమ మైనింగ్‌కు పాల్పడిన గూడెం మహిపాల్‌రెడ్డి, కుమారుడు విక్రమ్‌రెడ్డి, సోదరుడు జి.మధుసూధన్‌రెడ్డితో పాటు వారి కుటుంబ సభ్యులు, బంధువులు, బినామి ఇళ్లపై సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే.ఈ సోదాల్లో రూ.300 కోట్లు పన్ను ఎగవేసిన కీలక డాక్యుమెంట్లను ఇడి అధికారులకు లభించాయి. మనీలాండరింగ్ కేసులో మైనింగ కుంభకోణంపై దర్యాప్తు చేస్తున్న ఇడి అధికారులు మహిపాల్‌రెడ్డికి పటాన్‌చెరులోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో లాకర్‌ను గుర్తించారు. ఇటీవలే ఆ లాకర్‌ను తెరువగా అందులో ఈ బంగారు బిస్కెట్ల ఉదంతం బయటపడింది.ఇది విదేశీ బంగారమేనని గుర్తించారు.ఈ బంగారం ఖరీదు చేసినట్లు మహిపాల్‌రెడ్డి వద్ద ఎలాంటి రసీదులు లభించలేదన్నారు. హవాలా ద్వారా దీన్ని సేకరించి ఉండవచ్చని అనుమానిస్తున్నారు.

## నైరాశ్యంలోకి రైతన్న

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ భూములుగా రికార్డుల్లో ఉండడం జరిగింది. వీటి పరిష్కారానికి గ్రామస్థాయి నుంచి హైకోర్టు వరకు తిరిగినా ఫలితం దక్కడం లేదు. ఉదాహరణకు వడ్లమూడి వెంకటేశ్వరరావు అనే రైతుకు కొణిజర్ల మండలం గుబ్బగుర్తి రెవెన్యూ పరిధిలో భూమి ఉన్నది. దాదాపు 100 సంవత్సరాలుగా ఆ భూమిని వడ్లమూడి వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు సేద్యం చేసుకుంటున్నారు. ఇటీవల కొందరు వ్యక్తులు ఈ భూమి తమదంటూ మీ భూమి వేరే చోట ఉన్నదంటూ దున్ననివ్వకుండా అడ్డుతగిలారు. ఐదేండ్లుగా మండల రెవెన్యూ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్లు, న్యాయస్థానాల చుట్టూ తిరిగినా ఈ పేద రైతు సమస్య పరిష్కారం కాలేదు. తన భూమిని తనకు అప్పగించండి ఆ భూమిపై ఆధారపడి బతుకుతున్నామని మొరపెట్టుకున్నా ఆ మొర అలకించిన నాధుడు లేడు. ఇటువంటి ఘటనలు కొకొల్లలు. కొంత మంది వాస్తవ సాగులో ఉన్న విస్తీర్ణం కంటే పట్టాదారు పాసు పుస్తకాల్లో తక్కువ భూమి ఉన్నట్లు చూపించారు. మా భూమి మా ఆధీనంలోనే ఉంది దీనికి పరిష్కారం చూపి మిగులు భూమిని తమ పేరున రికార్డుల్లో నమోదు చేయండి అని తిరిగినా ఫలితం ఉండడం లేదు. సరిహద్దు సమస్యలు, గ్రామ కంఠాల సంగతి సరే సరి. భూ వివాదాల్లో జరుగుతున్న జాప్యం పలు ఘర్షణలకు కూడా తావిస్తుంది. ఇప్పటికే చాలా మంది రైతులు తమ భూమి తమకు దక్కదని ఆత్మహత్యలకు సైతం పాల్పడిన ఘటనలు విధితమే. ఖమ్మంజిల్లాలో మూడు నెలల కాలంలో నలుగురైదుగురు ఈ భూ వివాద ఘటనలో హత్యలకు గురయ్యారు. ప్రభుత్వం తక్షణం ఈ భూ వివాదాల పరిష్కారానికి ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి నిర్దేశిత సమయంలో వివాదాలను పరిష్కరించాల్సి ఉంది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com

## మండల ప్రత్యేక అధికారిగా విజయ్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/షాబాద్ :** షాబాద్ మండల ప్రత్యేక అధికారిగా జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి విజయ్‌కుమార్‌రెడ్డి గురువారం షాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపిపి పదవీకాలం ముగిసిన సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు బాధ్యతలు తీసుకున్నట్లు తెలిపారు. మండలంలో ప్రజలకు ందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామాల్లోని సమస్యలు ఉంటే గ్రామ కార్యదర్శి, ప్రత్యేక అధికారికి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యాచారం ప్రత్యేకాధికారిగా పద్మజా రమణి



**ప్రజాపక్షం/యాచారం :** యాచారం మండల ప్రత్యేకాధికారిగా జిల్లా దివ్యాంగుల సంక్షేమ అధికారి పద్మజా రమణి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగే వరకు మండల అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. పద్మజా రమణికి ఎంపిడిఒ నరేందర్‌రెడ్డి, ఎంపిడిఓ శ్రీలత, మండల అధికారులు శాలువా కప్పి స్వాగతం పలికారు. మండల అభివృద్ధికి తన వంతు సాయంగా కృషి చేస్తానని అన్నారు. అధికారుల సహకారంతో ముందుకు సాగుతానని అన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## స్థానికేతరులు సొంతరాష్ట్రాలకు

### రెండు రాష్ట్ర ప్రభుత్వాలకు ఉద్యోగుల వినతి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ, ఎపిలో స్థానికేతరులుగా పని చేస్తున్న జిల్లా, జోనల్, మల్టీ జోనల్‌కు చెందిన ఉద్యోగులను సొంత రాష్ట్రాలకు పంపించాలని నాన్ లోకల్ టీచర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (ఎన్‌ఎల్‌టిఎ)తెలంగాణ నెటీవ్ ఎంప్లాయీస్ వర్కింగ్ ఇన్ సీమాంధ్ర అసోసియేషన్ (టిఎన్‌ఇడబ్ల్యుఎస్‌ఎ) ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ నెల 6న తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం జరగనున్న నేపథ్యంలో తెలుగు రాష్ట్రాలలో స్థానికేతరులుగా విధులు నిర్వహిస్తున్న బదిలీల సమస్యను పరిష్కరించాలని కోరారు. హైదరబాద్‌లోని సచివాలయ మీడియా పాయింట్ వద్ద ఎన్‌ఎల్‌టిఎ అధ్యక్షుడు ఎం.మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి వి. సూర్యనారాయణ, టిఎన్‌ఇడబ్ల్యుఎస్‌ఎ అధ్యక్షుడు బి. లక్ష్మి నారాయణ, ప్రధాన కార్యదర్శి వి.అంజయ్య మాట్లాడారు. సొంత రాష్ట్రాలకు వెళ్లేందుకు ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలకు అవకాశాన్ని కల్పించాలని కోరారు. ఉద్యోగుల విభజనలో కేవలం రాష్ట్ర స్థాయి ఉద్యోగులకు మాత్రమే సొంత రాష్ట్రాలకు బదిలీలు చేశారని, ఇరు రాష్ట్రాలలో జిల్లా, జోనల్, మల్టీ జోనల్‌కు చెందిన ఉద్యోగులు తెలంగాణ, ఎపిలో స్థానికేతరులుగా ఇప్పటికీ విధులు నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికేతరులగా విదులు నిర్వహించ డంతో తమ పిల్లలు రిజర్వేషన్లను కోల్పతున్నారని, వృద్ధాప్యంలో ఉన్న తల్లితండ్రులకు తాము దూరంగా ఉంటున్నామని తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన ఆరోగ్య కార్డులు, మెడికల్ రియంబర్స్‌మెంట్ వర్తించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

## గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు కోర్సులు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియా స్కూల్ అఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడిస్ సంబంధించిన ప్రత్యేక కౌంటర్‌ను ఖైరతాబాద్‌లోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇనిస్టిట్యూట్ అఫ్ ఇంజనీర్స్ భవనంలో గురువారం కళాశాల డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వర్‌రావు ప్రారంభించారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియాలోని స్కూల్ అఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడిస్‌లో రెండేళ్ల వ్యవధిగల పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ జనరల్ మేనేజ్ మెంట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ఇన్ ఫ్రా స్ట్రక్చర్ మేనేజ్ మెంట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ఇండస్ట్రియల్ సేఫ్టీ అండ్ ఎన్వీరాన్ మెంట్ మేనేజ్ మెంట్ కోర్సుల్లో 2024–26 కోసం అడ్మిషన్స్ ప్రారంభం అయ్యాయని, కోర్సు వివరాలు ఖైరతాబాద్‌లోని ఇనిస్టిట్యూట్ అఫ్ ఇంజనీర్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కాలేజ్ కౌంటర్‌లో తెలుసుకోవచ్చని తెలిపారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ జనరల్ మేనేజ్ మెంట్ కోర్సుల్లో మార్కెటింగ్, ఫైనాన్స్, ఆపరేషన్స్, ఐటీరంగాలకు సంబంధిచిన స్పెషలై జేషన్స్ ఉన్నాయని, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్ మెంట్సి విభాగంలో సివిల్, ట్రాన్స్‌పోర్టేషన్, పవర్, టెలి కమ్యూనికేషన్స్, ఐటి స్పెషలై జేషన్స్ ఉండగా, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ఇండస్ట్రియల్ సేఫ్టీ అండ్ ఎన్వీరాన్ మెంట్ మేనేజ్ మెంట్ కోర్సులో సేఫ్టీ మేనేజ్ మెంట్‌కు సంబంధించిన స్పెషలైజేషన్స్ ఉన్నాయని డైరెక్టర్ రామేశ్వర్‌రావు వివరించారు. ఈ కౌంటర్ రెండునెలలపాటు అందుబాటులో ఉంటుందని, గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన విద్యార్థులు ఈ కోర్సుల్లో చేరడానికి అర్హత ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.జగన్‌మోహన్‌రెడ్డి, ఫ్యాకల్టీ అలిగ రాజు, కిషన్ పాల్గొన్నారు.

## ఒకే రోజు ఐదు గంజాయి కేసులు

### 12మంది అరెస్టు..మత్తుపదార్థాలు స్వాధీనం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌లో ఎక్సైజ్ పోలీసులు, టాస్క్ ఫోర్స్ పోలీసులు, నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్, శాంతి భద్రతల పోలీసులు జరిపిన వరుస దాడుల్లో రూ.కోటిన్నర విలువైన గంజాయిని స్వాధీనం చేసుకుని 12 మంది నిందితులను అరెస్టు చేశారు. ఈ మేరకు బేగం బాజర్, హబీబ్‌నగర్, ఆసీఫ్‌నగర్, కంచన్‌బాగ్‌తో పాటు హయత్‌నగర్ ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌లో ఎనిమిది గంటల వ్యవధిలోనే మొత్తం ఐదు కేసులు నమోదు కావడం గమనార్హం. ఇందుకు సంబంధించిన వివరాలను టాస్క్‌ఫోర్స్ డిసిపి వైవిఎస్ సుదీంద్రా వెల్లడించారు. బేగంబజార్‌లో తనిఖీలు నిర్వహించగా కొర్రబాబు (30),చందన్‌కుమార్ చౌదరి (34),వై.దన్‌రాజ్ (27)లు పట్టుబడ్డారు. వీరి నుంచి 1.275 కిలోల హాష్ ఆయిల్ (మత్తు మందు) స్వాధీనం చేసుకున్నారు. అలాగే హబీబ్‌నగర్, ఆసీఫ్‌నగర్,కంచన్‌బాగ్ పోలీసు స్టేషన్‌ల పరిధిలో తనిఖీలు నిర్వహించగా గంజాయిని సరఫరా చేస్తున్న అంతర్జాతీయ రాకెట్ గుట్టు రట్టయింది. ఈ మూడు కేసుల్లో ఒడిశాకు చెందిన మనజిత్ డాలి, అనీల్ ధనాజి ఘూంటె, సుమంత్ మండల్, ప్రసనజిత్ మిశ్రా, ఈస్ట్‌గోదావరికి చెందిన చిన్న రాథోడ్ గోవింద్, మంగళ్‌హాట్‌కు చెందిన రౌడీషీటర్ ఎస్.లఖన్‌సింగ్, ఆసీఫ్‌నగర్‌కు చెందిన జి.దేవరాజ్ సింగ్‌లను అరెస్టు చేసి వారి నుంచి 155 కెజిల గంజాయి, స్కార్పియో వాహనం, ప్యాసింజర్ ఆటో, 9 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

**హయత్‌నగర్ ఎక్సైజ్ పరిధిలో...** ఒరిస్సా నుంచి బస్సులో హైదరాబాద్‌కు రవాణా అవుతున్న 16.1 కిలోల గంజాయిని గురువారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌టిఎఫ్ సూపరింటెండెంట్ ఎన్.అంజిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన తనిఖీల్లో పట్టుకున్నారు. జయదేవ్ అనే వ్యక్తిని అరెస్టు చేశారు. సిఐ ఎంపిఆర్ చంద్రాశేఖర్, ఎస్‌ఐ సాయికిరణ్, సిబ్బంది యాదగిరిరాజు, యాదగిరి, మహేష్, రజనీకాంత్, అశ్విన్, వాసు, ప్రభు,రాహుల్ ఉన్నారు.

## ఎంపి అరుణకు స్వాగతం పలికిన బిజెపి నాయకులు



**ప్రజాపక్షం/కొత్తూరు:** మహబూబ్‌నగర్ పార్లమెంట్ మెంబర్‌గా ప్రమాణ స్వీకారం చేసి మొదటి సారిగా సొంత నియోజకవర్గానికి వెళ్తున్న నేపథ్యంలో పార్లమెంట్ కో కన్వీనర్ అమడాపురం నర్సింహ్మాగౌడ్ ఆధ్వర్యంలో గురువారం తిమ్మాపూర్ వద్ద బిజెపి శ్రేణులు ఘనంగా స్వాగతం ఫలికారు. పాలమూరు అభివృద్ధి బిజెపితోనే సాధ్యమని ఎంపి డికె అరుణమ్మ తెలిపారు. తిమ్మాపూర్ చౌరస్తాలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కెవిఎల్‌ఎన్ రాజు, దేపల్లి అశోక్ గౌడ్, భూపాలచారి, వంశీకృష్ణ, నాగరాజుచారి, రణదీర్ గౌడ్, మనోహర్‌రెడ్డి, చెట్ల వెంకటేష్, మల్చలం మురళి, ఎంకనోళ్ల వెంకటేష్ పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో పర్యటనలు



### అధికారులకు జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆమ్రపాలి ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు ప్రతి రోజు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆమ్రపాలి కాట ఆదేశించారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో తన ఛాంబర్‌లో జోనల్ కమిషనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జోనల్ కమిషనర్‌లతో పాటు డిప్యూటీ కమిషనర్లు కూడా తమ తమ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి, నివేదికతో పాటు సంబంధిత ఫొటోలు పంపించాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఒక్కొక్క అంశంపై ప్రజలకు వివరించడమే కాకుండా మీడియాలో కూడా ఆ అంశాలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. డెంగీ నివారణకు ప్రత్యేక దృష్టి సారించాలని, అవసరమనుకుంటే అందుకు ఐఈసి కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలన్నారు. సంబంధిత ఎంటమలాజి సిబ్బంది ఇంటింటికి వెళ్లి దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి నెల కేటాయించిన ట్యాక్స్ వసూళ్లు చేయాలని, ట్యాక్స్ వసూలు చేసిన శాతం ప్రకారం నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. పారిశుద్ధ్యం, సిఅండ్‌డిపై అధికారులు దృష్టి సారించాలన్నారు. సమావేశంలో జోనల్ కమిషనర్లు అనురాగ్ జయంతి, రవికుమార్, ఉపేందర్‌రెడ్డి, ఎస్. పంకజ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# లేని ప్లాట్‌లకు రూ.కోట్లు వసూలు

### సిసిఎస్‌లో ఫిర్యాదు చేసిన బాధితులు
### అర్బన్ వుడ్స్ రియాల్టీ ఎల్‌ఎల్‌పిపై కేసు
### పరారీలో మేనేజింగ్ డైరెక్టర్లు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్లాట్లు కట్టిస్తామని పలువురు బాధితుల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసిన సోమాజిగూడలోని అర్బన్ వుడ్స్ రియాల్టీ ఎల్‌ఎల్‌పి బిచాణా ఎత్తివేసింది. దీంతో బాధితులు గురువారం హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో సదరు డౌలపర్స్ సంస్థపై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఆ సంస్థ ప్రతినిధులు పరారీలో ఉన్నారు. బాధితుల కథనం మేర కు వివరాలు ఇలా ఉన్నాయి. సోమాజిగూడలోని అర్బన్ వుడ్స్ రియాల్టీ ఎల్‌ఎల్‌పి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్లు మేకా శ్రీనివాస్, గగన్‌దీప్ సింగ్ కోహ్లీ, మేనేజర్ కొండూరి వెంకటేష్‌లు 2021లో రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖాజాగూడ గ్రామానికి చెందిన సర్వే నెంబర్లు 9,10,11, 15,16ఎలో అపార్ట్‌మెంట్లు నిర్మించి ప్లాట్‌కు విక్రయిస్తామని అందమైన బ్రోచర్లు ముద్రించారు. ఈ క్రమంలోనే సోమాజిగూడకు చెందిన మెట్టు శశిభూషణ్ దాస్ రెడ్డి (48), గుండా శ్రీకాంత్ (45), డాక్టర్ సుష్మిత జువ్వాడి,విష్ణుప్రసాద్‌లు అర్బన్ వుడ్ రియాల్టీ ఎల్‌ఎల్‌పి సంస్థను ఆశ్రయించారు. ఖాజాగూడలో నిర్మించే ప్లాట్లు ఖరీదు చేసేందుకు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మేక శ్రీనివాస్‌తో ఒప్పందం చేసుకున్నారు. ఈ నలుగురు కలిసి రూ.1,39,91,250 డబ్బును సదరు నిర్మాణ సంస్థకు చెల్లించారు. ఒప్పందం ప్రకారం 18 నెలలలో ప్లాట్లు నిర్మించాలి. అయితే గడువు ముగిసినా కూడా అక్కడ ఎలాంటి నిర్మాణాలు జరగకపోవడంతో బాధితులు సంస్థ ప్రతినిధులకు ఫోన్ చేయగా సరైన సమాదానాలు రాలేదు. అసలు ఆ సంస్థ ప్లాట్లు నిర్మించేందుకు ఎలాంటి అనుమతులు పొందలేదని, భూ యజమానుల నుంచి కూడా ఎలాంటి లావాదేవీలు జరపలేదని తేలింది. దీంతో తాము మోసపోయామని గ్రహించిన బాధితులు సిసిఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్లాట్లు నిర్మించకుండానే కుట్రకు పాల్పడి తమ వద్ద నుంచి డబ్బులు కట్టించుకున్నారని బాధితులు వాపోయారు. దీంతో పోలీసులు అర్బన్ వుడ్స్ రియాల్టీ ఎల్‌ఎల్‌పి నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్లు మేకా శ్రీనివాస్, గగన్‌దీప్ సింగ్ కోహ్లీ, మేనేజర్ కొండూరి వెంకటేష్‌లపై చీటింగ్ కేసుతో పాటు కుట్రకు పాల్పడిన కేసు నమోదు చేశారు.ప్రస్తుతం నిందితులు ముగ్గురు కూడా పరారీలో ఉన్నట్లు బాధితులు తెలిపారు.తమను మోసగించిన నిందితుల ఆస్తులను జప్తు చేసి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

## స్నేహితులకు బాల్యమిత్రుల అండ

**ప్రజాపక్షం/కేశంపేట:** కలిసి చదువుకున్న తోటి స్నేహితుల కుటుంబాలకు బాల్యమిత్రులు ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు. కేశంపేట మండలం మంగళిగూడెం గ్రామానికి చెందిన శ్రీశైలం గత నెల రోజల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి కాలుకి శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న శ్రీశైలంకు కొత్తపేటలో 1994–95 సంవత్సరంలో కలిసి ఎస్ఎస్‌సి చదువుకున్న బాల్యమిత్రులు గురువారం రూ.15వేలు అందజేసి మనోధైర్యాన్ని కల్పించారు. అదేవిధంగా తమ క్లాస్‌మేట్ కొత్తపేటకు చెందిన నర్సమ్మ ఇంటి నిర్మాణం చేపట్టి ఇబ్బందులను ఎదుర్కొంటున్న పరిస్థితిని గమనించి ఆమెకు రూ.30,516 లు అందజేశారు. కార్యక్రమంలో అంజయ్య, శేఖర్ యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, బాల్‌రాజ్, నర్సింహ్మా, శేఖర్, సురేష్, పెంటాజీ, కండక్టర్ బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



# దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి ఆదర్శం

### రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు దొడ్డి కొమరయ్య పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక అన్నారు. దొడ్డి కొమురయ్య జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగానిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను అనుసరిస్తూ గురువారం దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ శశాంక పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటానికి తొలి అమరత్వాన్ని ఇచ్చి స్ఫూర్తినిచ్చిన వారే దొడ్డి కొమురయ్య అని తెలిపారు. దొడ్డి కొమురయ్య స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని తలచుకోగానే మొదటగా గుర్తు వచ్చేది పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య అన్నారు. తెలంగాణలో భూస్వామ్యపాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు, తెలంగాణ సాయుధ రైతాంగ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని పేర్కొన్నారు. వీరుల గాథలు ప్రతిఒక్కరూ తెలుసుకోవాలనే ఉద్దేశంతో జయంతి, వర్ధంతిలను అధికారికంగా నిర్వహించుకోవడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ సంగీత, బిసి సంక్షేమ అధికారి నీరజరెడ్డి, నరసింహరావు, ఎఒబిసి ఫ్రంట్, కెవైసిఎస్ రాష్ట్ర, జిల్లానాయకులు, సంబంధిత అధికారులు, సిబ్బంది, హాస్టల్ వార్డెన్‌లు పాల్గొన్నారు.

# రైతు అభిప్రాయాలకు మొదటి ప్రాధాన్యత

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** అన్నదాతల అభిప్రాయాలను కాంగ్రెస్ ప్రభుత్వం గౌరవించడంతోపాటు మొదటి ప్రాధాన్యత ఇస్తుందని షాద్‌నగర్ శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ వివరించారు. గురువారం కొందుర్గు మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో రైతుబంధు, రుతు రుణమాఫీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ అన్నదాతలకు అందిస్తున్న రైతుబంధు, రైతు రుణమాఫీపై అభిప్రాయాలను పరిగణలోకి తీసుకునేందుకే అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందని వివరించారు. అన్నదాతల అభిప్రాయాలకు అనుగుణంగానే కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయాలను తీసుకుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కోఆపరేటివ్ సొసైటి అసిస్టెంట్ రిజిస్ట్రార్ నాగలింగాచారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కోఆపరేటీవ్ సొసైటిస్ సరస్వతి, పిఎసిఎస్ చైర్మెన్ దామోదర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, చౌదరిగూడ మండల అధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

### ఆర్థిక క్రమ శిక్షణకు మారుపేరు కొణిజేట్టి రోశయ్య

ఆర్థిక క్రమ శిక్షణకు మారుపేరు దివంగత మాజీ ముఖ్యమంత్రి కొణిజేట్టి రోశయ్య అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం షాద్‌నగర్ పట్టణంలోని కన్యకా పరమేశ్వరీ దేవాలయం సమీపంలో ఉన్న కొణిజేట్టి రోశయ్య జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రోశయ్య రాజకీయ అనుభవాల్ని నేటితరం నేతలు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. రాజకీయాలకి అతీతంగా రోశయ్య సేవల్ని గుర్తించి గౌరవించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నేతలు అధ్యక్షులు కల్వ యాదగిరి, సరాపు రమేష్ కుమార్, నాగిళ్ల గోపాల్ గుప్తా, రవికుమార్ గుప్తా, సరాపు అనంతలక్ష్మీ, రిటైర్డు తహశీల్దార్ సరాపు జతదీశ్వర్, మురళిమోహన్, మంచని నిర్మల నేతలు తిరుపతిరెడ్డి, తోకల దామోదర్‌రెడ్డి, క్యాసెట్ శ్రీను, సురేష్‌లు ఉన్నారు.



### హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

ప్రభుత్వ వసతి గృహాల్లో ఉండే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు వార్డెన్లు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. గురువారం క్యాంపు కార్యాలయంలో డివిజన్‌లో ఉన్న సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, కెజిబివి, మైనార్టీ వెల్ఫేర్, బిసి వెల్ఫేర్ హాస్టల్ ప్రిన్సిపాల్‌లతో, స్పెషల్ ఆఫీసర్లతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వసతిగృహాల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, నాణ్యమైన విద్య భోజనం అంధించాలని సూచించారు. విద్యార్థులకు వసతి సౌకర్యాలు కల్పించే బాధ్యత వార్డెన్లపై ఉందనిన్నారు. ప్రైవేట్‌కు ధీటుగా ప్రభుత్వ విద్యను అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు

### మాజీ ఎంపిపి కొప్పు సుకన్యభాష



**ప్రజాపక్షం/యాచారం :** సేవ చేయడానికి అవకాశం కల్పించిన మండల ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని యాచారం ఎంపిపి కొప్పు సుకన్యభాష అన్నారు. గురువారం యాచారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడానికి నాతోటి ఎంపిటిసిలు నన్ను ఎంపిపిగా చేసి నాకు అరుదైన గౌరవం కల్పించారన్నారు. ప్రజాసమస్యలను పరిష్కరించడంలో అధికారులు, ప్రజాప్రతి నిధలుతో సమన్వయంగా ఉండి సమస్యలను పరిష్కరించడానికి తనవంతుగా కృషి చేశానన్నారు.

## కేశంపేట ప్రత్యేకాధికారిగా రాజరత్నం



**ప్రజాపక్షం/కేశంపేట :** కేశంపేట మండల ప్రత్యేకాధికారిగా షాద్‌నగర్ వ్యవసాయశాఖ ఏడిఏ రాజారత్నం గురువారం భాధ్యతలు స్వీకరించారు. బుధవారం ఎంపిపి, జడ్పిటిసి, ఎంపిటిసిల పదవికాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. భాధ్యతలు స్వీకరించిన రాజారత్నం కేశంపేట మండలంలోని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఇంచార్జ్ ఎంపిడిఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అనుమతులు ఉన్నా వేధింపులు

**ప్రజాపక్షం/వనస్థలిపురం :** తమప్రైవేటు పాఠశాలకు అన్ని అనుమతులు ఉన్నాయని, కానీ కొంతమంది యూ ట్యూబ్‌చాన్ల పేరుతో బ్లాక్‌మెయిల్ చేస్తూ బెదరింపులు చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని లక్ష్య స్కూల్ ఆఫ్ ఎక్సేలెన్స్ పాఠశాల చైర్మన్ సోమవరపు కార్తీక్ ఆరోపించారు. గురువారం బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని సామనగర్ ఉన్న లక్ష్య స్కూల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 20 సంవత్సరాలుగా విద్యారంగంలో ఉండి ఎంతోమంది విద్యార్థులకు విద్యను అందిస్తున్నామని, ఆధునిక సౌకర్యాలతో విశాలమైన తరగతి గదులు ఏర్పాటు చేసి, అనుభవం ఉన్న ఉపాధ్యాయులతో విద్యబోధిస్తున్నామన్నారు. ఇటీవల సూరన్న యూ ట్యూబ్ చానల్ సిబ్బంది అనుమతులు తీసుకోకుండా పాఠశాలకు వచ్చి సిబ్బందితో అసభ్యకరంగా మాట్లాడుతూ భయభ్రంతులకు గురి చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మా లక్ష్య స్కూల్‌లో నర్సరీ నుంచి 8వ తరగతి వరకు అనుమతులు ఉన్నాయని, విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి మార్గదర్శకాలు ప్రకారం విద్యా శాఖ కమిషనర్ నుంచి అన్ని అనుమతుల ఉన్నాయని తెలిపారు. విద్య హక్కు చట్టం ప్రణాళిక ప్రకారం మాకు పాఠశాలలకు ప్లే గ్రౌండ్, బిల్డింగ్ భవనంకు కూడా పర్మిషన్ ఉన్నాయని తెలిపారు. కానీ కొన్ని యూ ట్యూబ్ చానల్ పేరుతో పాఠశాలకు వచ్చి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, ఇవ్వని యెడల మా పాఠశాలపై యూ ట్యూబ్‌లో అప్‌లోడ్ చేసి చెడు ప్రచారం చేస్తున్నారన్నారు. నేటి తరం, సూరన్న యూ ట్యూబ్ చానల్‌కు సంబంధించిన వారిపై చర్యలు తీసుకోవాలని వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందని వారు పేర్కొన్నారు.



# విద్యాసంస్థల బంద్ విజయవంతం







**ప్రజాపక్షం/షాద్‌నగర్:** నీట్ పేపర్ లీకేజ్‌ని నిరసిస్తూ వామపక్ష విద్యార్థి సంఘాలు ఇచ్చిన దేశవ్యాప్త కేజీ టు పీజీ విద్యాసంస్థల బందు విజయవంతమైంది. గురువారం షాద్‌నగర్ పట్టణంతోపాటు కొత్తూరు, నందిగామ, ఫరూక్‌నగర్, కేశంపేట, కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ మండల కేంద్రాలు, గ్రామాలలో ఉన్న విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘం రాష్ట్ర సమితి సభ్యులు ఎం.పవన్ చౌహాన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నీట్ పరీక్షను రద్దు చేసి కొత్తగా మళ్లీ పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రిని బర్తరఫ్ చేయాలని, పేపర్ లీక్‌కు కారణమైన సంస్థను రద్దు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు ఇష్టారాజ్యంగా ఫీజులను పెంచి పేద ప్రజలను దోచుకుంటున్నాయని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వాలు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నేతలు ఆకాష్ నాయక్, విజయ్‌చారి, సాయి, దినేష్, శివకుమార్, రమేష్, ఎస్‌ఎఫ్ఐ నేతలు శ్రీకాంత్, ముఖిత్, ఎన్‌ఎస్‌యుఐ నేతలు బిలాల్, సయ్యద్ అక్రమ్ షా, నవాజ్, హర్ష, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

**తుర్కయాంజల్ :** నీట్,నెట్ పరీక్షల ప్రశ్న పేపర్ల లీకేజీలను నిరసిస్తూ వామపక్ష విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త విద్యా సంస్థల బంద్‌లో భాగంగా గురువారం తుర్కయంజాల్ మున్సిపాలిటి పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల బంద్ విజయవంతం అయింది అని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.శివకుమార్ అన్నారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ నీట్,నెట్ పరీక్ష పేపర్ల లికేజ్ వలన నష్టపోయి, ఆందోళన చెందుతున్న విద్యార్థులకు, తల్లిదండ్రులకు పూర్తి స్థాయి భరోసా కల్పించడంలో కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం విఫలమైందన్నారు. నీట్ పేపర్ లీకేజీ ఘటనకు కేంద్ర ప్రభుత్వామే బాధ్యత వహించాలని పేర్కొన్నారు. పేపర్ లీకేజీ పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చే సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని, పేపర్ లీకేజీ వలన నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని, నేషనల్ టెస్ట్ ఏజెన్సీ ను రద్దు చేయాలన్నారు. పేపర్ లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి దేవేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, పేపర్ లీకేజీ ఘటనపై ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశ ప్రజలకు, విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని, నీట్ పరీక్ష నిర్వహణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీకాంత్ మండల నాయకులు గండికోట శివ, వివేక్ తదితరులు పాల్గొన్నారు



## మొక్కలే మానవాళికి జీవనాధారం

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** మొక్కలే మానవాళికి జీవనాధారం అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ యంవిఎస్ డిగ్రీ కళాశాల అవరణలో మహబూబ్‌నగర్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, కమీషనర్ మహేశ్వర్ రెడ్డి, వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, యంవిఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.పద్మావతి తో కలిసిమొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమవంతుగా కనీసం పది మొక్కలు నాటించాలని, అలాగే డిగ్రీ చదువుతున్న 3000 మంది విద్యార్థులు వన మహోత్సవం కార్యక్రమం గురించి విరివిరిగా ప్రచారం నిర్వహించాలని ,అలాగే వారి తల్లీ పేరుతో ఒక చెట్టు పెంచి వాటి సంరక్షణ కోసం కృషి చేయాలని ఆయన కోరారు . విద్యార్థులు పెంచే చెట్లు కోసం మున్సిపాల్ చైర్మన్ , కమీషనర్ ఆధ్వర్యంలో అవసరమైన మేరకు నిధులు ఏర్పాట్లు పర్యవేక్షిస్తారని ఆయన చెప్పారు. కార్యక్రమంలో మున్సిపాల్ చైర్మన్ ఆనంద గౌడ్ మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్ మూన్సిపాల్ కమిషనర్ మహేశ్వరి రెడ్డి, కౌన్సిలర్ రాణి ,అంజద్ ,లక్ష్మ ణ్ నాయక్ తిరుమల వెంకటేష్ ,అర్షద్ ,యంవియస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతి ,లక్ష్మ ణ్ యాదవ్ ,కిషన్ నాయక్ ,అధ్యాపకులు ,విద్యార్థులు,అధికారులు పాల్గొన్నారు .

## నేడు నల్లమలలో మంత్రి జూపల్లి పర్యటన

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** నల్లమల అటవీ ప్రాంతంలోని పర్యాటక ప్రదేశాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఎకో, టెంపుల్, రివర్ టూరిజం సమూహాల అభివృద్ధి, వసతుల కల్పనపై కసరత్తు ప్రారంభించింది. నల్లమలను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దడంలో భాగంగా పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణ రావు నేతృత్వంలోని ఉమ్మడి పాలమూరు జిల్లా ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు బృందం జులై 5,6న నల్లమలలో పర్యటించనుంది. రెండు రోజుల స్టడీ టూర్‌లో భాగంగా పర్యాటక అభివృద్ధి, మౌలిక వసతులు కల్పన, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పన, తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయనున్నారు.



## భూ సమస్యలపై పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** ధరణి పోర్టల్‌లో భూ సమస్యలపై పెండింగు దరఖాస్తులు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారం చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయం నుంచి తాహసీల్దార్ లతో వెబెక్స్ సమావేశం నిర్వహించి మండలంలో వారీగా పెండింగు దరఖాస్తు పై సమీక్షించారు. గత నెల 29న సిసిఎల్‌ఏ నవీన్ మిట్టల్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి సమీక్షించిన అనంతరం గత నెల 29 నుండి గురువారం వరకు ఎన్ని దరఖాస్తులు పరిష్కరించారు. ఎన్ని పెండింగులో ఉన్నవి తాహసిల్దార్ లతో సమీక్షించారు. సిసిఎల్ఏ ప్రతి రోజు మానిటర్ చేస్తున్నందున దరఖాస్తులు పరిశీలన చేసి అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. అదే ఇసుక పెనాల్టీ లపై సమీక్షించారు. మీసేవ పెండింగు దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్ రావు, ఆర్‌డిఓ నవీన్ తదితరులు ఉన్నారు.

## వ్యవసాయరంగానికి పెద్దపీట

### ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

**ప్రజాపక్షం/వంగూర్ :** రాష్ట్రంలో కాంగ్రెస్‌ప్రభుత్వం వ్యవసాయరంగానికి పెద్దపీట వేస్తుందని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్‌వంశీకృష్ణ అన్నారు. గురువారం మండలపరిధిలోని రంగాపూర్ గ్రామంలో ప్రాథమిక వ్యవసాయసహకారసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మహాజన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం సింగిల్‌విండో చైర్మన్ సురేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అచ్చంపేట నియోజకవర్గంలో ప్రతి ఎకరం వ్యవసాయభూములకు సాగు నీరు అందించి సస్యశ్యామలం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి కెవిన్‌రెడ్డి, ఎంపిపిభీమమ్మలాల్ యాదవ్, వైస్ ఎంపిపి సంధ్యనర్సింహరెడ్డి, వైస్‌చైర్మన్ బాలస్వామి, సింగిల్‌విండోడైరెక్టర్లు కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## మైనర్ బాలికను వివాహం చేసుకున్నందుకు కేసు నమోదు

**ప్రజాపక్షం/మహ్మదాబాద్ :** మైనర్ బాలికను వివాహం చేసుకున్న వ్యక్తిపై అతని కుటుంబ సభ్యులపై పోలీసులు కేసు నమోదు చేశారు. చైల్డ్ వెల్ఫేర్ అధికారి బండారి రాధిక సిఎంపీఓ మహబూబ్‌నగర్ ఫిర్యాదు మేరకు వెన్నచేడు గ్రామంలో మైనర్ బాలికను అదే గ్రామానికి చెందిన వ్యక్తి గత నెల వివాహం చేసుకున్నందున వివాహం చేసుకున్న వ్యక్తి పైన అతని కుటుంబ సభ్యుల పైన వివాహనికి సహకరించిన వ్యక్తులపైన చైల్డ్ మ్యారేజ్ యాక్టు మరియు ఫోక్సో చట్టం క్రింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్ రెడ్డి తెలిపారు.

## 2018 చోరీ కేసులు ఛేదించిన పోలీసులు

**ప్రజాపక్షం/బాలానగర్ :** గ్రామ రైల్వే స్టేషన్ రోడ్డులో గల కటికే మల్లేకేది రవీందర్ ఇంట్లో సెప్టెంబర్ మూడవ తేది 2018 లో జరిగిన చోరీ కేసును చేదించినట్లు బాలానగర్ ఎస్ఐ తిరుపతి మీడియాకు వెల్లడించారు. గురువారం ఈ మేరకు ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మల్లెకేడి రవీందర్ వాళ్ల నాన్న సొంత గ్రామ చింతగూడెంకు ఆగస్టు 25వ తేదీన తాళం వేసి వెళ్లగా బాలానగర్ మండలం మామిడి గుట్ట తండాకు చెందిన ఇస్లావత్ శరత్ ఇంటి తాళం విరగొట్టి బీరువాలో తులం బంగారు బుట్టలు, 30 తులాలు మూడు జతల వెండి కాళ్ల గొలుసులు, పది తులాల వెండి చెడాలు, ఆరువేల రూపాయలు ఎవరో దొంగిలించడం జరిగిందని అప్పుడు కేసు నమోదు చేయబడిందని వెల్లడించారు. గురువారం టీజీపీ ఎస్పీ ముట్టడి కార్యక్రమంలో భాగంగా ఎస్పీ ఆదేశాల మేరకు చెక్‌పోస్టు లో ఎస్ఐ సిబ్బందితో తనిఖీలు చేస్తుండగా తుఫాన్ బండి లో నుండి పోలీసు వారిని చూసి పారిపోతుండగా కూలి పని చేసుకునే ఇస్లావత్ శరత్‌ను పట్టుకుని విచారించగా తాను 2018 లో ఈ దొంగతనానికి పాల్పడినట్లు నేరం ఒప్పుకున్నామని తెలిపారు. చోరికి పాల్పడిన శరత్‌ను జడ్చర్ల కోర్టులో హాజరు పరచడం జరిగిందని ఎస్ఐ వెల్లడించారు.

# సింగరేణి ప్రైవేటీకరణ కోసమే

# బొగ్గు గనుల వేలం

### ఎం.బాల్ నరసింహ్మా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు




**ప్రజాపక్షం /మహబూబ్ నగర్ ప్రతినిధి :** నల్ల బంగారగణి సింగరేణి ప్రైవేటీకరుణ చేసే కుట్రలో భాగంగానే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బొగ్గు గనుల వేలానికి పూనుకున్నదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల నరసింహ ఆరోపించారు. గురువారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మహబూబ్ నగర్ జిల్లా సమితి సమావేశం పి. సురేష్ అధ్యక్షతన జరిగింది. అనంతరం తెలంగాణ తొలి అమరవీరుడు దొడ్డి కొమరయ్య 78వ వర్ధంతిని పురస్కరించుకోని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బాల నరసింహ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశంలోని సహజసంపదను ఆదాని అంబానీ లాంటి కొద్దిమంది ఆర్థిక కుబేరులకు దోచి పెట్టేందుకు లాభాల బాటలో పయనిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ విధ్వంసానికి పూనుకుంటుదని అన్నారు. గత పది సంవత్సరాల కాలంలో బిజెపి ప్రభుత్వం ఆరు లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించిందని దేశవ్యాప్తంగా 61 బొగ్గు బ్లాక్‌లను వేలం వేసి 28 లక్షల 668 వేల కోట్లను జమ చేసుకోవడానికి వేలం వేస్తున్నారని అన్నారు. సింగరేణి సంస్థ ఉద్యోగాల కల్పనకు మారుపేరైందని అన్నారు. వేలం పాటలను రద్దు చేసి సింగరేణికే బొగ్గు బ్లాకులను కేటాయించాలని అన్నారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఇంత అన్యాయం జరుగుతున్న స్పందించక పోవడం అన్యాయమన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి. బాలకిషన్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి. సురేష్, డి. రాము, ఆర్. అల్వాల్ రెడ్డి, కౌన్సిల్ సభ్యులు ఎస్. శంకరహ్ నాయక్, యస్. చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లోని కార్యాలయాలను పరిశీలించిన కలెక్టర్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** జిల్లా కలెక్టరేట్‌లోని కార్యాలయాలను గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మొదటి, రెండో అంతస్తులోగల వివిధ ప్రభుత్వశాఖల కార్యాలయాలను జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ ఆకస్మికంగా తనిఖీచేశారు. ఒక్కొశాఖవారిగా అధికారులు, సిబ్బంది హాజరును పరిశీలించారు. నిర్దేశిత సమయానికి కొంతమంది ఉద్యోగులు హాజరవ్వటంతో అసహనం వ్యక్తంచేసి రేపటినుంచి అందరూ ఉద్యోగులు సమయానికి హాజరవ్వాలని ఆదేశించారు. లేకుంటే చర్యలు తప్పవని సూచించారు. అనధికారికంగా కార్యాలయాలకు సిబ్బంది గైర్హాజరైతే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. కార్యాలయాలతోపాటు పరిసరాలన్ని పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని హితవు పలికారు. అనంతరం కలెక్టరేట్‌లోని అన్నిశాఖలకు సంబంధించిన కార్యాలయాలను అక్కడ ఉన్న సదుపాయాలు, వసతులు, అవసరాలగురించి సంబంధితశాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈమేరకు ఆయాకార్యాలయాలకు అవసరమైన అన్నిరకాల సదుపాయాలు సమకూర్చడం జరుగుతుందని వారికి తగిన ఏర్పాట్లు చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు.

## మండలప్రత్యేకాధికారిగా ఖాజానజీర్‌ఆలీ

**ప్రజాపక్షం/వెల్దండ :** జడ్పిటిసి, ఎంపిటిసిల పదవీకాలం ముగియడంతో మండలానికి ప్రత్యేకాధికారిగా ఖాజానజీర్‌ఆలీని జిల్లా అధికారులు నియమించారు. దీంతో గురువారం ఎంపిడిఓ కార్యాలయంలో ఆయన మండల అధికారిగా బాధ్యతలను స్వీకరించారు. అంతకుముందు ఆయనకు ఎంపిడిఓ సత్యపాల్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రేవంత్‌రెడ్డిలు స్వాగతంపలికి శాలువాలతో సన్మానించారు. జిల్లాబిసివెల్ఫేర్ అధికారి ఈకార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ బుచ్చిరాములు, హేమంత్‌రెడ్డి, టైపిస్టు పద్మమ్మ పాల్గొన్నారు.

## క్రీడలు క్రమశిక్షణ నేర్పిస్తాయి : ఎమ్మెల్యే

**ప్రజాపక్షం / మహబూబ్ నగర్ ప్రతినిధి :** చిన్నారుల్లో క్రీడలు క్రమశిక్షణ నేర్పిస్తాయని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా క్రీడా మైదానంలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన 10 వ, అండర్ 19 తెలంగాణ బాట్మెంటన్ చాంపియన్ షిప్ 2024 పోటీలు ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై తెలంగాణ రాష్ట్ర జూనియర్ బాట్మెంటన్ చాంపియన్ 2024 పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మహబూబ్ నగర్ పట్టణం రాష్ట్ర స్థాయి పోటీలకు వేదిక కావడం ఆనందంగా ఉందని ఆయన చెప్పారు. మహబూబ్ నగర్ జిల్లా క్రీడలకు కేరాఫ్ గా నిలిచి, మహబూబ్ నగర్ జిల్లా నుంచి గొప్ప క్రీడాకారులను వెలికితీసి జాతికి పరిచయం చేయాలని ఆయన నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మ ణ్ యాదవ్, డి. శ్యామ్ సుందర్ గౌడ్, రవి కుమార్ , సాదుత్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## రైతాంగ తొలిపోరాట అమరుడు దొడ్డికొమురయ్య: కలెక్టర్ బదావత్‌సంతోష్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** తెలంగాణసాయుధ రైతాంగపోరాట తొలి అమరుడు దొడ్డికొమురయ్య వర్ధంతి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ జ్యోతిప్రజ్వలనచేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగాఆయన మాట్లాడుతూ తెలంగాణరైతాంగ సాయుధపోరాటంలో అమరుడైన తొలివ్యక్తిగా దొడ్డికొమురయ్య తెలంగాణ సమాజానికి సుపరిచితమని అతన్నిపోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని తెలంగాణ సమాజంప్రేరణ పొందిందని అన్నారు. బడుగుబలహీన వర్గాలు అతనిత్యాగాన్ని గుర్తించి ఆయన చూపినమార్గాలలో ముందుకెళ్లాలని అన్నారు. ప్రభుత్వంనుండి బడుగు బలహీనవర్గాలకు అన్నివిధాల సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పర్యావరణరహితం తయారుచేసిన చేతిసంచులను కలెక్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లామహిళా శిశుసంక్షేమశాఖ అధికారి రాజేశ్వరి, జిల్లా భూగర్భజలశాఖాధికారి రమాదేవి, జిల్లా మేదరసంఘం అధ్యక్షులు తిరుపతయ్య, బుడగజంగాల నాయకులు హుస్సేన్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఇసుక రీచ్‌లపై సరైన నివేదికలు ఇవ్వాలి

### జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** నాగర్‌కర్నూల్ జిల్లాలో గతంలో గుర్తించిన ఇసుకరీచ్‌లను జిల్లాస్థాయి కమిటిసభ్యులు మరోసారి సందర్శించి సరైన నివేదికలను ఇవ్వాలని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్స్‌హాల్లో కలెక్టర్ బదావత్‌సంతోష్ అధ్యక్షతన జరిగిన జిల్లాస్థాయి అధికారుల కమిటి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అవసరాలకై గతంలో గుర్తించిన ఇసుకరీచ్‌లను పునఃసందర్శించి పూర్తిస్థాయి నివేదికలను అందజేయాలని కలెక్టర్ సంబంధితశాఖల అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఉన్న రీచ్‌లతోపాటు తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రానున్న రెండురోజుల్లో మరోసారి సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. నీటిపారుదలశాఖకు సంబంధించి జరగవలసిన పనులకు ఇసుక కేటాయింపు చేయడంకొరకు ఏర్పాటుచేసిన సమావేశంలో సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు. నీటిపారుదలశాఖ మరమ్మత్తులకు సంబంధించి కావాల్సిన ఇసుక అందుబాటులో ఉందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈసమావేశంలో మైన్స్‌ఏడి రవీందర్, జిల్లాభూగర్భజల అధికారిణి రమాదేవి, ఆర్‌డబ్ల్యు ఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మురళి, డిపిఓకృష్ణ, టిఎస్ఎండిసి ప్రాజెక్టు ఆఫీసర్ రాంప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాములు పాల్గొన్నారు.




## ప్రతి ఎకరాకు రైతుభరోసా అందించాలి

### పిఏసిఎస్‌చైర్మన్ తలసాని జనార్దన్‌రెడ్డి

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** రైతుసాగుచేస్తున్న ప్రతి ఎకరాకు రైతుభరోసా అందించాలని పిఏసిఎస్ చైర్మన్ తలసానిజనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం తెలంగాణప్రభుత్వం ఆదేశాలమేరకు కల్వకుర్తి పిఏసిఎస్ పరిధిలోని కల్వకుర్తి ఊర్కొండ మండలాలలో సంఘం సభ్యులుగా ఉన్న రైతులతో అత్యవసర మహాజనసభ నిర్వహించడం జరిగింది. ఈసమావేశంలో రైతుభరోసాపై అభిప్రాయసేకరణ చేయడం జరిగింది. కార్యక్రమానికి 257మంది రైతులు హాజరై సాగుచేస్తున్న ప్రతి ఎకరాకు ఎటువంటినిబంధనలు లేకుండా రైతుభరోసా సకాలంలో అందించి రైతులను ఆదుకోవాలని, ప్రతి ఒక్క రైతుకు సాగు చేసే ప్రతి ఒక్క ఎకరాకి రైతుభరోసా అందించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేయడం జరిగింది. కార్యక్రమానికి పిఏసిఎస్ చైర్మన్ తలసాని జనార్దన్‌రెడ్డి అధ్యక్షత వహించడం జరిగింది. ముఖ్యఅతిథిగా డిసిఓ రఘునాథ్, మున్సిపల్‌చైర్మన్ ఎడ్మసత్యం, వైస్‌చైర్మన్ షాహిద్, పిఏసిఎస్‌వైస్‌చైర్మన్ సైదమ్మ, పిఏసిఎస్ సీఇఓ వెంకటరెడ్డి, ఏఓ శ్రీలత, ఏఈవోలు, కార్యాలయ సిబ్బంది, రైతుసోదరులు పాల్గొన్నారు.



## వీల్‌చైర్ పంపిణీ

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** మండలపరిధిలోని జిల్లెల్ల గ్రామంలో అంగవైకల్యంతో బాధపడుతున్న బాలునికి గ్రామమాజీసర్పంచ్ జిల్లెల్లరాములు వ్యక్తిగతంగా వీల్‌చైర్‌ను అందజేశారు. గ్రామానికిచెందిన కర్నాటికాశగౌడ్ కుమారుడు కర్నాటికుషాల్‌కుమార్‌గౌడ్‌కు నాలుగు సంవత్సరాల వయసులో మాటలతోపాటు అంగవైకల్యం వచ్చింది. అతనిని ఎక్కడికి తీసుకెళ్లాలన్న కుటుంబ సభ్యులు చాలా ఇబ్బందిపడుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీసర్పంచ్ జిల్లెల్లరాములు వ్యక్తిగతంగా అంగవైకల్యంతో బాధపడుతున్న కుషాల్ కుటుంబసభ్యులకు వీల్‌చైర్‌ను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ జిల్లాప్రధాన కార్యదర్శి రమేష్‌నాయక్, గ్రామహనుమాన్‌దేవాలయ చైర్మన్ కొమ్మగొని రవిగౌడ్, వైస్‌చైర్మన్ వీరెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి, కాంగ్రెస్‌పార్టీ గ్రామ అధ్యక్షుడు ముచ్చర్ల శ్రీకాంత్‌రెడ్డి, గ్రామనాయకులు ఎముకరవి, పాండురంగారెడ్డి, మల్లయ్య, రంగారెడ్డి, రామకృష్ణ, సుల్తాన్, బాలరాజు, నర్సింహ్మా, సత్యనారాయణ, రాము, శ్రీను, పవన్, గోపాల్, శ్రీశైలం, పరుషరాములు, వెంకటయ్య, శివ, కోటయ్య పాల్గొన్నారు.




## విద్యాసంస్థలబంద్ సంపూర్ణం

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** కేంద్రప్రభుత్వం నీట్‌పరీక్షను రద్దుచేసి మళ్లీ నిర్వహించాలని వామపక్ష విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో భారత్‌బంద్‌కు పిలుపునివ్వడంతో నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలకేంద్రంలో ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివశంకర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్‌కళాశాల, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల జడ్పిహెచ్‌ఎస్ పాఠశాలలో కేంద్రప్రభుత్వవైఖరికి నిరసనగా గురువారం ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలను బంద్‌చేసి సంపూర్ణమద్దతు పలకాలని కోరడంతో పాఠశాలను బంద్‌చేసి సంపూర్ణమద్దతు తెలిపారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి కురుమూర్తి, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించాలి

**ప్రజాపక్షం / పాన్‌గల్ :** ఆరు నెలలగా పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ వర్కర్స్ వేతనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని గురువారం పాన్‌గల్ మండల కేంద్రంలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ , వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా నుండి ప్రదర్శన నిర్వహించి ఎంపీడీఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు విడుదల చేసి గ్రామ పంచాయతీ సిబ్బందికి వేతనాలు ఇవ్వాలని లేని యెడల రానున్న వర్షం కాలం సీజన్‌లో గ్రామ పంచాయతీ సిబ్బంది మరో మారు ఆందోళన బాట పట్టక తప్పదని హెచ్చరించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయ సూపరిండెంటెంట్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ ఎల్లయ్య రంగస్వామి సురేష్ , బాలస్వామి, మద్దిలేటి, ఆది పాల్గొన్నారు.

### కాళేశ్వరం అక్రమాల కేసుల

## విచారణ వాయిదా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణాల్లో అక్రమాలు జరిగాయంటూ దాఖలైన పలు పిటిషన్లను గురువారం హైకోర్టు విచారించింది. మేడిగడ్డ ప్రాజెక్టు కుంగిపోవడంపై ఇప్పటికే విచారణ జరుగుతున్నందున ఈ వ్యవహారంలో ఉత్తర్వులు ఇవ్వలేమని చెప్పింది. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ, విజిలెన్స్ విచారణతోపాటు సుప్రీంకోర్టు రిటైర్డు జడ్జి జస్టిస్ పి సి ఘోష్ విచారణ జరుగుతోందని చెప్పింది. కె.ఎ పాల్, రామ్మోహన్‌రెడ్డి కోదండరాం,జడ్సన్ వేసిన పిటిషన్లను చీఫ్ జస్టిస్ ఆలోక్ ఆరాదే ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ విచారించింది. సిబిఐ దర్యాప్తు చేయాలనే పిల్‌లో రాష్ట్రాన్ని ప్రతివాదిగా చేయాలంది. విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ కేసుల్ల మధ్యంతర ఉత్తర్వుల జారీకి నిరాకరించింది. మతి ఇచ్చింది. వ్యాజ్యాలపై విచారణను 2 వారాలకు వాయిదా వేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది.

## టీచర్ల బదిలీలపై స్టేకు నిరాకరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోక్ష జరిగే టీచర్ల బదిలీలు, ప్రమోషన్లను నిలిపివేస్తూ స్టే ఆదేశాలు జారీకి హైకోర్టు నిరాకరించింది. బదిలీలు పదోన్నతులు చేయాలనే నిర్ణయంలో జోక్యం చేసుకుంటే దాని ప్రభావం విద్యాబోధనపై ఉంటుందని అభిప్రాయపడింది. ఇతర జిల్లాల నుంచి రంగారెడ్డి జిల్లాకు బదిలీలు చేస్తే తమ సీనియార్టీకి నష్టం జరుగుతుందని 40 మంది వేసిన వ్యాజ్యాలను విచారించిన సింగిల్ జడ్జి ఆ 40 పోస్టులను రిజర్వు చేయాలని ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఆదేశాలను రద్దు చేయాలంటూ ఇతర ఉపాధ్యాయులు వేసిన అప్పీల్ పిటిషన్లను జస్టిస్ అభినంద్ కుమార్ సావిలి జస్టిస్ ఎ. లక్ష్మీనారాయణ డివిజన్ బెంచ్ కొట్టేసింది. సింగిల్ జడ్జి ఆర్డర్‌లో జోక్యం చేసుకోమని, బదిలీలు, ప్రమోషన్ల వ్యవహారంపై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని చెప్పింది.

## గ్రూప్ పోటీ పరీక్ష అభ్యర్థుల సమస్యలు పరిష్కరించాలి

### యువజన, విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గ్రూప్ పోటీ పరీక్ష అభ్యర్థుల సమస్యలను పరిష్కరించాలని యువజన,విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ డిమాండ్ చేసింది. గ్రూప్స్‌లో1: 150 నిష్పత్తి అంశాన్ని ప్రభుత్వం పునరాలోచించాలని కోరింది.గ్రూప్ పోటీ పరీక్ష అభ్యర్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యువజన,విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యదర్శి నవీన్ నికోలస్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర,డి వై ఎఫ్ ఐ రాష్ట్ర అధ్యక్షుడు,ప్రధాన కార్యదర్శి కోటా రమేష్, ఆనగంటి వెంకటేష్, పివైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఎస్. ప్రదీప్, ఎస్.ఎఫ్.ఐ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి మూర్తి, నాగరాజు,ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మ ణ్,పిడిఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు పెద్దింటి రామకృష్ణ, పి. మహేష్‌పిడిఎస్‌యు జాతీయ నేత నాగేశ్వరరావు,ఏ ఐ డిఎస్ ఓ రాష్ట్ర అధ్యక్షుడు మల్లేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పదేళ్ల కాలంలో గత ప్రభుత్వం ఉద్యోగాలను భర్తీ చేయలేదని, దీంతో నిరుద్యోగుల సంఖ్య తీవ్ర స్థాయికి పెరిగిందని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన నోటిఫికేషన్లకు తక్కువ గడువు ఉండడంతో,ఎక్కువ పోస్టులతో నోటిఫికేషన్లు జారీ చేయాలని ఆందోళనలు వ్యక్తం చేస్తున్నార న్నారు. డిఎస్సి గడువును పొడిగించాలన్నారు. ఉద్యోగ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని, గురుకుల అభ్యర్థులకు న్యాయం చేయాలని, అన్ని శాఖలలో ఉన్న ఖాళీలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## బిఆర్ఎస్ ఎంఎల్‌ఎల సంగతేమిటి..?: కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:**కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత బిఆర్ఎస్ ఎంపి కె.కేశవరావు తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయడాన్ని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు స్వాగతించారు. ఇది వరకే కాంగ్రెస్‌లో చేరిన అరడజన్ మంది బిఆర్ఎస్ ఎంఎల్‌ఎల సంగతి ఏమిటని గురువారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో చేరిన బిఆర్ఎస్‌లో ఎంఎల్‌ఎల అంశంపైన కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం గురించి పదేపదే మాట్లాడి రాహుల్ గాంధీ రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టడంలో విఫలమయ్యారని ఆరోపించారు. బిఆర్ఎస్ ఎంఎల్‌ఎలను కాంగ్రెస్‌లో చేర్చుకుంటూనే, ఫిరాయింపులను అరికడతామంటూ చెబుతున్న రాహుల్ గాంధీ మాటలను దేశం ఎలా నమ్ముతుందని కెటిఆర్ ప్రశ్నించారు.

## నర్సంపేట వ్యవసాయ మార్కెట్‌కు కొత్త పాలకవర్గం

### చైర్మన్‌గా పి.శ్రీనివాస్, వైస్ ఛైర్మన్‌గా శాఖమూరి హరిబాబు నియామకం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వరంగల్ జిల్లాలోని నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీకి నూతన పాలక మండలిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీ ఛైర్మన్‌గా పి.శ్రీనివాస్, వైఎస్ ఛైర్మన్‌గా శాఖమూరి హరిబాబులతో పాటు . మరో 16 మంది సభ్యులతో పాలక మండలిని ఏర్పాటు చేసింది.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికయిన పాలకవర్గ సభ్యులకు వ్యవసాయశాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు శుభాకాంక్షలు తెలియజేశారు. నూతనంగా ఎన్నికైన పాలకవర్గం రైతుల కోసమే పనిచేయాలని, మార్కెట్లో రైతులకు ఎలాంటి సమస్యలు వచ్చిన త్వరగా స్పందించి పరిష్కారమార్గం చూపేలా కృషి చేయాలని ఈ సందర్భంగా మంత్రి కోరారు.

## అదనపు గదుల నిర్మాణాలు ప్రారంభం

**ప్రజాపక్షం / మానవపాడు :** గురువారం జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం మానవపాడు మండలం జల్లాపురం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అంచనా విలువ 20 లక్షలు జిల్లా పరిషత్ నిధుల నుండి నిర్మాణం జరిగిన అదనపు తరగతి గదులను ప్రారంభించిన జోగులాంబ గద్వాల జిల్లా పరిషత్ చైర్పర్సన్ గద్వాల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్చార్జి సరిత తిరుపతయ్య. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ చిన్న దేవుడు, మాజీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ వైస్ చైర్మన్‌కు సన్మానం

**ప్రజాపక్షం / జడ్చర్ల :** ఆలూరు జెడ్‌పిహెచ్ఎస్ ఉన్నత పాఠశాల, పిఎస్ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు, గ్రామస్తులు గురువారం జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కొడుగల్ యాదయ్య సన్మానించడం జరిగింది. పదవి కాలం 5 సం॥ పూర్తి అయిన సందర్భంగా సన్మానం చేయడం జరిగింది. అక్కడ విద్యార్థినీలతో పాటు మొక్కలు నాటడం జరిగింది, యాదయ్య మాట్లాడుతు సన్మానించినందులకు కృతజ్ఞతలు తెలియజేశారు. పాల్గొన్న టీచర్ల హాలిమ్, రాధిక, షరీఫ్, గ్రామ కార్యదర్శి రఘు, మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి, గ్రామ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు నర్సిములు, ఫీయిల్డ్ అసిస్టెంట్, నారాయణ, యాదయ్య, ఆంజనేయులు, కరాటే శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## సాగునీటి ప్రాజెక్టుల సమీక్షలో ఎమ్మెల్యేలు

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాసాగునీటి ప్రాజెక్టుల స్థితిగతులు, పనులపురోగతి, భూసేకరణ,నష్టపరిహారం చెల్లింపు తదితర అంశాలవారిగా డాక్టర్‌బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంత్రులు జూపల్లికృష్ణారావు, దామోదరరాజనర్సింహ్మా సమీక్ష నిర్వహించారు. ఈసమీక్ష సమావేశంలో ఎంపి డాక్టర్‌మల్లురవితోపాటు నాగర్‌కర్నూల్ జిల్లా ఎమ్మెల్యేలు కసిరెడ్డినారాయణరెడ్డి, రాజేష్‌రెడ్డి, వంశీకృష్ణ పాల్గొన్నారు.

## ప్రజాసేవ చేసే అవకాశం రావడం అదృష్టం



ప్రజాపక్షం/పూడూర్: ప్రజాప్రతినిధుల విరమణ పదవీకేతప్ప ప్రజాసేవకు కాదని మాజీ ఎపిపి మల్లేశం అన్నారు. మండల పరిషత్‌లో నిర్వహించిన సమావేశం, ప్రజాప్రతినిధుల వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు సేవ చేసే వారు శాశ్వతంగా నిలబడతారని, నాయకులుగా ఎదుగుతారనిఅన్నారు. గడచిన ఐదు సంవత్సరాలలో మండల అభివృద్ధికి ఎంతో కృషి సేశామని అన్నారు. ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలు పరిష్కారానికి ఎంతో కృషి చేశామని అన్నారు. జడ్పిటీసీ మేఘమాల, తహసిల్దార్ ఉమా రాణి, ఎంపీడీవో పాండు, మాజీ వైస్ ఎంపిపి మహిపాల్ రెడ్డి, ఎంపిటీసీలు, అధికారులు, నాయకులు పాల్గొనాన్నారు.

## బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి



ప్రజాపక్షః/మేడ్చల్ ప్రతినిధి: బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించే లక్ష్యంగా ఆపరేషన్ ముస్కాన్ 10 కార్యక్రమాన్ని మేడ్చల్ జిల్లాలోని కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించారు. 18 సంవత్సరాల వయస్సున్న బాలబాలికలతో పనులు చేయించుకోవటం చట్ట రీత్యా నేరమని, ఇలాంటి పనులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకొంటామన్నారు.

## ఆదర్శనీయుడు దొడ్డి కొమరయ్య

### భారత కమ్యునిస్టు పార్టీ కార్యదర్శి ఉమా మహేష్



ప్రజాపక్షం/జగద్గిరిగుట్ట: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి ఆద్యుడు విస్నూరు రాంచంద్రారెడ్డి నిరంకుశత్వానికి, నిజాం రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడి తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా వీరోచితమైన పోరాట పటిమను ముందుతారాలకు అందించిన సాయుధపోరాట యోధుడు తొలి అమరుడు దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతి సందర్భంగా గురువారం సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన వర్ధంతి సందర్భంగా వారికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉమా మహేష్ మాట్లాడుతూ తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య త్యాగం మరువలేనిది, వారి పోరాట పటిమను పునికి పోచుకొని భవిష్యత్ తరాలకు న్యాయమైన, స్వచ్ఛమైన, కుల మత రహిత సమసమాజాన్ని అందివ్వాలని పిలుపునిచ్చారు. నేడు రాజకీయ పార్టీలు అమరుల త్యాగాలను కేవలం ఒక కులానికో, లేదా మతానికి ఆపాదించడం సమంజసం కాదని వారు సమస్త ప్రజలకు భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం ప్రజల స్వతంత్రం కోసం వారి భవితకు ప్రాణత్యాగం చేశారని, నేడు మనం చేసే పని వల్ల వారి త్యాగాలకు అర్థం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తపరిచారు. నాయకులు ఉజ్జిని హరినాథ్ రావు, తోటపల్లి శంకర్, రాములు, సహదేవ్, కృష్ణోజీ, శ్రీనివాస్, యాదయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

**జగద్గిరిగుట్టలో..**



తెలంగాణ రైతాం గ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డీ కొమరయ్య స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారం కొరకు కేంద్ర ప్రభుత్వ కార్మిక మతోన్మాద విధానాలపై పోరాడాలని సిపిఎంకు త్బుల్లాపూర్ మం డల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. సిపిఎం కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో షాపూర్ నగర్ పార్టీ ఆఫీసులో జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పో రాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య 78 వర్ధం తి సందర్భంగా వారి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కీలుకాని లక్ష్మణ్ మాట్లాడుతూ 1946 లో తెలంగాణ ప్రాంతంలో వెట్టికి వ్యతిరేకంగా, భూమి, భుక్తి వెట్టి చాకిరి విముక్తి నిజాం నవాబు, దొరల భూస్వా మ్య వ్యవస్థకు వ్యతిరేకంగా సామాన్యులు ఆయుధం పట్టి ఎర్రజెండ నాయకత్వంలో పోరాటం చేసి చాకిలీ ఆయిలమ్మ భూమీ పై కన్నేసిన ఇసునూర్ రామ చంద్ర రెడ్డికి వ్యతిరేకంగా ప్రజలందరూ కదివెండి గ్రామంలో జరిపిన ర్యాలీలో దొరల భూస్వా మ్య గుండాలు జరిపిన కాల్పుల్లో మరణించిన వీ రుడు కొమరయ్య అన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు జి.వెంకన్న, పార్టీ మండల కమిటీ స భ్యులు ఆర్.స్వాతి ఎస్కే బురాన్, కే.శీను, కరుణాకర్‌సాధులు కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

**నాగారంలో...**



తెలంగాణ సాయిధ పోరాటంలో తొలి అమరుడు దొడ్డి కొమురయ్య ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. నాగారం మున్సిపాలిటీ పరిధిలో కురుమ సంఘం ఆధ్వర్యంలో సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్,ఎస్ఐ నాగరాజు,కౌన్సిలర్లు బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, అన్నంరాజు లావణ్యశ్రీనివాస్,సుమిత్రసురేష్,కౌకుట్ల మమత, మాజీ వార్డు సభ్యులు సాయినాథ్‌గౌడ్,కొండ జంగారెడ్డి,చీర సురేష్, రాంరెడ్డి,కురుమ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**మల్కాజిగిరిలో...**



భూమి కోసం భుక్తి కోసం తెలంగాణా విముక్తి కోసం పోరాడిన తెలంగాణా తొలి అమరుడు దొడ్డి కొమరయ్య కురుమ ఆదర్శనీయుడని తెలంగాణా కురుమ సంఘం కొనియాడింది.మల్కాజిగిరి చౌరాస్తాలో దొడ్డి కొమరయ్య 78వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణా కురుమ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వగ్గు చంద్రశేఖర్ రావు,జంట నగరాల ఉపాధ్యక్షుడు చేగూరి రామ్మోహన్ కురుమ, జోగు వెంకటేష్, మల్లేష్, కోశాధికారి మురళీకృష్ణ కురుమ, పేర్నె ఆంజనేయులు. జోగు శ్రీనివాస్, వినాయకనగర్ డివిజన్ అధ్యక్షుడు కానుగంటి పరంధాములు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# అటవీ సంపదను కాపాడుకోవాలి

### జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సుధీర్‌కుమార్



ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి : వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో వివిధ అంశాలపై జిల్లా ,మండల స్థాయి అధికారులు ,ఎంపిడిఓ లు తహసీల్దార్లతో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడుతూ వనమహోత్సవ కార్యక్రమంలో జిల్లాలో ఈ సంవత్సరం 40లక్షల 48వేల మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి సుధీర్‌కుమార్ అదేశించారు. ఎక్కడ కూడా అటవీ భూములు అన్యాక్రతం కావడానికి అవకాశం ఇవ్వకూడదని , ఎక్కడైన అన్యాక్రతం అవుతున్నట్లు దృష్టికి వస్తే తక్షణమే పోలీస్, రెవెన్యూ దృష్టికి తీసుకురావాలని, కొత్త గా అన్యాక్రాంతంపై కఠినంగా వ్యవహరించాలని, ఎఫ్ఆర్వోలు వారి పరిధిలో అటవీ భూముల సరిహద్దులను ఏర్పాటు చేయాలని, అటవీ భూముల పరిరక్షణలో అందరు కలిసి పని చేయాలనీ తెలిపారు. వనమహోత్సవం కింద నాటిన ప్రతి మొక్క బతకాలని మొక్కల నాటేందుకు సరైన స్థలాలను ఎంపిక చేయాలని అన్ని ప్రభుత్వ సంస్థలు, రహదారులకు, ఇరువైపులా తప్పనిసారిగా మొక్కలు నాటలని,ఏకార్యాలయం రహదరి మొక్కలు నాటకుండా వదలకుడదని, గుంతల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా స్థాయి కార్యక్రమంతో పాటు , నియోజకవర్గాలలో మొక్కలు నాటేందుకు సంసిద్ధంగా ఉండాలని సంబంధిత శాసన సభసభ్యలను మొక్కలు నాటే కార్యాక్రమానికి ఆహ్వానించాలని, జిల్లా అధికారులు నిర్దేశించిన లక్ష్యం ప్రకారం మొక్కలు నాటడాన్ని పూర్తి చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పిపిటీ ద్వారా అటవీ శాఖ చేసు పనులపై వివరించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్‌పి రవీందర్‌రెడ్డి , అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్, డిఆర్‌డిఓ శ్రీనివాస్ డిపిఓ జయసుద తదితరులు పాల్గోన్నారు.

## బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



ప్రజాపక్షం /కోట్‌పల్లి :భాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మండల విద్యాధికారి చంద్రప్ప అన్నారు. గురువారం మండలంలోని రాంపూర్ గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులకు విశ్వం పంతుల ఆధ్వర్యంలో వాసవి జ్యువెలర్స్ ప్రోపైటర్ బాలరాజు వికారాబాద్ వారు నోట్ సుస్తకాలను విద్యాధికారి చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... విద్యార్థులు భాగా చదువుకుని తల్లిదండ్రులకు. పాఠశాలకు మంచి పేరును తేవాలని అన్నారు. రాంపూర్ పాఠశాల విధ్యార్థులకు గత 13 సంవత్సరాలుగా వాసవి జ్యువెలర్స్ వారు ఉచితంగా నోట్ పుస్తకాలను అందించడం చాలా సంతోషమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మొయినోద్దిన్, ఉపాధ్యాయులు విశ్వంపతులు, నర్సింలు (సీఆర్పి), విద్యార్థులు ఉన్నారు.

## మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డిపై దాడి యత్నం

### కాంగ్రెస్, బిఆర్ఎస్‌ల మధ్య ఘర్షణ, తోపులాటలు

### ఆరు మాసాలుగా నిలిచి ప్రారంభమైన రోడ్డు పనులే కారణం



ప్రజాపక్షం/మల్కాజిగిరి: మౌలాలి డివిజన్ ప్రాంతంలోని ఆర్టీసీ కాలనీలో తిరిగి ప్రారంభమైన రోడ్డు పనులను పర్యవేక్షించేందుకు వచ్చిన మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డిపై కాంగ్రెస్ వర్గీయులు దాడికి పాల్పడ్డారు. దీంతో ఎమ్మెల్యే వెంట ఉన్న బిఆర్ఎస్ శ్రేణులు అడ్డుకోవటంతో రెండు పార్టీలకు చెందిన వర్గీయుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. పరిస్థితులు సద్దుమణిగే దాకా ఎమ్మెల్యేను ఆ స్థలం నుండి పక్కకు పంపించారు. గురువారం జరిగిన ఈ సంఘటన వివరాల్లోకి వెళితే.... మౌలాలి డివిజన్‌లోని హనుమాన్‌నగర్ ఆర్టీసీ కాలనీలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు అప్పటి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు చొరవతో ఆరు మాసాల క్రితం రోడ్డు పనులు ప్రారంభమై వివిధ కారణాలతో అంసపూర్తిగా నిలిచి పోయింది. ఈ రహదారి పనులు ఆగిపోయి గుంతలు ఏర్పడటం,చిన్న పాటి వర్షానికే గుంతల్లో నీరు నిలుస్తుండటం వల్ల నిత్యం ఈ ప్రాంతం మీదుగా వెళ్లే పాదచారులు, వాహనదారులు నానా ఇబ్బందులకు గురి కావటంతో పాటు ప్రమాద పరిస్థితులు నెలకొన్నాయి. నిలిచి పోయిన పనులు వెంటనే పూర్తి చేయాలంటూ జిహెచ్ఎంసి అధికారులతో పాటు బిజెపికి చెందిన స్థానిక కార్పొరేటర్ గున్నాల సునీత, ఇటీవలి ఎన్నికల్లో బిఆర్ఎస్ పక్షాన మల్కాజిగిరి ఎమ్మెల్యేగా గెలుపొందిన మర్రి రాజశేఖరరెడ్డి, కాంగ్రెస్ పార్టీకి చెందిన స్థానిక మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావులను స్థానికులు తరచు కలుస్తూ వినతిపత్రాలిస్తూ మొరపెట్టుకొన్నా ఫలితం లేక పోయింది. తమ ప్రాంతానికి పర్యటనకు వచ్చిన ప్రజా ప్రతినిధులను సైతం ఇదే విషయమై నిలదీసినా ఎలాంటి స్పందనా లభించక పోయింది. దీంతో విసుగెత్తిన స్థానికులు గత నెల 24న జిహెచ్ఎంసి మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో డిప్యూటి కమిషనర్ రాజును కల్సి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసారు. వారం రోజుల క్రితం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును కల్సిన స్థానికులు అక్కడ ఉండగానే జిహెచ్ఎంసి అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే ఆగి పోయిన పనులు పూర్తి చేయాలని కోరారు. ఈ క్రమంలో దీర్ఘకాలంగా నిలిచి పోయిన హనుమాన్‌నగర్‌ఆర్టీసీ కాలనీ రహదారి పనులు నాలుగు రోజుల క్రితం జిహెచ్ఎంసి అధికారులు ప్రారంభించి వేగంగా కొనసాగిస్తున్నారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖరరెడ్డి బిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో గురువారం తిరిగి కొనసాగుతున్న రోడ్డు పనులు పర్యవేక్షిస్తూ అధికారులతో మాట్లాడుతున్న సమయంలో అక్కడికి పెద్ద సంఖ్యలో స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు చేరుకొన్నారు. తాము గతంలో అనేక సార్లు వచ్చి కలిసినా పట్టించుకోకుండా తమ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి చూపించిన చొరవ కారణంగా తిరిగి ప్రారంభం కాగానే ఎలా వస్తావని నిలదీసారు. దీంతో అక్కడ ఉన్న బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ శ్రేణుల మధ్య తోపులాటలు, వాగ్వివాదాలు పరస్పర దూషణలతో ఒక్క సారిగా ఘర్షణ వాతావరణం నెలకొంది. ఎమ్మెల్యేపై సైతం దాడి యత్నాన్ని ఆపేందుకు బిఆర్ఎస్ శ్రేణులు సద్దు మణిగే వరకు పక్కకు తీసుకొని వెళ్లారు. ఎమ్మెల్యే గన్‌మాన్, అక్కడే ఉన్న ఓ కానిస్టేబుల్ ఇరు వర్గాలకు నచ్చ చెప్పటంతో కాసేపటికి పరిస్థితులు సద్దుమణిగాయి.

## అన్విత గ్రూప్ రూ.2 వేల కోట్ల భారీ గృహ సముదాయ ప్రాజెక్టు

### హైదరాబాద్ సమీపంలోని కొల్లూరు వద్ద 'ఇవానా' పేరిట ఏర్పాటు

### 12.9 ఎకరాల విస్తీర్ణంలో రెండు దశల్లో 1,850 యూనిట్ల నిర్మాణం

### మీడియాతో అన్విత గ్రూప్ సిఎండి అచ్యుతరావు బొప్పన



ప్రజాపక్షం / హైదరాబాద్ : రియల్టీ రంగంలో ఉన్నఅన్విత గ్రూప్ రూ.2,000 కోట్ల విలువైన భారీ ప్రాజెక్టు చేపట్టింది. హైదరాబాద్ సమీపంలోని కొల్లూరు వద్ద ఇవానా పేరుతో భారీ గృహ నిర్మాణ ప్రాజెక్టును నిర్మిస్తోంది. సుమారు 12.9 ఎకరాల్లో రెండు దశల్లో 1,850 ఫ్లాట్లను ఏర్పాటు చేస్తోంది. మొదటి దశలో భాగంగా 3.5 ఎకరాల విస్తీర్ణంలో 15 అంతస్తుల్లో 2 టవర్లలో 450 ఫ్లాట్ల నిర్మాణం పూర్తి కావస్తోంది. వీటిని 2024 డిసెంబర్‌లోగా కొనుగోలుదార్లకు అప్పగిస్తారు. ఇక రెండవ దశలో 9.25 ఎకరాల్లో 36 అంతస్తుల్లో 4 టవర్లను నిర్మించనుంది. ఇందులో భాగంగా 1,400 ఫ్లాట్లను 2027లో కస్టమర్లకు అందజేస్తామని అన్విత గ్రూప్ సిఎండి అచ్యుతరావు బొప్పన గురువారం ఇక్కడ మీడియాకు తెలిపారు. ప్రారంభ ఆఫర్ కింద చదరపు అడుగు రూ.6,500లకు విక్రయిస్తున్నట్టు వెల్లడించారు. నిర్మాణ వ్యయం తొలి దశ ప్రాజెక్టుకు రూ.380 కోట్లు, రెండవ దశకు రూ. 1,600 కోట్లకుపైగా అవుతుందని అంచనాగా చెప్పారు. ఒకటి నుంచి 34వ అంతస్తు వరకు 1,360 2,580 చదరపు అడుగుల విస్తీర్ణంలో 2 3 పడక గదులను నిర్మిస్తారు. కాగా 3536 అంతస్తుల్లో స్కై విల్లాలు 4 బెడ్రూంలతో 2,9005,070 చదరపు అడుగుల విస్తీర్ణంలో విలాసవంతంగా రానున్నాయి. కారు పార్కింగ్ స్థలం సైతం మొదట్లోనే రిజిస్ట్రేషన్ సహా అప్పగిస్తారు. ఇవానా మొదటి దశలో 8 లక్షలు, రెండవ దశలో 28 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణాలు ఉంటాయని కంపెనీ డైరెక్టర్ అనూప్ బొప్పన చెప్పారు. అన్ని ఆదాయ వర్గాలకు అనువుగా ఇవానా గృహ సముదాయాన్ని అన్ని ఆదాయ వర్గాలకు అనువుగా నిర్మిస్తున్నట్టు అచ్యుతరావు తెలిపారు. తాను సైతం మధ్యతరగతి నుంచి వచ్చానని చెప్పారు. ఒక లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో రెండు క్లబ్ హౌస్‌లు నిర్మిస్తున్నామని.. ఇవి కాక టవర్లపైన ఒక లక్ష చదరపు అడుగుల్లో గార్డెన్, స్విమ్మింగ్ పూల్‌తో పాటు 3బేస్‌మెంట్ పార్కింగ్‌ల తరువాత ఒక ఫ్లోర్ మొత్తాన్ని చిన్నారులు, పెద్దల వ్యాహ్యాళికి అనువుగా కేటాయించామని చెప్పారు. వాకింగ్, సైక్లింగ్ ట్రాక్స్ ఉంటాయన్నారు.

## విద్యుత్ ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి

### కేంద్ర విద్యుత్ శాఖ మంత్రికి ఆల్ ఇండియా పవర్ ఇంజనీర్ల వినతి

### ప్రైవేటు చేసిన వివిధ రాష్ట్రాల పరిస్థితులు వివరణ



ప్రజాపక్షం / హైదరాబాద్ : ఆదానీ గ్రూప్‌కు విద్యుత్ బాధ్యతలను అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయానికి వచ్చిన క్రమంలో ఆల్ ఇండియా పవర్ ఇంజనీర్స్ ఫెడరేషన్ కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనహోర్ లాల్ ఖట్టర్‌ను గురువారం ఢిల్లీలో కలుసుకుని రాష్ట్రంలో విద్యుత్‌శాఖ ప్రైవేటీకరణను ఉపసంహరించాలని విజ్ఞప్తి చేసింది. విద్యుత్ రంగం, వినియోగదారుల ప్రయోజనాల దృష్ట్యా విద్యుత్ (సవరణ) బిల్లును తీసుకురాకూడదని ప్రైవేటీకరణ విఫల ప్రయోగాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ఫెడరేషన్ చైర్మన్ శైలేంద్ర దుబే, సెక్రటరీ జనరల్ పి రత్నాకర్ రావు, చీఫ్ ప్యాట్రన్ పదమ్‌జిత్ సింగ్, అజయ్‌పాల్ సింగ్ అత్వాల్, యశ్‌పాల్ శర్మ, ప్రశాంత్ చతుర్వేది ఎకె జైన్ తదితరులతో కూడిన ఫెడరేషన్ (AIPEF) ప్రతినిధి బృందం ఢిల్లీలో కేంద్ర విద్యుత్ శాఖ మంత్రిని కలిసి ఆయనకు మెమోరాండం సమర్పించింది. ఆమెమోరాండం ద్వారా ఇంధన రంగం ,విద్యుత్ వినియోగదారుల ప్రయోజనాల దృష్ట్యా విద్యుత్ (సవరణ) బిల్లు ప్రతిపాదనను ఇప్పుడే తీసుకురావద్దని, ప్రైవేటీకరణ, పట్టణ పంపిణీ ఫ్రాంచైజీ యొక్క విఫల ప్రయోగాన్ని ఉపసంహరించుకోవాలని ఫెడరేషన్ డిమాండ్ చేసింది. నిరంతరంగా పెరుగుతున్న బొగ్గు ఉత్పత్తిని దృష్టిలో ఉంచుకుని, బొగ్గును తప్పనిసరిగా దిగుమతి చేసుకోవాలని రాష్ట్రాల విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు ఇచ్చిన ఆదేశాలను కూడా ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేసింది. ఇంధన రంగాన్ని పటిష్టంగా, స్వావలంబనగా మార్చేందుకు, నిపుణులైన పవర్ ఇంజనీర్లను దేశంలోని అన్ని పవర్ కార్పొరేషన్‌లలో టాప్ మేనేజ్‌మెంట్ స్థానాల్లో నియమించాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేసింది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బీహార్ కొన్ని ఇతర ప్రావిన్సులలో అర్బన్ డిస్ట్రిబ్యూషన్ ఫ్రాంచైజీని ప్రయోగించారని అక్కడ సహజంగానే ప్రైవేట్ రంగ సంస్థలు లాభదాయకమైన పారిశ్రామిక వాణిజ్య వినియోగదారులకు విద్యుత్‌ను అందించడానికి ప్రభుత్వ పంపిణీ సంస్థ నెట్‌వర్క్‌ను ఉపయోగిస్తాయని అలా చేస్తే వినియోగదారుల పరిస్థితి మరింత దిగజారిపోతుందని ఆందోళన వ్యక్తం చేశాయి. ప్రైవేటు సంస్థలు లాభాపేక్షతోనే ముందుకు వెళతాయి తప్పితే ప్రభుత్వ రంగం ఆర్థిక పరిస్థితి, విద్యుత్ రంగం, పేద గృహ వినియోగదారులకు, రైతుల ప్రయోజనాలు వారికి పట్టనే పట్టవని తెలిపారు. అదేవిధంగా ఒరిస్సా రాష్ట్రంలో మొత్తం విద్యుత్ పంపిణీ రంగం ప్రైవేటీకరించబడిందని, ఈ ప్రయోగం కూడా ఘోరంగా విఫలమైందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. అందువలన ప్రైవేటీకరణ, పట్టణ పంపిణీ ఫ్రాంచైజీ యొక్క విఫలమైన ప్రయోగాలను తెలంగాణ రాష్ట్రంలో ఉపసంహరించుకోవాలని కోరుతున్నామన్నారు. ప్రభుత్వం పవర్ ఇంజనీర్ల ఏకైక లక్ష్యం సామాన్య ప్రజలకు చౌకగా విద్యుత్ అందించడమే అని ఫెడరేషన్ నేతలు వెల్లడించారు. ఇది కాకుండా, ప్రైవేట్ సంస్థలతో 25 సంవత్సరాల ఖరీదైన విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను పున ః సమీక్షించాల్సిన సమయం ఆసన్నమైందని, అటువంటి ఖరీదైన విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను సమీక్షించడానికి రాష్ట్రాల విద్యుత్ పంపిణీ సంస్థలను అనుమతించాలని వారు కోరారు. పవర్ రంగాన్ని పటిష్టంగా, స్వావలంబనగా మార్చే ప్రక్రియలో కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఎప్పటికప్పుడు తమ పవర్ ఇంజనీర్స్ ఫెడరేషన్‌ను, విద్యుత్ వినియోగదారులు, సంస్థలతో సంప్రదింపులు జరుపుతుందని ఫెడరేషన్ ఆశాభావం వ్యక్తం చేస్తున్నామన్నారు.

## మచ్చలేని నాయకుడు చంద్రబాబు

### నేడు హైదరాబాద్‌కు బాబు

### స్వాగతం పలికేందుకు తమ్ముళ్ల సన్నహాలు

### విజయవంతం చేయాలని కోరిన అరవింద్ కుమార్ గౌడ్



ప్రజాపక్షం/హైదరాబాద్ : సుదీర్ఘమైన 40 సంవత్సరాల రాజకీయ చరిత్రలో మచ్చలేని నాయకుడు నారా చంద్రబాబు నాయుడు అని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు ఎం.అరవింద్ కుమార్ గౌడ్ అన్నారు. దోమల్‌గూడ నగర పార్టీ కార్యాలయంలో అరవింద్ కుమార్ గౌడ్ అందుబాటులో ఉన్న నాయకులు, కార్యకర్తలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. నాలుగవసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి, హైదరాబాద్‌కు వస్తున్న చంద్రబాబు నాయుడుకు భారీ ఎత్తున స్వాగతం పలికేందుకు నాయకులు, కార్యకర్తలతో ఆయన చర్చించారు. అనంతరం అరవింద్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ శుక్రవారం సాయంత్ర 5 గంటలకు బేగంపేట్ విమానాశ్రయంలో చంద్రబాబు నాయుడుకు భారీ ఎత్తున స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. బేగంపేట నుండి జూబ్లీహిల్స్‌లోని చంద్ర బాబు నివాసం వరకు ర్యాలీగా వెళ్లుతామని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలు ప్రజలు, ఐటి ఉద్యోగులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరార. టిడిపి సికింద్రాబాద్ పార్లమెంటు అధ్యక్షులు పి.సాయిబాబా, ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజు గౌడ్, ఎస్ ప్రకాష్, పెద్దోజు రవీంద్రాచారు, మేడిపల్లి శ్యామ్ సుందర్, వంశీకృష్ణ, గండికోట విజయ్ కుమార్, ఎం.నర్సింగ్ రావు, శ్రీనివాస్ గౌడ్, బాలాజి గోస్వామి, జోగింధర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## శాకాంబరి నవరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



ప్రజాపక్షం/హైదరాబాద్: వరంగల్ జిల్లా భద్రకాళి దేవాలయంలో ఈ నెల 6 నుండి 21 వరకు నిర్వహించే శాకంబరి నవరాత్రి ఉత్సవాల పోస్టర్‌ను అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సచివాలయంలో గురువారం ఆవిష్కరించారు ఆలయ ఈవో శేషు భారత, ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు, అర్చకులు రామయ్య, సూపరింటెండెంట్ విజయ్ ఈ మేరకు మంత్రిని ఉత్సవాలకు హాజరుకావాలని ఆహ్వానం పలికారు. అలాగే వరంగల్ జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారిని కలిసి ఉత్సవాలకు ఆహ్వానించారు. ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహించాలని, ఈ దిశగా సంపూర్ణ సహకారాన్నిఅందిస్తామనిమంత్రి సురేఖ ఆలయఈవో, అర్చకులకు సూచించారు.

## నాటుసారాపై ఉక్కుపాదాం..

### గతేడాది నాటుసార మొత్తం కేసులు 1182

### నెలలోనే రికార్డు స్థాయిలో 1901 కేసులు

### ప్రత్యేక దాడుల్లో భారీగా పట్టుబ డుతున్న డ్రగ్స్



ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా గత ఏడాది నాటుసార కేసులు 1182 నమోదు కాగా గత నెల రోజుల వ్యవధిలోనే రికార్డు స్థాయిలో 1901 కేసులు నమోదు కావడం ఎక్సైజ్ అధికారుల పనితీరుకు నిదర్శనంగా మారింది. డ్రగ్స్, గంజాయిపై సిఎం రేవంత్‌రెడ్డి చాలా సీరియస్‌గా ఉన్నారు. డ్రగ్స్, గంజాయి రహిత తెలంగాణ రాష్ట్రంగా చేయాలని అధికారులకు సిఎం పిలుపు నివ్వడంతో ఎక్సైజ్ పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు దాడులను విస్తృతం చేశారు.

**డ్రగ్స్‌పై గట్టి నిఘా ..**

హైదారాబాద్తోపాటు తెలంగాణలో ఉమ్మడి జి ల్లా కేంద్రాల్లో డ్రగ్స్ వినియోగ వాసనలు కనిపించినట్లు అబ్కారీశాఖ గుర్తించింది. ఈ మేరకు తెలంగాణ అబ్కారీశాఖ కమిషనర్ ఇ.శ్రీధర్, ఎక్సై జ్ ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విబి కమలాసన్‌రెడ్డి డ్రగ్స్‌పై ఉక్కు పాదాం మోపడానికి ప్రత్యేక బృం దాలను ఏర్పాటు చేశారు. 960గ్రాముల గం జాయి చాక్లెట్లు, 2.26 గ్రాముల ఎండిఎంఎ, 10 ఎల్ఎస్డీ బ్లాట్స్ను పట్టుకున్నారు. 2024లో 579.4 కేజీల గంజాయి, 80 గ్రాములు హషిష్ అయిల్, 1.83 కేజీల గంజాయి చాక్లెట్లు, 1 గ్రామం ఓజీ కుష్, 12. 98 కేజీల పప్పి హష్కీ, 0.345 గ్రా ముల ఒపియం, 60.23 గ్రాముల ఎండిఎంఎ, 25 ఎస్ఎస్డి బ్లాట్స్, 55.3 కేజీల అల్ప్రోజోలంను పట్టుకున్నారు. ఒకటిన్నర సంవత్సరంలో 181 కేసులు నమోదు చేసి 302 మందిపై కేసులు నమోదు చేశారు.

**నాటుసారాపై ఉక్కుపాదాం..**

జూన్, జూలై, ఆగస్టు మూడు నెలల్లో 26 ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌ల పరిధిలో స్పెషల్ డ్రైవ్లో భాగంగా నాటుసారాను తెలంగాణలో లేకుండా చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతుంది. గత ఏడాది 1182 కేసులను నాటుసారాపై నమోదు చేస్తే.. ఒక్క నెల్లలోనే 1901 కేసులు నమోదు చేసి రికార్డు సృష్టించారు.

**నాన్ డ్యూటి లిక్కర్ పెయి ప్రత్యేక దృష్టి..**

చిన్న పంక్షన్లను, భర్తడేలు, మారేజ్ డేలు, ఇలా అనేక పంక్షన్ల కోసం పలువురు మద్యాం వినియోగానికి అబ్కారీ శాఖను నుంచి అనుమతులు తీసుకుంటారు. ఇలా చేయడం వల్ల తెలంగాణ మద్యం అమ్మకాలపై ఎఫెక్ట్ పడుతుందనే అలోచనలతో ఈవెంట్లపై నిఘా పెంచారు. పలుచోట్ల దాడులు నిర్వహించిన క్రమంలో 78 కేసులు నమోదు చేసి 1845 లీటర్ల మద్యాన్ని పట్టుకున్నారు. 36 మందిని అ దుపులోకి తీసుకున్నారు. ఎన్‌డిపిఎస్ తోపాటుఅనుమతులు లేకుండా అమ్మకాలు జరుపుతున్న మద్యాన్ని పట్టుకొని కేసులు నమోదు చేశారు. 2937 లీటర్ల మద్యాం, 3334లీటర్ల బీరులపై కేసులు నమో దు చేశారు.

**ప్రత్యేక బృందాలతో దాడులు..**

**ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విబి కమలాసన్రెడ్డి**

తెలంగాణలో ఆగస్టు 31 నాటికి నాటుసారాను పూర్తిగా తుది ముట్టిస్తాం. డ్రగ్స్ ఉక్కుపాదాం మోపుతూ రవాణ, వినియోగంపై గట్టి నిఘ పెట్టాం. మంచి పతిలితాల కోసం ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను ఏర్పాటు చేశాం. ఐడి లిక్కర్, డ్రగ్స్ పూర్తి గా తుదిముట్టించడమే లక్ష్యంగా దాడులు నిర్వహిస్తున్నాం. పట్టుబ డిన కేసుల్లో నిందితులకు శిక్షలు పడడానికి ఎక్సైజ్ యంత్రాంగానికి ప్రత్యేక శిక్షణ కూడ ఇస్తున్నాం.

క్రీడ

# జగజ్జేతలకు ఘన సత్కారం




## రూ.125 కోట్ల ప్రైజ్ మనీ అందజేత

**ముంబయి** : టీ20 ప్రపంచకప్ 2024 సాధించి విశ్వవేదికపై భారత కీర్తి పతాకాన్ని ఎగురవేసిన టీమ్ ఇండియాను బిసిసిఐ ఘనంగా సన్మానించింది. ముందుగా చెప్పినట్టే రూ.125 కోట్ల నగదు బహుమతిని చెక్ రూపంలో అందజేసింది. అంతకుముందు ముంబయి నగరంలో భారీ ర్యాలీ ప్రదర్శన నిర్వహించింది. నారీమన్ పాయింట్ నుంచి వాంఖడె స్టేడియం వరకు ఈ పరేడ్ ఉత్సాహబరితంగా సాగింది. లక్షలాదిగా అభిమానులు తరలివచ్చారు. అలా అభిమానుల సందడితో ఆ ప్రాంతం జనసంద్రాన్ని తలపించింది. టీమ్ఇండియా ఆటగాళ్లు కూడా ఫ్యాన్స్ మధ్యలోని నుంచి వరల్డ్ కప్ ట్రోఫీని పట్టుకుని అభిమానులకు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. ఓపెన్ టాప్ బస్సులోంచి రోహిత్ శర్మ, కోహ్లీ, ఇతర ప్లేయర్స్ అభిమానులకు అభివాదం చేస్తూ ఫుల్ జోష్ నింపారు. ఈ వేడుకల్లో బిసిసిఐ సెక్రటరీ జై షా, వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా కూడా పాల్గొన్నారు.

**హార్దిక్, సూర్యపై ప్రశంసలు** : భారత కెప్టెన్ రోహిత్ శర్మ టి20 ప్రపంచ కప్ 2024 ఫైనల్‌లోని కొన్ని అద్భుతమైన క్షణాలను గుర్తుచేసుకున్నాడు. సూర్య కుమార్ యాదవ్ పట్టిన అద్భుతమైన బౌండరీ క్యాచ్‌తో పాటు 20వ ఓవర్‌ను అద్భుతంగా బౌలింగ్ చేసినందుకు హార్దిక్‌ను ప్రశంసించాడు.

**రోహిత్ ఫోన్ కాల్ :** భారత ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్ జట్టు నైపుణ్యాలపై ప్రశంసలు కురిపించాడు. 2023 వన్డే ప్రపంచ కప్ తర్వాత భారత జట్టుకు కోచ్‌గా కొనసాగాలని భారత కెప్టెన్ రోహిత్ శర్మ చేసిన ఫోన్ కాల్‌ను గుర్తుచేసుకున్నాడు. అభిమానుల ప్రేమను తాను కోల్పోబోతున్నానని అన్నాడు.

**రోహిత్‌ను ఇలా తొలిసారి చూశాను :** '15 ఏళ్లలో రోహిత్ ఇంతలా ఎమోషన్ అవ్వడం నేను చూడటం ఇదే తొలిసారి. ఆ రాత్రి (2011 ప్రపంచకప్ విజయం తర్వాత) ఏడ్చిన సీనియర్ల ఎమోషన్లతో నేను కనెక్ట్ కాలేకపోయాను. కానీ ఇప్పుడు అయ్యాను' అని రోహిత్ గురించి కోహ్లీ మాట్లాడాడు.

**రిటైర్మెంట్‌కు చాలాకాలం ఉంది** : ప్రపంచ కప్ గెలవడం ఒక ప్రత్యేకమైన క్షణం అని బుమ్రా అన్నాడు. ఈ రోజు తాను చూసింది ఇంతకు ముందు ఎప్పుడూ చూడలేదని పేర్కొన్నాడు. అలానే తాను ఆటకు గుడ్ బై చెప్పడానికి ఇంకా చాలా కాలం సమయం ఉందని పేర్కొన్నాడు.

**రోహిత్, కోహ్లీ డ్యాన్స్ :** వాంఖడె స్టేడియంలో బిసిసిఐ భారత జట్టుకు సన్మాన కార్యక్రమం నిర్వహించింది. 125 కోట్ల రూపాయల నగదు బహుమతిని చెక్ రూపంలో అందజేసింది. అయితే ఈ వేడుకకు ముందు భారత ఆటగాళ్లు స్టేడియంలోకి ఎంటర్ అవ్వగానే డోలు, పాటలకు చిందులేశారు. కాగా, వాంఖడె స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమానికి ఉచిత ప్రవేశం కల్పించడంతో అన్ని స్టాండ్స్ అభిమానులతో కిటకిటలాడాయి.

### జనసునామీ

విశ్వవిజేతలకు ఘన స్వాగతం పలికేందుకు మెరైన్ రోడ్‌కు మధ్యాహ్నం నుంచే అభిమానులకు భారీ సంఖ్యలో లక్షలాది మంది తరలివచ్చారు. దీంతో ఆ రోడ్డు మొత్తం కిక్కిరిసిపోయింది. ఇంకా చెప్పాలంటే ముంబయి సముద్రతీరం పోటెత్తింది. అభిమానులు మువ్వన్నెల జెండాలను ప్రదర్శిస్తూ సందడి చేశారు. జై భారత్ నినాదాలతో ఆ ప్రాంతాన్ని హోరెత్తించారు. పోలీసులు కూడా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ర్యాలీ జరిగే ప్రాంతమంతా పోలీసు యంత్రాంగం భద్రతను కట్టుదిట్టం చేసింది.





## 'సూసేకి' పార్టీకి లేటుగా ఆషికా

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా తెరకెక్కుతున్న 'పుష్పది రూల్' మూవీ కోసం ప్రేక్షకులు ఏ రేంజ్ లో వెయిట్ చేస్తున్నారో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. పుష్ప1 మూవీ క్రియేట్ చేసిన సెన్సేషన్ తో ఇప్పుడు అందరి చూపు పుష్ప2పై ఉంది. ఇక ఈ సినిమా నుండి రిలీజ్ అయిన పోస్టర్స్, టీజర్, సాంగ్స్ కు ప్రేక్షకులు ఫిదా అవుతున్నారు. రీసెంట్ గా కపుల్ సాంగ్ అంటూ 'సూసేకి' సాంగ్ ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ పాటకు యావత్ ఇండియాతో పాటు ప్రపంచంలోని అభిమానులు డ్యాన్స్ చేస్తున్నారు. ఈ పాటలో అల్లు అర్జున్, రష్మికలు కలిసి వేసిన స్టెప్పులకు సాలిడ్ రెస్పాన్స్ లభించింది. ఇక ఈ పాట సోషల్ మీడియాలో తుఫాన్ క్రియేట్ చేస్తోంది. కామన్ ఆడియెన్స్ నుంచి సెలబ్రిటీల వరకు ఈ పాట ట్యూన్ కి స్టెప్పులు వేస్తూ వీడియోలు తీస్తున్నారు. తాజాగా ఈ జాబితాలో అందాల భామ ఆషికా రంగనాథ్ చేరింది. 'సూసేకి' పాటకి స్టెప్పులు వేసే పార్టీకి తాను కొంచెం లేటుగా వచ్చానంటూ ఈ పాటకు సూపర్ స్టెప్పులు వేసింది. తన ఇన్స్టా అకౌంట్ లో ఓ వీడియోను పోస్ట్ చేసింది ఈ బ్యూటీ. ఇక ఈ 'సూసేకి' పాటను శ్రేయా ఘోషల్ పాడగా, దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించారు.

## 'మిస్టర్ బచ్చన్' సాలిడ్ అప్డేట్..



మాస్ రాజా రవితేజ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'మిస్టర్ బచ్చన్' ఇప్పటికే శరవేగ ంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఈ సినిమాను దర్శకుడు హరీష్ శంకర్ తెరకెక్కిస్తుండటంతో ఈ సినిమాను ఎప్పుడెప్పుడు చూద్దామా అని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కాగా, ఈ సినిమా నుండి మేకర్స్ తాజాగా ఓ అప్డేట్ ఇచ్చారు. ఈ సినిమాలోని ఫస్ట్ సింగిల్ సాంగ్ అనౌన్స్ మెంట్ ను త్వరలోనే చేయబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. మిస్టర్ బచ్చన్ మ్యూజికల్ ఫెస్టివల్ మొదలైందని ఓ రొమాంటిక్ సాంగ్ లోని ట్యూన్ తో మేకర్స్ తాజాగా అనౌన్స్ చేశారు. ఈ సినిమాకు మిక్కీ జే మేయర్ సంగీతాన్ని అందిస్తున్నాడు. ఈ అప్డేట్ తో మిస్టర్ బచ్చన్ పాటలు ఎప్పుడెప్పుడు రిలీజ్ అవుతాయా అని అభిమానులు ఆసక్తిగా చూస్తున్నారు. ఇక ఈ సినిమాలో భాగ్యశ్రీ బొర్సె హీరోయిన్‌గా నటిస్తోండగా, జగపతి బాబు విలన్ పాత్రలో నటిస్తున్నాడు.

రీల్



## ఆగస్టు తరువాతే అఖండ-2

నందమూరి బాలకృష్ణ ప్రస్తుతం తన కెరీర్ లోని 109వ సినిమాను 'ఎన్‌బికె109' అనే వర్కింగ్ టైటిల్ తో తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాను దర్శకుడు బాబీ డైరెక్ట్ చేస్తుండటంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు క్రియేట్ అయ్యాయి. ఇక ఈ సినిమా తరువాత తన నెకట్స్ ప్రాజెక్టులను కూడా బాలయ్య ఓకే చేశారు. ఈ జాబితాలో మాస్ చిత్రాల దర్శకుడు బోయపాటి శ్రీను డైరెక్షన్ లో బ్లాక్ బస్టర్ హిట్ మూవీ 'అఖండ'కు సీక్వెల్ గా 'అఖండ2' ని తెరకెక్కించనున్నాడు. అయితే, ఈ సినిమా షూటింగ్ కు సంబంధించి తాజాగా ఓ వార్త సినీ సర్కిల్స్ లో చక్కర్లు కొడుతోంది. అఖండ 2 చిత్ర షూటింగ్ ఆగస్టు నెల తరువాతే ప్రారంభం కానున్నట్లుగా తెలుస్తోంది. ఇక ఈ సినిమాలో అందాల భామ ప్రగ్యా జైస్వాల్ మరోసారి అలరించనుంది. కాగా, మిగతా నటీనటులు, టెక్నీషియన్ల ఎంపిక ఏమీ జరగలేదని.. అందుకే ఈ చిత్ర షూటింగ్ ఆలస్యం కానుందని తెలుస్తోంది. ఇక ప్రస్తుతం ఈ సినిమా స్క్రిప్టు వర్క్ నడుస్తుందట. కాగా, ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు అఫీషియల్ గా రావాల్సి ఉంది.

రెబల్ స్టార్ ప్రభాస్ రిలీజ్ చేసిన

## సుహాస్ 'జనక అయితే గనక' టీజర్



దిల్ రాజు ప్రొడక్షన్స్ నుంచి వస్తున్న సినిమాలు కంటెంట్ పరంగా కొత్తగా ఉండటం, ఆడియెన్స్ను ఆకట్టుకుంటూ ఉండటం గమనిస్తూనే ఉన్నాం. ఈ బ్యానర్‌పై వచ్చిన బలగం ఎంత సెన్సేషనల్ సక్సెస్ను సొంతం చేసుకుందో అందరికీ తెలిసిందే. లవ్ మీ వంటి డిఫరెంట్ లవ్ స్టోరీ తర్వాత ఈ బ్యానర్పై వస్తోన్న చిత్రం 'జనక అయితే గనక'. శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత ఈ సినిమాను నిర్మించానారు. వెర్సటైల్ యాక్టర్ సుహాస్ హీరోగా నటించిన ఈ చిత్రాన్ని సందీర్ రెడ్డి బండ్ల తెరకెక్కించారు. ఆల్రెడీ ఇప్పటి వరకు వదిలిన ఫస్ట్ లుక్ పోస్టర్ అందరినీ ఆకట్టుకుంది. తాజాగా టీజర్ను చిత్రయూనిట్ వదిలింది. డార్లింగ్, రెబల్ స్టార్ ప్రభాస్ ఈ టీజర్ను సోషల్ మీడియాలో రిలీజ్ చేశారు. 'ఆ ఒక్క నిర్ణయం నా లైఫ్ను మార్చేసింది'.. 'నేను ఒక వేళ తండ్రినైతే.. నా పెళ్లాన్ని సిటీలో ఉన్న బెస్ట్ హాస్పిటల్లో చూపించాలి.. నా పిల్లల్ని బెస్ట్ స్కూల్లో చేర్పించాలి.. మంచి ఎడ్యుకేషన్ ఇప్పించాలి.. బెస్ట్ జీవితాన్ని ఇవ్వాలి.. బెస్ట్ ఇవ్వలేనప్పుడు పిల్లల్ని కనకూడదు'.. అనే డైలాగ్స్.. హీరో ఫ్రస్ట్రేషన్, మిడిల్ క్లాస్ లైఫ్ కష్టాలను ఎంతో ఫన్నీగా చూపించారు. ఫ్యామిలీ ఎమోషన్స్, కామెడీ ఇలా అన్ని అంశాలు సరైన పాళ్లలో ఉన్నాయని ఈ టీజర్ చూస్తే తెలుస్తోంది.

## ఆరుగురు సేవాదార్ల అరెస్టు



**న్యూఢిల్లీ :** ఉత్తరప్రదేశ్‌లోన హత్రాస్‌లో జరిగిన తొక్కిలాటలో ప్రమేయమున్న నిర్వాహక కమిటీ సభ్యులను పోలీసులు అరెస్టు చేశారు. కమిటీలోని ఇద్దరు మహిళలు సహా ఆరుగురు 'సేవాదార్'లను గురువారం అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. తొక్కిసలాటలో 121 మంది దుర్మరణం చెందిన విషయం తెలిసిందే. ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న ఏకైక నిందితుడు పరారీలో ఉన్నాడని, నారాయణ సకకర్ హరి, భోలే బాబాగా పిలవబడే బోధకుడు సూరజ్‌పాలను విచారణ సమయంలో అవసరమైతే ప్రశ్నిస్తామని సీనియర్ అధికారి చెప్పారు. సత్సంగ్ వద్ద సేవాదార్లుగా పనిచేసిన ఆరుగురిని అరెస్టు చేశామని ఐడి షలాభ్ మథూర్ మీడియాకు వెల్లడించారు. అతన్ని పట్టుకున్న వారికి రూ. 1 లక్ష రివార్డును త్వరలోనే ప్రకటిస్తామని, కీలక నిందితుడైన దేవ్‌ప్రకాశ్ మధుకర్‌కు నాన్ బెయిలబుల్ వారంట్ (ఎన్‌బిడబ్ల్యు)ను కూడా జారీ చేస్తామని మథూర్ చెప్పారు. తొక్కిసలాట అనంతరం స్థానిక సికిందర రావ్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌లో నిందితుడిగా సూరజ్‌పాల్ పేర్కొనకపోవడం గమనార్హం.

### పరారీలో భోలే

తొక్కిసలాట ఘటన తర్వాత పరారీలో ఉన్న భోలే బాబాను పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. మెయిన్‌పురిలో బాబాకు చెందిన ఆశ్రమంలో సోదాలు నిర్వహించినా ఫలితం లేకుండా పోయింది. పోలీసులు బలగాలను అక్కడే మోహరించినా, ఇంతవరకు బాబా ఆచూకీ లభ్యం కాలేదు. ఇదిలా ఉండగా ఈ దుర్ఘటనపై బుధవారం తొలిసారిగా భోలే బాబా స్పందించాడు. దర్యాప్తునకు సహకరిస్తామని తెలిపాడు. మెయిన్‌పురిలో భోలే బాబాకు చెందిన నరామ్ కుటీర్ ఛారిటబుల్ ట్రస్ట్‌లో బుధవారం సోదాలు చేశామని, అక్కడే ఆయన కోసం పోలీసుల బలగాలను మోహరించామని డిఎస్‌పి సునీల్ కుమార్ తెలిపారు. 'ఆశ్రమంలో 4050 మంది బాబా అనుచరులు ఉన్నారు. అతడి కోసం వెతికినా ఎక్కడ కనిపించలేదు. ఇప్పటి వరకు బాబా ఆచూకీ గురించి తెలియదు' అని తెలిపారు.

## అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బ్రిటిషు సామ్రాజ్యానికి వ్యతిరేకంగా ఎదురొడ్డి పోరాడిన విప్లవ వీరులు అల్లూరి సీతారామరాజు అన్ని పంచాయిత్ రాజ్, శిశు, మహిళా సంక్షేమ శాఖ మంత్రి సీతక్క కొనియాడారు స్వాతంత్ర్య సమర యోధులు, విప్లవ సేనాని. అల్లూరి సీతారామ రాజు 127వ జయంతి వేడుకలను గురువారం హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క, మాజీ కేంద్ర మంత్రి కృష్ణంరాజు సతీమణీ శ్యామల దేవి తదితరులు ట్యాంక్‌బండ్‌పై ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ గిరిజన హక్కుల కోసం పోరాడిన నాయకుడు అల్లూరి సీతారామరాజు అని,ఆయన చేసిన పోరాటాలు, త్యాగాలు భవిష్యత్ తరాలకు తెలిసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. పార్లమెంట్‌లో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని మంత్రి విజ్ఞప్తి చేశారు.శ్యామల దేవి మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు క్యారెక్టర్‌లో అందరూ ప్రభాస్‌ను చూడాలనుకుంటున్నారన్నారు. వారి అందరీ కోరిక మేరకు అల్లూరి జీవిత చరిత్రపై సినీ హీరో ప్రబాస్‌తో చిత్రం చేయించేందకు యత్నిస్తానని చెప్పారు.

వాయు కాలుష్యంతో

# భారత్‌లో ఏటా 33 వేల మరణాలు

**న్యూఢిల్లీ :** వాయు కాలుష్యం కారణంగా దేశ రాజధాని ఢిల్లీలో ప్రతీ సంవత్సరం 11.5 శాతం మరణాలు (దాదాపు 12,000 మంది) సంభవించి ఉండొచ్చని ప్రముఖ వైద్య పరిశోధన మాసపత్రిక లాన్‌సెట్‌లో ప్రచురితమైన ఓ నివేదిక అంచనా వేసింది. కాలుష్యం కారణంగా దేశంలో అత్యధిక మరణాలు సంభవిస్తుంది ఈ మహానగరంలోనేనని తెలిపింది. భారత్‌లోని మొత్తం పది నగరాలు అహ్మదాబాద్, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, హైదరాబాద్, కోల్‌కతా, ముంబయి, పుణె, సిమ్లా, వారణాసిలో అధ్యయనం చేశారు. ఏటా ఈ నగరాల్లో దాదాపు 33 వేల మరణాలు వాయు కాలుష్యం కారణంగా సంభవించి ఉండొచ్చని నివేదిక తెలిపింది. సిమ్లాలో అత్యల్పంగా 59 మంది మరణించారు. అక్కడ సంభవిస్తున్న మరణాల్లో ఇది 3.7 శాతానికి సమానం. మొత్తం పది నగరాల్లో నమోదైన మరణాల్లో 7.2 శాతం కాలుష్యం వల్లేనని కుండబద్దలు కొట్టింది. భారత్ సహా విదేశీ పరిశోధకులు కలిసి ఈ అధ్యయనం చేశారు. పది నగరాల్లో పిఎం 2.5 కాలుష్య రేణువుల స్థాయి ప్రపంచ ఆరోగ్యసంస్థ ప్రామాణిక పరిమితులను



మించాయని వెల్లడించింది. సంవత్సరంలో 99.8 శాతం రోజులు ఇదే పరిస్థితి ఉంటోందని తెలిపింది. 2008 నుంచి 2019 మధ్య పది నగరాల్లోని సివిల్ రిజిస్ట్రీల నుంచి మరణాల సమాచారాన్ని సేకరించారు. నగరాన్ని బట్టి మూడు నుంచి ఏడేళ్ల డేటా మాత్రమే వారికి లభించింది. మొత్తం 36 లక్షల మరణాలను అధ్యయనం చేశారు. మెషీన్ లెర్నింగ్ సాంకేతికతతో రూపొందించిన అత్యాధునిక పద్ధతుల ద్వారా పీఎం 2.5 రేణువుల స్థాయిలను అంచనా వేశారు. పిఎం 2.5 స్థాయిలు ప్రతీ క్యూబిక్ మీటరుకు 10 మైక్రోగ్రాములు పెరిగిన కొద్దీ మరణాలు 1.42 శాతం అధికమైనట్లు అధ్యయనం గుర్తించింది. పది నగరాల డేటాను కలిపినప్పుడు ఈ పరిస్థితి ఉందని తెలిపింది. విడివిడిగా గమనిస్తే నగరాల మధ్య వ్యత్యాసం భారీగానే ఉందని పేర్కొంది. ఢిల్లీలో మరణాల సంఖ్య 0.31 శాతం పెరిగితే.. బెంగళూరులో అది 3.06 శాతం పెరిగినట్లు వెల్లడించింది. పిఎం 2.5 స్థాయిలు పెరిగినప్పుడు కాలుష్యం అధికంగా ఉన్న నగరాలతో పోలిస్తే తక్కువ ఉన్న వాటిల్లోనే మరణాలు అధికమవుతున్నట్లు గుర్తించామని అధ్యయనం నిర్వహించిన పరిశోధకుల్లో ఒకరైన 'సెంటర్ ఫర్ క్రానిక్ డిసీజ్ కంట్రోల్'కు చెందిన సిద్ధార్థ్ మండల్ వెల్లడించారు. ఇలా వివిధ నగరాల్లో స్వల్పకాలంలో కాలుష్య ప్రభావాన్ని శాస్త్రీయంగా అంచనా వేయడం భారత్‌లో ఇదే తొలిసారని మరో పరిశోధకుడు భార్గవ్ కృష్ణ తెలిపారు. భారతీయుల ఆరోగ్యంపై వాయు కాలుష్య ప్రభావానికి సంబంధించి కీలక విషయాలు దీంతో వెల్లడైనట్లు పేర్కొన్నారు.

## మోదీజీ..అంతరిక్ష యాత్రకు ముందు మణిపూర్ యాత్ర చేపట్టండి : జైరాం



**న్యూఢిల్లీ :** భారత్ తొలి మానవ సహిత అంతరిక్ష యాత్రలో ప్రధాని నరేంద్ర మోదీ అంతరిక్షానికి వెళతారని ఇస్రో చీఫ్ ఎస్.సోమ్‌నాథ్ పేర్కొన్నట్టు వచ్చిన వార్తలను కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ ప్రస్తావించారు. అంతరిక్షానికి వెళ్లే ముందు మన ప్రధాని మణిపూర్ వెళ్లాలని ఎక్స్ వేదికగా ఎద్దేవా చేశారు. 2025లో చేపట్టే గగన్ యాన్ మిషన్‌ను ప్రస్తావిస్తూ ఇస్రో చీఫ్ ఎస్. సోమ్‌నాథ్ వెల్లడించిన వివరాలను ఉటంకిస్తూ జైరాం రమేష్ ప్రధాని మోదీపై సోషల్ మీడియా పోస్ట్‌లో విమర్శలు గుప్పించారు. కాగా మే,2023 నుంచి రెండు వర్గాల మధ్య ఘర్షణలతో ఈశాన్య రాష్ట్రం మణిపూర్ భగ్గుమంటుండగా ఈ ఘటనలపై విపక్ష ఎంపిల నుంచి మోదీ సర్కార్ విమర్శలను ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. మణిపూర్ అంశంపై ప్రధాని మాట్లాడాలని పార్లమెంట్‌లో కూడా విపక్షాలు పట్టుబట్టాయి. ఇక మణిపూర్‌లో సాధారణ పరిస్థితి నెలకొనేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలూ చేపడుతున్నదని ప్రధాని మోదీ బుధవారం రాజ్యసభలో మాట్లాడుతూ స్పష్టం చేశారు. మణిపూర్ అల్లర్లకు సంబంధించి 11000 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని, 500 మందికి పైగా అరెస్ట్ చేశారని తెలిపారు. మణిపూర్‌లో హింసాత్మక ఘటనలు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయని చెప్పారు. మణిపూర్‌లో శాంతి నెలకొనేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని వర్గాలతో సంప్రదింపులు జరుపుతున్నాయని వివరించారు. ఇవాళ రాష్ట్రంలో స్కూళ్లు, కాలేజ్‌లు, కార్యాలయాలు, ఇతర సంస్థలు తెరుచుకున్నాయని తెలిపారు.

# ఎంపిలకు సగటున 50.58% ఓట్లు



**న్యూఢిల్లీ :** ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించిన వారికి సగటున 50.58 శాతం ఓట్లు వచ్చాయి. గత పార్లమెంట్ ఎన్నికల్లో వచ్చిన వాటితో పోల్చితే రెండు శాతం తగ్గాయి. ఈ మేరకు అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) వెల్లడించింది. తమపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు ప్రకటించుకుని విజయం సాధించిన ఎంపిల్లో 40 శాతం మంది గెలుపొందగా, వారికి 50 శాతం, అంతకన్నా ఎక్కువగా ఓట్లు వచ్చాయని ఎడిఆర్ తన నివేదికలో వెల్లడించింది. 543 నియోజకవర్గాలకు గానూ 542 సీట్లలో గెలుపొందిన అభ్యర్థులకు సంబంధించిన ఓట్ల శాతాన్ని ఎడిఆర్ విశ్లేషణ చేసింది. గుజరాత్‌లోని సూరత్ నియోజకవర్గంలో బరిలో ఉన్న అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. కాగా, 2024లో జరిగిన సాధారణ ఎన్నికల్లో పోలైన ఓట్లలో విజయం సాధించిన అభ్యర్థులకు సగటున 50.58 శాతం ఓట్లు సాధించారు. 279 మంది విజేతలు తమ నియోజకవర్గాల్లో పోలైన ఓట్లలో సగం కంటే ఎక్కువ (51 శాతం) వచ్చాయి. 263 మందికి మాత్రం సగం కంటే తక్కువగా (49 శాతం) ఓట్లు పోలయ్యాయి. పెద్ద పార్టీల్లో బిజెపి 239 విజేతలకు గానూ 75 మంది (31 శాతం) 50 శాతం కంటే తక్కువగా ఓట్లు సాధించారు. కాంగ్రెస్‌లో 99 మంది విజేతలకు 57 మందికి (58 శాతం) 50 శాతం కంటే తక్కువగా ఓట్లు వచ్చాయి. అదే విధంగా ప్రాంతీయ పార్టీలను పరిశీలిస్తే... ఎస్‌పి నుంచి 37 మంది గెలుపొందగా, వారిలో 32 మందికి (86 శాతం) తృణమూల్‌లో 29 మందికిగానూ 21 ఎంపిలకు (72 శాతం), డిఎంకెలో 22 మందికి గానూ 14 మంది ఎంపిలకు (64 శాతం), 50 శాతం కంటే తక్కువగా ఓట్లు సాధించారు. క్రిమినల్ కేసులు ఉండి విజయం సాధించిన 251 ఎంపిల్లో 106 మందికి (42 శాతం) 50 శాతం కంటే అధికంగా ఓట్లు వచ్చాయి. 503 మంది కోటీశ్వరులలో 262 మంది ఎంపిలు (52 శాతం) 50 శాతం కంటే ఎక్కువగా ఓట్లు సాధించుకున్నారు. కోటీశ్వరులుకాని 39 మందిలో 17 మంది ఎంపిలు (44 శాతం) కూడా 50 శాతం కంటే అధికంగా ఓట్లు రాబట్టుకున్నారు. ఓటర్ల సంఖ్య పెరిగినప్పటికీ 2024లో ఎన్నికల్లో గెలుపొందిన ఎంపిలకు సగటున 33.44 శాతం ఓట్లు వచ్చాయి. 2019లో ఆ సంఖ్య 35.46 శాతంగా ఉంది. గెలుపొందిన ఐదుగురు ఎంపిలకు కేవలం రెండు వేల మెజారిటీ మాత్రమే లభించింది. మరో ఐదుగురికి 50 శాతాకానిపైగా మెజారిటీ వచ్చింది. ఇండోర్ నుంచి శంకర్ లాలన్ వాని (బిజెపి) 64.56 శాతం, విడిశా నుంచి శివరాజ్‌సింగ్ చౌహాన్ (బిజెపి) 56.43 శాతం మెజారిటీతో విజయం సాధించారు. 542 మంది విజేతల్లో 74 మంది మహిళలు ఉన్నారు. మహిళా విజేతల్లో క్రితి దేవ్ డెబ్బర్‌మన్ (బిజెపి) అత్యధిక ఓట్లు సాధించారు. ఆమెకు 68.54 శాతం ఓట్లు రాగా, 42.92 శాతం మెజారిటీతో గెలుపొందారు. లోక్‌సభకు తిరిగి ఎన్నికైన 214 మంది ఎంపిల్లో 101 మంది సభ్యులు (47 శాతం) 50 శాతానికిపైగా ఓట్లు సాధించారు. అదే విధంగా 92 మంది పది శాతంకంటే తక్కువ మెజారిటీతో విజయం సాధించారు. కాగా, 2024లో నోటాకు 0.99 శాతం ఓట్లు వచ్చాయి. 2019లో పోల్చితో 1.06 శాతం తగ్గాయి. ఇదిలా ఉండగా 2024 సాధారణ ఎన్నికల్లో 66.12 శాతం ఓటింగ్ నమోదైంది. 2019తో (67.35 శాతం) పోల్చితే తగ్గింది.

# బీహార్‌లో కూలిన మరో బ్రిడ్జి..

### 16 రోజుల్లో ఇది 10వ ఘటన

**పాట్నా** : బీహార్‌లో వంతెనలు కూలిపోయే పర్వం కొనసాగుతూనే ఉంది. అవి పేకమేడలా ఒకదాని తర్వాత మరొకటి కూలిపోతున్నాయి. గత 24 గంటల్లోనే సరన్ ప్రాంతంలో రెండు వంతెనలు కూలగా.. తాజాగా జులై 24న అలాంటి సంఘటన మరొకటి చోటు చేసుకుంది. 16 రోజుల్లో ఇది 10వ సంఘటన. ఈ వంతెనను 15 ఏళ్ల క్రితం నిర్మించారని.. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని జిల్లా మెజిస్ట్రేట్ (డిఎం) అమన్ సమీర్ క్లారిటీ ఇచ్చారు. గండకి నదిపై నిర్మించిన ఈ వంతెన సరన్‌లోని కొన్ని గ్రామాలను సివాన్ జిల్లాతో కలుపుతుంది. 'సరన్ ప్రాంతంలో గురువారం కూలిన చిన్న వంతెనను 15 ఏళ్ల క్రితం నిర్మించారు. ఈ వంతెన కూలిపోవడానికి కచ్చితమైన కారణాలేంటో ఇంకా తెలియరాలేదు. అయితే.. ఇటీవల అక్కడ డీసిల్టింగ్ పని జరిగింది. ఈ వంతెన కూలడానికి గల కారణాలు తెలుసుకునేందుకు విచారణ చేపట్టాం. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు' అని అమన్ సమీర్ మీడియాకు తెలిపా రు. ఈమధ్య కాలంలో జిల్లాలో చిన్న వంతెనలు వ రుసగా కూలిపోతున్నాయని.. అందుకు గల కారణాల్ని తెలుసుకునేందుకు ఉన్నస్థాయి విచారణకు ఆదేశించామని పేర్కొన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇదిలావుండగా.. జి ల్లాలో గత కొన్ని రోజుల నుంచి భారీ వర్షం కురుస్తోందని, దాని వల్లే ఈ వంతెన కూలిపోయి ఉం డొచ్చని స్థానికులు చెప్తున్నారు.

కాగా.. గత 16 రోజుల్లో సివాన్, సరన్, మధుబని, అరారియా, తూర్పు చంపారన్, కిషన్‌గంజ్ జిల్లాల్లో కలుపుకొని మొత్తం 10 వంతెనలు కూలిపోయాయి. ఈ నేపథ్యంలోనే.. బిహార్ రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇప్పటికే సిఎం నితీశ్ కుమార్ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. పాత వంతెనలపై సర్వే నిర్వహించాలని.. తక్షణ మరమ్మత్తులు అవసరమయ్యే వాటిని గుర్తించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రోడ్డు ని ర్మాణ శాఖ ఇప్పటికే వంతెన నిర్వహణ విధానాన్ని సిద్ధం చేసిందని, గ్రామీణ పనుల శాఖ తక్షణమే తన ప్రణాళికను రూపొందించాలని ఆయన చెప్పారు.

